PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 228 | విజయవాడ, శుక్రవారం 21 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 21 March 2025 | Rs

టీ షర్టులే అడ్డంకా?

- 'డీ లిమిటేషన్'పై తమిళ ఎంపిల నిరసన సాకుతో ఉభయ సభలు వాయిదా

7



ఐపిఎల్‌లో రెండు కొత్త రూల్స్

- బంతిపై లాలాజలం పూతపై నిషేధం ఎత్తివేత
- రెండో ఇన్నింగ్స్‌లో రెండు కొత్త బంతులు

8

జెసిబి యంత్రాలతో నేలమట్టం

పంజాబ్ సరిహద్దుల్లో రైతు శిబిరాలపై పోలీసుల దాష్టీకం

- పోలీసుల అదుపులో వందమంది రైతులు, నేతలు
- రెస్ట్‌హౌస్‌కు దల్లేవాల్ తరలింపు



శంభు సరిహద్దులో రైతుల నిరసన శిబిరాలను జెసిబిలతో తొలగిస్తున్న పోలీసులు

అమృతసర్ : రైతులను నిర్బంధించడానికి, వారిపై పోలీసులు అణచివేత చర్యలకు పాల్పడడానికి నిరసనగా పంజాబ్‌వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. వందమందికి పైగా రైతులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని రైతు సంఘాలు తెలిపాయి. శంభు, ఖానౌరి ఏరియాల్లో ఏడాది కాలంగా ఆందోళన చేస్తున్న రైతులను పంజాబ్ పోలీసులు బలవంతంగా తరలించి, నిరసన ప్రాంతాల్లో రోడ్లను క్లియర్ చేస్తున్నారు. సరిహద్దులను తిరిగి తెరవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పంజాబ్ మంత్రి హర్పాల్ సింగ్ చీమా సమర్థించుకున్నారు. కాంగ్రెస్, అకాలీదళ్ నేతలు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించాయి. కేంద్ర ప్రభుత్వంతో రైతు నేతల తదుపరి దఫా చర్చలు మే 4న జరగనున్నాయి.

పోలీసుల అరాచకం, అణచివేత

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలు, వేదికలను తొలగించిన వెంటనే రెండు హైవేలపైనా రాకపోకలకు మార్గం సుగమం చేస్తామని పోలీసులు చెప్పారు. రైతులు పెట్టుకున్న ట్రాలీలను, ఇతర వాహనాలను అక్కడ నుండి తీసివేస్తున్నారు. పోలీసుల అణచివేత చర్యలతో శంభు సరిహద్దు ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. బుధవారం వరకు ఈ తాత్కాలిక నిర్మాణాలు, ట్రాలీలే రైతులకు ఆశ్రయం కల్పించాయి. గురువారం నాటికి ఒక్కసారిగా అవన్నీ నేలమట్టమయ్యాయి. ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు వీలుగా జెసిబి యంత్రాలతో వాటన్నింటినీ శిథిలాల గుట్టగా మార్చేశారు. వంటకు ఉపయోగించే పాత్రలు, గ్యాస్ సిలిండర్లు, టీ కెటిళ్ళు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, కుర్చీలు, టేబుళ్ళు, పరుపులు, బట్టలు ఇలా గతేడాది ఫిబ్రవరి నుండి రైతులు ఉపయోగించిన ప్రతీ వస్తువూ రోడ్లపై చెల్లాచెదురుగా పడి వున్నాయి. తమకు ముందుగా ఎలాంటి సమాచారం అందించలేదని, అకస్మాత్తుగా పోలీసులు వచ్చి విధ్వంసానికి దిగారని రైతు నేత ఒకరు చెప్పారు. పోలీసులు ఈ చర్యలకు దిగడానికి ముందుగా భారీ ఎత్తున భద్రతా బలగాలను మోహరించారు. అందులో అంబులెన్సులు, బస్సులు, అగ్నిమాపక యంత్రాలు, అల్లర్ల నిరోధక బృందాలు వున్నాయి. దాదాపు మూడు వేల మంది పోలీసులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. అక్కడ నుండి ఖాళీ చేయడానికి రైతులకు కేవలం పది నిముషాలు సమయమిచ్చారు. లేనిపక్షంలో వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో తరలిస్తామని హెచ్చరించారు.

రెస్ట్‌హౌస్‌కు దల్లేవాల్ తరలింపు

కేంద్ర ప్రతినిధి బృందంతో బుధవారం సమావేశానంతరం తిరిగి వస్తుండగా సర్వాన్ సింగ్ పాంథర్, జగ్‌జిత్ సింగ్ దల్లేవాల్‌తో సహా పలువురు రైతు నాయకులను మొహాలీలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దల్లేవాల్‌ను గురువారం జలంధర్ కంటోన్మెంట్‌లోని పిడబ్ల్యుడి రెస్ట్ హౌస్‌కు తరలించారు. అక్కడ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. గతేడాది నవంబరు 26 నుండి నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు డాక్టర్ల బృందం పర్యవేక్షిస్తోంది. తెల్లవారు జామున 1.35 గంటల సమయంలో పంజాబ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు ఆయనను తీసుకువచ్చారు. అనంతరం రెస్ట్ హౌస్‌కు తరలించారు. బారీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. దల్లేవాల్‌ను కలవడానికి ఎవరినీ అనుమతించడం లేదు.

ధర్నాలకు పిలుపు

పోలీసుల అణచివేత చర్యలను కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కెఎంఎస్‌సి) నాయకుడు సత్నాం సింగ్ పన్నూ తీవ్రంగా ఖండించారు. కేంద్రంతో కుమ్మక్కైన పంజాబ్ ప్రభుత్వం రైతులపై అణచివేతకు పాల్పడుతోందని విమర్శించారు. వెంటనే సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాల నేతృత్వంలో రైతులు మిగతా 7లో

మాట నిలబెట్టుకున్నాం

ఎస్‌సి వర్గీకరణపై శాసనసభలో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్సి వర్గీకరణపై ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. శాసన సభలో షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై గురువారం నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడుతూ ఎస్సి ఉపకులాల్లో సమన్యాయం కోసం సుప్రీం కోర్టు తీర్పు మేరకు వర్గీకరణ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయాలని నిర్ణయించినట్లు, నూతన జనాభా లెక్కింపు పూర్తయిన అనంతరం వర్గీకరణను జిల్లా యూనిట్‌గా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. 30 ఏళ్ల కిందట ఎస్సి వర్గీకరణకు తానే కమిటీ వేశానని, నాటి నుంచి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చేంత వరకూ సుదీర్ఘ ప్రయాణంలో భాగస్వామిగా ఉన్నానని తెలిపారు. 2024 నవంబరు 15న ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ వేశామని, ఆయన ఈ నెల 10వ తేదీన సమగ్ర నివేదిక సమర్పించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో వెనుకబడిన కులాలకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదని, వారి సంక్షేమాన్ని పట్టించుకోలేదని చెప్పారు. తూర్పు కాపులకు కుల ధృవీకరణ పత్రాలు ఇచ్చే అంశం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

బుడగ జంగాలలను ఎస్సిల్లో చేర్చాలని తీర్మానం

బుడగ జంగాలలను ఎస్సిల్లో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ శాసనసభ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... బుడగ జంగాల స్థాయి ఏమిటో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. చాలా తక్కువ సంఖ్యలో ఉన్న వీరిని ఎస్సిలుగా గుర్తించాలని కోరుతూ తీర్మానాన్ని ఆయన ప్రవేశపెట్టగా.. సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

చంద్రబాబు, మంద కృష్ణలే కారణం : పవన్

ఎస్సి వర్గీకరణ ప్రక్రియ ఈ స్థాయికి చేరుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంద కృష్ణే కారణమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు.

శాసన సభలో ఎస్సివర్గీకరణపై చర్చలో ఆయన మాట్లాడుతూ, వర్గీకరణకు బీజం వేసింది మంద కృష్ణ, రూపకర్త చంద్రబాబు, ఫలప్రధాత మోడీ అని అన్నారు. ఈ చర్చలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, బి.రామాంజనేయులు, కొండ్రు మురళీమోహన్, మందపాటి వెంకటపతిరాజు, బొనెల విజయచంద్ర, కాలవ శ్రీనివాసులు, పితాని సత్యనారాయణ, కొణతల రామకృష్ణ, పి.సునీల్ కుమార్, తంగిరాల సౌమ్య తదితరులు ప్రసంగించారు.

క్యూబాను ఆదుకుందాం

- సిఐటియు పిలుపు

7

అర్బన్‌లో 'మీ' సేవ కేంద్రాలు తిరిగి ప్రారంభించండి

- విజ్ఞాపన దీక్షల్లో సిహెచ్ నాగేశ్వరరావు

2

దండకారణ్యం రక్తసిక్తం



మృతదేహాలను తీసుకెళ్లుతున్న భద్రతా సిబ్బంది

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి
- డిఆర్‌జి జవాన్ కూడా
- మూడు నెలల్లో 77 మంది మరణం
- 125కు పైగా గ్రామాల్లో హిడ్మా కోసం సెర్చ్ ఆపరేషన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో, చర్ల

పచ్చటి అడవులు రక్తసిక్తమయ్యాయి. తాజాగా సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 30 మంది మావోయిస్టులు, ఓ డిఆర్‌జి జవాన్ ప్రాణాలు కోల్పోయారు. 2026 నాటికి మావోయిస్టుల్లేకుండా చేయాలన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆదేశాలతో.. దండకారణ్యంలోని ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది.

ఏం జరిగింది..?

బీజాపూర్, దంతెవాడ సరిహద్దు గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ కోసం ఓ ఉమ్మడి బృందం బయలుదేరింది. సమీపంలోని అటవీ ప్రాంతంలో నుంచి కాల్పుల మోత వినిపించగా.. భద్రతా దళాల ఎదురు కాల్పులతో ఆ పరిసర ప్రాంతం దద్దరిల్లింది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో 26 మంది మావోయిస్టులు మరణించారు. కాంకేర్ జిల్లా అడవుల్లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు చనిపోయారు. మృతదేహాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. గంగలూరు నుంచి సుమారు 30 కిలోమీటర్లు కాలినడకన వెళ్లిన సైనికులు ఘటనా స్థలం నుంచి తిరిగి రావడానికి నానా అవస్థలు పడ్డారని ఐజి తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి ఎకె 47, ఎస్‌ఎల్‌ఆర్, ఐఎన్‌ఎస్‌ఎఎస్ 303, 315 బోర్, 12 బోర్, బర్మార్ మొదలైన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను తీసుకొస్తున్న జవాన్లకు డిఐజి కమలోచన్ కస్యప్, బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదురెళ్లి అభినందనలు తెలిపారు. ఆండ్రి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో డిఆర్‌జి బలగాలకు చెందిన జవాను మరణించినట్లు ఎస్‌పి చెప్పారు. ఎదురుకాల్పుల్లో డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, మహిళా కమాండోలు పాల్గొన్నట్టు వివరించారు.

హిడ్మా కోసం గాలింపు

రాబోయే రోజుల్లో మావోయిస్టులపై పెద్ద ఎత్తున దాడులు జరిపేందుకు కేంద్రం తన బలగాలను రంగంలోకి దింపింది. మావోయిస్టు కమాండర్ హిడ్మా కోసం భద్రతా దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. హిడ్మాను వెతకడానికి 125కు పైగా గ్రామాల సాంకేతిక మ్యాపింగ్ జరుగుతోంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న దాదాపు 125 గ్రామాల థర్మల్ ఇమేజింగ్‌ను మిగతా 7లో

శాసనసభలో ఏకపక్షం..మండలిలో ప్రతిఘటన

- ప్రభుత్వ 'విజన్' జపం
- ఒక రోజు ముందే ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



ప్రజాప్రతినిధుల క్రీడోత్సవాల్లో విజేతగా నిలిచిన జట్టుకు కప్ అందజేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ (వార్త 6లో)

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

శాసనసభలో ఏకపక్షం, శాసన మండలిలో విపక్షం ప్రతిఘటన... ఇవీ పక్షం రోజులపాటు నిర్వహించిన ఎపి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కనిపించిన సన్నివేశాలు. గత వైసిపి ప్రభుత్వానికి భిన్నంగా, అంతకుముందుకు మల్లే వీలైనన్ని ఎక్కువ రోజులు సమావేశాలు నిర్వహిస్తామన్న టిడిపి కూటమి ప్రభుత్వం, ముందుగా నిర్ణయించినదానికంటే ఒక రోజు ముందే ముగించింది. ఫిబ్రవరి 24న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగా గురువారం మధ్యాహ్నం ఉభయ సభలూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. సెలవులు పోను మార్చి 21 వరకు 17 రోజులపాటు సమావేశాలు నిర్వహించాలని సభా వ్యవహారాల సలహా కమిటీ (బిఎసి)లో తొలుత నిర్ణయించారు. అంతకంటే ఒక రోజు ముందు మార్చి 20న ముగించారు. గవర్నర్ ప్రసంగం రోజును మినహాయిస్తే శాసనసభ 15 రోజులే జరిగింది. మండలి మధ్యలో ఒక రోజు సమావేశం కాలేదు. అందువల్ల మండలి 14 రోజులే భేటీ అయింది.

వైసిపి ఒక్క రోజు

సమావేశాల తొలి రోజు గవర్నర్ ప్రసంగానికి వైసిపి ఫ్లోర్ లీడర్ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలు హాజరై శాసనసభలో వైసిపికి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నిరసన తెలిపి వాకౌట్ చేశారు. ఆ ఒక్క రోజే వైసిపి ఎమ్మెల్యేలు శాసనసభకొచ్చారు. తతిమ్మా అన్ని రోజులూ సభకు దూరంగా ఉన్నారు. దాంతో శాసనసభలో ప్రతిపక్షం లేకుండా పోయింది. సభలో చర్చలన్నీ ముఖ్యమంత్రి, కూటమి మంత్రులు, ఎంఎల్‌ఎల స్వోత్కర్ష, ఆత్మస్తుతి, పరనిందలకు పరిమితమయ్యాయి. ఏ అంశం చర్చకొచ్చినా సిఎం, మంత్రులు 'స్వర్ణాంధ్ర 2047', పి-4లను వల్లె వేశారు. కాగా వైసిపికి ప్రతిపక్ష హోదాపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రూలింగ్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం వైసిపికి సభలో ఉన్న బలానికి ప్రతిపక్ష హోదా రాదన్నారు. వైసిపి సభ్యులు సభకు హాజరు కాకుండా దొంగల మాదిరి సంతకాలు పెట్టారని సమావేశాల చివరి రోజున పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సభకు వైసిపి హాజరు కాకపోవడం వలన ప్రభుత్వ వైఫల్యాలను, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై నిలదీసే, విపక్ష పాత్ర పోషించే అవకాశాన్ని ఆ పార్టీ జారవిడుకొని విమర్శలపాలైంది. ఈ పరిస్థితిని అధికారపక్షం చాకచక్యంగా తనకుఅనుకూలంగా మార్చుకుంది. కాగా కొన్నేళ్లలో ఈ సారి ఎక్కువ రోజులు అసెంబ్లీ భేటీ కావడం, ప్రశ్నోత్తరాలు, లఘు చర్చలు, 344, సావధాన తీర్మానం, జీరో అవర్ వంటివి నిర్వహించడం సానుకూలాంశం. ఆయనప్పటికీ సభ 85 గంటలకుపైగా జరిగినా సభ్యులందరికీ మాట్లాడటానికి అవకాశం రాలేదు. సహకార బ్యాంకుల్లో అవినీతిపై సమగ్రమైన విచారణ కోసం ఒక సభ్యుడు ప్రవేశపెట్టిన ప్రైవేటు తీర్మానం ఆమోదమైంది. హౌస్ కమిటీ వేయాల్సి ఉంది. ప్రైవేటు యూనివర్శిటీలు సహా 9 ప్రభుత్వ బిల్లులు ఆమోదం పొందాయి.

మండలిలో సర్కారు ఇరకాటం

మండలిలో వైసిపికి మెజార్టీ ఉండటంతో ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో ఇరకాటంలో పడింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు సహా పలు అంశాలపై వైసిపి నిలదీసింది. వాకౌట్‌ల వంటి ఆందోళనలు చేసింది. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కీలక అంశాలపై ప్రభుత్వాన్ని కొంత వరకు నిలదీశారు. అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలపై మంత్రులు క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది. ఒక్కోసారి వైసిపి సభ్యులు సరైన వ్యూహం లేక తొట్రుపాటుకు గురయ్యారు. మొత్తం ఐదుగురు వైసిపి ఎంఎల్‌సిల రాజీనామాలు ఆ పార్టీకి షాక్. మండలిలో ప్రతిపక్షానికి మెజార్టీ ఉండటంతో మంత్రుల్లో చాలా మంది ఇక్కడే మోహరించారు. మరోవైపు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ప్రజా సమస్యలను మిగతా 7లో



సమావేశంలో మాట్లాడుతున్న మధు, వేదికపై రామకృష్ణ , చలసాని తదితరులు

కేంద్ర బడ్జెట్ సవరణ లేకుండా ఆమోదం పొందితే

రాష్ట్రానికి శాశ్వత నష్టం

ప్రత్యేక హోదా సాధన సమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌ను జిల్లాగా, పోలవరంను డెడ్ స్టోరేజి ప్రాజెక్టుగా పేర్కొన్నారని, వాటిని సవరించకుండా ఆమోదం తెలిపితే రాష్ట్రానికి శాశ్వత నష్టం కలుగుతుదని ప్రత్యేక హెూదా, విభజన హామీల సాధన సమితి పేర్కొంది. వాటిని తక్షణం సవరించాలని డిమాండ్ చేసింది. గురువారం బాలోత్సవ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రత్యేక హెూదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, సిపిఎం మాజీ ఎంపి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఈ మేరకు ఎంపిలకు రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. తాము సూచించిన సవరణలు చేయడం ద్వారా రాష్ట్రానికి ఉపయోగం ఉంటుందని, దీనిపై సిఎం జోక్యం చేసుకుని సవరణకు పట్టుబట్టాలని కోరారు. ముఖ్యంగా ఎపిని జిల్లాగా, పోలవరం ప్రాజెక్టును డెడ్ స్టోరేజీ ప్రాజెక్టుగా కేంద్ర బడ్జెట్లో పేర్కొన్న పదజాలాన్ని సవరించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రితో పాటు కేంద్ర పెద్దల వద్ద పలుకుబడి ఉందని చెబుతున్న పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకుని పదజాలాన్ని సవరించేలా చూడాలని, అత్యంత కీలక విషయంగా దీన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రత్యేక హెూదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ మిగతా 7లో

భారత స్కాలర్ నిర్బంధం

వాషింగ్టన్ : వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన భారతీయ స్కాలర్ బాదర్ ఖాన్ సూరిని ట్రంప్ ప్రభుత్వం నిర్బంధించింది. సూరిని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం అదుపులోకి తీసుకున్నదని, ప్రభుత్వం ఆయన వీసాను రద్దు చేసిందని యూనివర్సిటీ తాత్కాలిక అధ్యక్షుడు రాబర్ట్ గ్రోవ్స్ వర్సిటీ డైరెక్టర్ల బోర్డుకు తెలిపారు. సూరి నిర్బంధానికి కారణమేమిటో వివరించలేదని గ్రోవ్స్ పేర్కొన్నారు. వర్జీనియాలోని అర్లింగ్టన్ సమీపంలో ఉన్న రోస్లిన్‌లో ఇంటి వెలుపల ఉన్న సూరిని ముసుగులు ధరించిన ఏజెంట్లు 17వ తేదీ రాత్రి అరెస్ట్ చేశారు. హమాస్‌కు అనుకూలంగా ప్రచారం చేయడమే కాకుండా సామాజిక మాధ్యమాలలో యూదుల పట్ల ద్వేషాన్ని కనబరుస్తున్నారని, హమాస్ సీనియర్ సలహాదారు ఒకరితో సన్నిహిత సంబంధాలున్నాయని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్‌ఎస్) ప్రతినిధి ట్రిసియా మెక్లాలిన్ చెప్పారు. సూరి భార్య అమెరికా పౌరురాలు, వారికి అరాఫత్ అనే కుమారుడు ఉన్నాడు. ఆమెకు పాలస్తీనా వారసత్వం ఉన్నదన్న కారణంతో సూరిని శిక్షిస్తున్నారని, ప్రస్తుతం లూసినియాలో ఉన్న సూరి ఇమ్మిగ్రేషన్ కోర్టులో విచారణ కోసం ఎదురుచూస్తున్నారని ఆయన న్యాయవాది హస్సన్ అహ్మద్ తెలిపారు.

గాజాపై భూతల దాడులు

- ఇజ్రాయిల్ దాష్టీకంతో 3 రోజుల్లో 200మంది చిన్నారులు కన్నుమూత
- హమాస్, హౌతి ప్రతిదాడులు

డేర్ అల్ బాలాహ్ : కాల్పుల విరమణ ఒప్పందానికి మధ్యలోనే తూట్లు పొడిచి విచక్షణారహితంగా దాడులు చేపట్టిన ఇజ్రాయిల్ మిలటరీ గురువారం నుండి గాజాపై భూతల దాడులను తిరిగి ప్రారంభించింది. గత మూడు రోజులుగా ఇజ్రాయిల్ వైమానిక దాడులు, తాజాగా భూతల దాడులతో 200మంది వరకు చిన్నారులు మరణించారని, మొత్తంగా 506మంది ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఉత్తర ప్రాంతమైన బెయిట్ లాహియా ఏరియాలో గురువారం తెల్లవారుజాము నుండి జరిగిన దాడుల్లో 85మంది మరణించగా, 133మంది గాయపడ్డారు. ఖాన్ యూనిస్ సమీపంలో జరిగిన బాంబు దాడుల్లో పది మంది మరణించారని పాలస్తీనా సహాయక బృందాలు వెల్లడించాయి. జనవరి మధ్య నుండి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో నెలకొన్న నిశ్శబ్ద వాతావరణం ఈ దాడులతో చెదిరిపోయింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కాపాడాలని అంతర్జాతీయ సమాజం ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఇజ్రాయిల్ పట్టించుకోవడం లేదు. సెంట్రల్, దక్షిణ గాజా ప్రాంతాల్లో భద్రతా వలయాన్ని విస్తరించేందుకు, ఉత్తర, దక్షిణ గాజాల మధ్య పాక్షిక బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసేందుకు తాము భూతల ఆపరేషన్లు తిరిగి ప్రారంభిస్తామని బుధవారమే ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. బందీలను వెనక్కి పంపడానికి, అధికారం నుండి హమాస్‌ను తొలగించడానికి పాలస్తీనియన్లకు ఇదే చివరి హెచ్చరిక అంటూ ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ వీడియో విడుదల చేశారు. ఇప్పటికీ చర్చలకు సిద్ధంగానే వున్నామని, దాడులను ఆపేందుకు అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకోవాలని హమాస్ కోరుతోంది. మార్చి మొదటివారంలో మొదటి దశ ముగిసిన తర్వాత కాల్పుల విరమణ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చలు మిగతా 7లో



ఇజ్రాయిల్ దాడుల కారణంగా దక్షిణ గాజాలో ధ్వంసమైన భవనాలు

విజయ్, రానాపై కేసు

- బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ ఎఫెక్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేసిన సినీ ప్రముఖులపై రంగారెడ్డి జిల్లా మియాపూర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రమోద్‌శర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమారు 25 మంది సినీ ప్రముఖులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సిఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ చేస్తున్న సినీ ప్రముఖులపై చర్యలు తీసుకోవాలని ప్రమోద్ శర్మ అనే వ్యక్తి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఎఫ్ఐఆర్ నెంబర్ 393/2025 కింద కేసులు సెక్షన్లు 318 (4) 112, 49 బిఎన్‌ఎస్ 3,3(ఎ) 4, టిఎస్ జిఎ, 66-డి ఐటిఎ2000-2008 సెక్షన్ల కింద పలువురు సినీ ప్రముఖులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదైన వారిలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రకాశ్‌రాజ్, నిధి అగర్వాల్, యాంకర్ శ్యామలతోపాటు మరికొందరి పేర్లు ఉన్నాయి. తదుపరి విచారణ అనంతరం వివరాలను వెల్లడిస్తామని సిఐ తెలిపారు. కాగా నటి విష్ణుప్రియ గురువారం విచారణకు హాజరయ్యారు. బెట్టింపు యాప్స్‌కు సంబంధించిన వివిధ అంశాలపై పోలీసులు ఆమెను ప్రశ్నించినట్లు సమాచారం.

16 వేలకు పైగా కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీ

- ప్రభుత్వ అనుమతి రాగానే నియామకం
- శాసనసభలో హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మొత్తం 16,862 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో పోలీస్ కానిస్టేబుల్స్ నియామకం, సిఐలకు డిఎస్‌పిలుగా ప్రమోషన్లు గురించి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాలరామకృష్ణ అడిగిన ప్రశ్నలకు ఆమె జవాబిస్తూ వీటిలో 6,100 పోస్టుల నియామకం త్వరలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 10,762 ఖాళీల నియామకానికి సంబంధించి ప్రభుత్వానికి, డిజిపికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనుమతులు రాగానే మిగిలిన ఆ నియమాకాలు కూడా చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు బెటాలియన్లు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని, ట్రైబల్ యూనివర్శిటీ ఏర్పాటు గురించి కేంద్రానికి కూడా ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పోలీసుల ఆరోగ్య భద్రత్కఉ సంబంధించి కొన్ని ప్రతిపాదనలు రూపొందించి సిఎం, హోమ్ సెక్రటరీ, డిజిపిలతో చర్చించినట్లు చెప్పారు. హైబ్రిడ్ మోడ్‌లో కానిస్టేబుల్ స్థాయి నుంచి అందరికీ రూ.10నుంచి రూ.15లక్షల వరకు ఆరోగ్యభద్రత కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. త్వరలోనే ఈ విషయంపై నిర్ణయం తీసుకుని పోలీసులసంక్షేమం కోసం అమలు చేస్తామన్నారు. పోలీస్ ఇనెస్పెక్టర్ల ప్రమోషన్లపై మాట్లాడుతూ డిఎస్‌పి పదోన్నతులు ఇవ్వకపోవడానికి హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం సీనియారిటీ జాబితాను సవరించడమేనన్నారు. 2017లో హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 2018లో సీనియారిటీ జాబితాను ప్రభుత్వం జారీ చేసిందన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

శాసన సభలో ఐదు కమిటీల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసన సభ సభ్యులతో ఐదు కమిటీలను సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు నియమించారు. ఇందుకు సంబంధించిన వివరాలు అసెంబ్లీ కార్యదర్శి ప్రసన్న కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కమిటీలను ఏడాది కాలానికి నియమించినట్లు వెల్లడించారు. నియమాల కమిటీ కమిటీకి ఛైర్మన్‌గా, సభాపతి అయ్యన్నపాత్రుడు వ్యవహరిస్తారని, సభ్యులుగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, పత్సామల ధర్మారాజు, గద్దె రామమోహన్, కిమిడి కళా వెంకట్రావు, యలమంచిలి సత్యనారాయణలు ఉన్నారు. ఫిర్యాదుల కమిటీ ఛైర్మన్‌గా ఉప సభాపతి కె రాఘురామ కృష్ణరాజు వ్యవహరిస్తారు, సభ్యులుగా గంటా శ్రీనివాసరావు, గురజాల జగన్‌మోహన్, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, పెనుమత్స విష్ణుకుమార్ రాజులు ఉన్నారు. ఎథిక్స్ కమిటీ ఛైర్మన్ మండలి బుద్ధప్రసాద్, సభ్యులుగా బత్తుల బలరామకృష్ణ, బాష్యం ప్రవీణ్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జ్యోతుల నెహ్రూ, కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి, ముప్పిడి వెంకట్రావులు ఉన్నారు.

ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్‌గా పితాని సత్యనారాయణ, సభ్యులుగా పుసపాటి అదితి విజయలక్ష్మీ, బండారు సత్యనారాయణరావు, బొగ్గుల దస్తగిరి, పత్సామల ధర్మరాజు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మామిడి గోవిందరావులు ఉన్నారు. ప్రభుత్వ హామీలు కమిటీ ఛైర్మన్‌గా కామినేని శ్రీనివాస్, సభ్యులుగా అమిలినేని సురేంద్రబాబు, దామచర్ల జనార్ధనరావు, గిడ్డి సత్యనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నంద్యాల వరదరాజుల రెడ్డి, కలిదిండి సూర్యనాగ సన్యాసి రాజు ఉన్నారు.

రేపు ఎర్త్ అవర్ పాటించండి : గవర్నర్ పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ ఎర్త్ అవర్ గ్లోబల్ ఉద్యమంలో భాగంగా మార్చి 22న రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఒక గంట పాటు అన్ని అవసరమైన లైట్లను స్వచ్ఛందంగా ఆపి వేసి ఎర్త్ అవర్ పాటించాలని గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజ్‌భవన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. వాతావరణ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ ఏకం చేస్తూ భవిష్యత్తు తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించడంలో ఈ కార్యక్రమం సహాయపడుతుందని గవర్నర్ పేర్కొన్నారు.

పని భారం తగ్గించండి

- వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి తీసుకోండి
- ధర్నాలో గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

'వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి తీసుకు రావాలి. పనిభారం తగ్గించాలి. బదిలీ సౌకర్యం కల్పించాలి. ఎంపిహెచ్ఏ(ఎఫ్)గా ప్రమోషన్లు కల్పించాలి.' అంటూ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (యుహెచ్ఎస్ఎ) ఆధ్వర్యంలో గురువారం విజయవాడ ధర్నా చౌక్‌లో సమస్యల పరిష్కారం కోసం వారు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగాచేసిన నినాదాలతో విజయవాడ ధర్నా చౌక్ మారుమ్రోగింది. ఈ సందర్భంగా యుహెచ్ఎస్ఎ గౌరవాధ్యక్షులు కె.జగన్మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆ సంఘ గౌరవ సలహాదారు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ వర్కర్లు వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖల మధ్యలో అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ సెక్రటరీలు రోజుకు 12 గంటలకుపైగా పనిచేయాల్సి వస్తోందని, ఎనిమిది గంటల పని విధానం అమలు కావడం లేదన్నారు. వారిని డిపార్టుమెంట్ పనులకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్టు ప్రకారమే పనులు చేయించాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు పలు పర్యాయాలు వినతులు చేసినా స్పందన లేకపోవడంతోనే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని అన్నారు. ఇప్పటికి సమస్య పరిష్కరింకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యుహెచ్ఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు ఎ.మాధవి, కార్యనిర్వహక అధ్యక్షులు కె.అన్నయ్య, ప్రధాన కార్యదర్శి జి.సంధ్యారాణి, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.సి.హెచ్ శ్రీనివాస్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. ఎపి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శివారెడ్డి, కె. విద్యాసాగర్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తదితరులు సంఘీభావం తెలిపారు. హెల్త్ సెక్రెటరీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.



ధర్నాలో పాల్గొన్న కార్మికులు, ఉద్యోగులు, అభివాదం చేస్తున్న నేతలు (ఇన్‌సెట్‌లో)

వర్గీకరణపై మండలికి నివేదిక

- చదివి విన్పించిన హోంమంత్రి అనిత
- చర్చకు అంగీకరించని మండలి ఛైర్మన్
- మండలి నిరవధిక వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా సమర్పించిన నివేదికను హోంమంత్రి వంగలపూడి అనిత గురువారం శాసన మండలిలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతూ పలు అంశాలను ప్రస్తావించారు. 1996లో న్యాయమూర్తి రామచంద్రరాజు కమిషన్ నేతత్వంలో ఎస్సీ ఉపకులాలను నాలుగు వర్గాలుగా విభజన చేశారని గుర్తు చశారు. ఈ నేపథ్యంలో గత 30 ఏళ్లకాలంలో జరిగిన పరిణామాలను పరిశీలించి ఇటీవల ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలలో పర్యటించి వివిధ తరగతుల నుంచి అభిప్రాయాలు సేకరించిందని చెప్పారు. ఏ కేటగిరి కింద రెల్లీ మరియు 12 ఉపకులాలు, బీ కేటగిరిలో మాదిగతో పాటు 18 ఉపకులాలు, సీ కేటగిరి కింద మాల మరియు 25 ఉపకులాలు, డీ కేటగిరి కింద 4 ఆది ఆంధ్ర సహా ఉపకులాలు ఉంటాయని తెలిపారు. కులం, ఆ సమూహం తగిన ప్రాధాన్యం పొందలేకపోవడానికి వెనుకబాటు తనానికి కారణమని పేర్కొన్నారు. ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరారు. వైసిపి నుంచి పలువురు సభ్యులు మాట్లాడేందుకు ప్రయత్నించగా మండలి ఛైర్మన్ అంగీకరించలేదు. ఎమ్మెల్సీ పండుల రవీంద్రనాథ్ ఈ ప్రతిపాదనలపై ఈ రోజు బ్లాక్ డే అని మాట్లాడేందుకు ప్రయత్నించగా ఎవరు మాట్లాడినా రికార్డుల్లోకి వెళ్లబోవమన్నారు. మాట్లాడనివ్వాలని వైసిపి వారికి అవకాశం ఇవ్వాలని మంత్రులు పయ్యావుల కేశవ్,అనిత తదితరులుకోరినా వారిని పట్టించుకోకుండా ఛైర్మన్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ఛైర్మన్ ప్రకటించారు

జగన్ వల్లే వైసిపిని వీడుతున్నా

- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన మర్రి రాజశేఖర్‌రెడ్డి తాజాగా వైసిపికీ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. టిడిపిలో చేరే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ఇందుకు ప్రధాన కారణం జగన్‌మోహన్‌రెడ్డే అని తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని తన నివాసంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. తన మామయ్య సోమేపల్లి సాంబయ్య తొలి నుండి కాంగ్రెస్‌తో ఉన్నారని, ఆయన వారసత్వంగా కాంగ్రెస్‌లో చేరిన తనను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో గౌరవప్రదంగా చూసుకోగా అందుకు విరుద్ధంగా జగన్ ప్రవర్తించారన్నారు. వైసిపి అభివృద్ధి కోసం తీవ్రంగా శ్రమించగా చివరికి ఎమ్మెల్యే స్థానాన్ని వేరేవారికి ఇచ్చారని, బదులుగా తనకు మంత్రి పదవి ఇస్తామని చెప్పినా ఆ మాటాను నిలబెట్టుకోలేదని అన్నారు. 2024లో ఎమ్మెల్యే స్థానం కేటాయిస్తానని చెప్పి కూడా ఇవ్వకుండా తాడేపల్లికి పిలిపించి ఈ సారి ఇతన్ని గెలిపించు.. తర్వాత నిన్ను అక్కడ ఇన్‌ఛార్జిగా నిమిస్తామని చెప్పి ఆ మాటనూ నిలబెట్టుకోలేదన్నారు. తాను ఇన్ని అవమానాలు ఎదుర్కొంటుంటే మరోవైపు తన కార్యకర్తలు ఎంతో హింసించబడుతున్నా ప్రస్తుత ఇన్‌ఛార్జి పట్టించుకోవడం లేదని అన్నారు. అప్పట్లో పెద్దాయన సుబ్బారెడ్డి ఒకటికి నాలుగు సార్లు 'రాజశేఖర్‌రెడ్డి కుమారుడు పార్టీ పెట్టారు ..ఆయన మీద అభిమానంతో పార్టీలోకి రండి' అని అడిగితే జగన్‌వెంట నడిచామని, ఇకపై ఆ పార్టీలో కొనసాగబోమని స్పష్టం చేశారు. పలువురు నాయకులు, కౌన్సిలర్ల, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు ఆయనకు మద్దతుగా నిలిచారు.

వెలిగొండకు రూ.రెండువేల కోట్లు

- ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - మార్కాపురం

ప్రస్తుత బడ్జెట్‌లో వెలిగొండకు కేటాయించిన నిధులతో ప్రాజెక్టు పూర్తి కాదని, బడ్జెట్‌ను సవరించి రూ.రెండువేల కోట్లు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేసింది. దీంతో పాటు మెడికల్ కళాశాలను పూర్తి చేయాలని, మార్కాపురాన్ని జిల్లా చేయాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాయలం ఎదుట గురువారం ఆందోళన చేశారు. అనంతరం కోర్టు కూడలిలో రాస్తారోకో చేశారు. దీంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. రాస్తారోకో విరమింపజేసేందుకు సిపిఎం నాయకులను రహదారిపై నుంచి పోలీసులు పక్కకు లాగేసే క్రమంలో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులకు నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ.. వెలిగొండ నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల క్రితం ప్రకటించిన రూ. 12.50 లక్షల ప్యాకేజీ అప్పటి ధరలకు ఆ ప్యాకేజీ తక్కువేనని, ప్రస్తుత ధరలు, పెరిగిన విలువను బట్టి రూ. 20 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులను ప్యాకేజీలో అర్హులుగా చేర్చాలన్నారు. నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేన్నారు. మొదటి సొరంగంలోని చిన్నచిన్న పనులు పూర్తి చేసి 2026లో నీటిని విడుదల చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి సోమయ్య అధ్యక్షత వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డికెఎం.రఫి, మార్కాపురం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకోను విరమింపజేసేందుకు సిపిఎం నాయకులను పక్కకు లాగేస్తున్న పోలీసులు

ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోండి

- ధర్నాలో డిమాండ్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఆప్కాస్‌ను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రయివేటు ఏజెన్సీల ద్వారా నియమించాలనే ఆలోచనను విరమించు కోవాలని ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఏ.వి.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలు, పథకాలు, యూనివర్శిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్, అన్ని క్యాడర్ల ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చలో విజయవాడ నిర్వహించారు. భారీ సంఖ్యలో విజయవాడ తరలి వచ్చిన ఆప్కాస్ ఉద్యోగులు ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. 'ఆప్కాస్ కొనసాగించాలి. మినిమం టైం స్కేల్ అమలు చేయాలి. ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలి'. అని ఉద్యోగులు నినాదాలు చేశారు. ప్ల కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.చినబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏవి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే మినిమం టైంస్కేల్ అమలు చేయడానికి జివో 2 విడుదల చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వశాఖలు, ప్రభుత్వ స్థానిక సంస్థలలోని ఆప్కాస్, ఇతర ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, కెజిబివి, విద్యుత్, ప్రభుత్వ సొసైటీలు, నేషనల్ హెల్త్ మిషన్, ఎన్‌టిఇపి, ఎన్‌ఎంహెచ్‌పి, ఆర్‌డబ్ల్యుఎస్, వాటర్ వర్క్స్, సిపిడబ్ల్యుఎస్ తదితర అన్ని ప్రభుత్వ పథకాలు, యూనివర్శిటీల్లోని అన్ని క్యాడర్ల ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య, కోశాధికారి ఆర్ రజని, రాష్ట్ర నాయకులు జయచంద్ర, వసంతబాబు, సనత్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఎంపాయీస్ ఫెడరేషన్ ధర్నాకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమా మహేశ్వరరావు, ఓబులు సంఘీభావం తెలిపారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఫెడరేషన్ చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని అన్నారు.

సభకు రాకుండా సంతకాలా?

వైసిపి సభ్యుల పట్ల స్పీకర్ అసహనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి శాసనసభ్యులు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. శాసనసభలో గురువారం కర్నూలులో గ్రీన్‌కో ప్రాజెక్టుపై వైసిపి సభ్యులు అడిగిన ప్రశ్న చర్చకు వచ్చిన సమయంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. సభ్యులు నేరుగా సమావేశాలకు రావచ్చని, అలా కాకుండా ఇలా వ్యవహరించడం వారి స్థాయిని తగ్గిస్తుందే కానీ, గౌరవ పెంచదని చెప్పారు. ప్రశ్నలు వేసి సభకు రాకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. గవర్నర్ ప్రసంగం తర్వాత సభకు రాకుండా సంతకం పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిన వారిలో వైసిపి శాసనసభ్యులు వై.బాలనాగిరెడ్డి , తాటిపర్తి చంద్రశేఖర్, వేగం మత్స్యలింగం, అమర్‌నాథ్‌రెడ్డి, దాసరిసుధ, బి.విరూపాక్షి, విశ్వేశ్వరరాజులు ఉన్నారన్నారు. గవర్నర్ ప్రసంగం తర్వాత వీరందరూ పలు తేదీల్లో సంతకాలు పెట్టి వెళ్లినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా వ్యవహరించడం వల్ల సభ్యులకు గౌరవం తగ్గుతుందన్నారు. సభకు రాకుండా సంతకాలు పెట్టి వెళ్లిన వారి పేర్లను ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేయాలని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్పీకర్‌కు సూచించారు. ఉద్యోగి సంతకంపెట్టి విధులకు హాజరుకాక పోతే సస్పెండ్ చేస్తారని, సభకు రాకుండా సంతకాలు పెట్టిన వారిని ఏమి చేయాలా మీరే నిర్ణయం తీసుకోవాలని కోరారు. సభా నియమాలను పరిశీలించి , ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేస్తామని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

ఎమ్మెల్యేలను దొంగలుగా సంబోధించడం హేయం : చంద్రశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ్యులను దొంగలుగా సంభోధించడం హేయమని, దొరలాగా అందరి ముందూ సంతకం చేసి వెళ్లిన తాము దొంగలమైతే గతంలో రెండేళ్లు సభకు హాజరు కాకుండా సంతకాలు చేసిన చంద్రబాబు ఎవరో స్పీకర్ చెప్పాలని వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రశ్నించారు. దొంగల్లా వైసిపి సభ్యులు సంతకాలు చేసి వెళుతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై చంద్రశేఖర్ స్పందించారు. చంద్రబాబునాయుడు రిజిస్టర్లో సంతకం చేయకపోయినా శాసనసభ్యుడుగా, విపక్షనేతగా అన్ని సదుపాయాలు పొందారని, ఆయనను ఉద్దేశించి మాకంటే ఎక్కువ పదం వాడాల్సి ఉంటుందని అన్నారు. అయినా స్పీకర్‌ను గౌరవిస్తామని, విమర్శలన్నీ ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ సిబ్బంది సూచనల మేరకే తాము సంతకాలు పెట్టామని, దొంగల్లా రాలేదని తెలిపారు. ఎవరూ చూడకుండా సంతకం చేయలేదని స్పీకర్ గుర్తించాలన్నారు. ప్రభుత్వ అక్రమాలు, అన్యాయాలను ప్రతి వేదిక మీద లేవనెత్తుతూనే ఉన్నామని, ప్రభుత్వ అక్రమాలు, అవినీతిని నిలదీస్తున్నామని తెలిపారు. తమపై ప్రజలు ఉంచిన బాధ్యతను మర్చిపోలేదనే విషయాన్ని స్పీకర్ గుర్తించాలన్నారు.

అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ పోస్టులకు వేలం వేసి డబ్బులు చెల్లించలేదని గ్రామ బహిష్కరణ చేసిన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం బొరుబద్ర పిహెచ్‌సి, గెద్దలపాడు గ్రామపెద్దలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. గెద్దలపాడు గ్రామంలో సత్తు చంద్రమ్మ 2014 నుండి ఆశావర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారని, రూ.10 వేలు ఆదాయంతో ఆమె కుటుంబాన్ని పోషించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకూ గ్రామ ప్రజలు, పిహెచ్‌సి అధికారుల నుండి చంద్రమ్మపై ఎటువంటి ఫిర్యాదులూ లేవని తెలిపారు. ఆశా వర్కర్‌గా పనిచేయాలంటే రెండు లక్షల రూపాయలకు వేలం పాటపాడి గ్రామ పెద్దలకు చెల్లించాలని గత ఎనిమిది నెలలుగా చంద్రమ్మను వేధిస్తున్నారని తెలిపారు. ఆగస్టు నెలలో ఈ సమస్య మొదలైందని, దీనిపై ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రెండు లక్షలు చెల్లించనిపక్షంలో రాజీనామా చేయాలని చంద్రమ్మపై తీవ్ర ఒత్తిడి తెస్తుంటే మానసిక ఒత్తిడికి గురవుతూ ఆమె పనిచేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 17 నుండి విధులకు హాజరుకావద్దని దండోరా వేయించారని, గ్రామంలో ఎవరూ ఆమెకు సాయం అందించకూడదని, మందులు ఇవ్వరాదని అడ్డుకుంటూ తీవ్ర ఇబ్బందుల పాల్జేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే గ్రామంలో గత పదేళ్లుగా అంగన్‌వాడీ సెంటర్లో ఎన్.హరిదేవి(వర్కరు), ఎం.గారమ్మ(హెల్పర్) పనిచేస్తున్నారని, వారినీ రెండు లక్షలు చెల్లించాలని బెదిరించారని పేర్కొన్నారు. లేనిపక్షంలో విధులకు హాజరు కావద్దని చెబుతూ పిల్లలను కూడా వారి కేంద్రానికి పంపించడం లేదని తెలిపారు. ఈ అనాగరికమైన చట్ట విరుద్ధమైన గ్రామ పెత్తందార్ల చర్యలపై వెంటనే జోక్యం చేసుకుని వేధింపులు నిలుపుదల చేయించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశావర్కర్ గ్రామంలో విధులు నిర్వహించడానికి అంగన్‌వాడీ సెంటర్‌ను తెరిపించి వర్కరు, హెల్పరు గ్రామంలో విధులు నిర్వహించడానికి ఎలాంటి ఆటంకాలూ లేకుండా చూడాలని కోరారు. వేలంపాటవేసి డబ్బు చెల్లించాలని వేధించిన వారిపైనా, గ్రామ బహిష్కరణ చేసినవారిపైనా చర్యలు తీసుకోవాలని, చంద్రమ్మ, హరిదేవి, గారమ్మ కుటుంబాలకు రక్షణ కల్పించాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

భాష విషయంలో పెత్తందారీ విధానాన్ని కేంద్రం మానుకోవాలి

- యుటిఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో



భాష విషయంలో పెత్తందారీ విధానాన్ని కేంద్రం మానుకోవాలని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం హితవు పలికారు. పిల్లలు ఏ భాషలు నేర్చుకోవాలనే అంశంపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే పూర్తి అధికారం ఉండాలని అన్నారు.. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఎపియుటిఎఫ్) ఆధ్వర్యంలో విజయవాడ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో 'జాతీయ విద్యావిధానం- భాషా విధానం' అంశంపై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్రం హిందీని నేర్చుకుని తీరాలంటూ చేస్తున్న ఒత్తిడికి వ్యతిరేకంగా తమిళనాడు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేయడంతో దేశ వ్యాప్తంగా ఈ అంశం చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. భాష విషయంలో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వకపోతే అనవసరంగా అలజడులు రేగి కొత్త సమస్యలు తీసుకొచ్చినట్లవుతుందన్నారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి, ఆయా రాష్ట్రాల స్వేచ్ఛ స్వాతంత్రాలకు, ఆయా రాష్ట్రాల్లోని పిల్లల అవసరాలకు విరుద్ధమని తెలిపారు. ఎంతో ప్రభావవంతమైన భాష విషయంలో కేంద్రం రాష్ట్రాలకు సూచనలు చేయాలని , అది రాష్ట్రాలకు ఐచ్ఛికంగా మాత్రమే ఉండాలన్నారు. హిందీ అవసరం లేదని చెబుతున్న తమిళనాడుకు సర్వశిక్ష అభియాన్ నిధులు నిలిపివేయడానికి కేంద్రం ఉత్తర్వులు ఇవ్వడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఫెడరల్ రాజ్యాంగం, భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా ఏర్పడిన దేశంలో కేంద్రం ఏ రాష్ట్రాన్నయినా ఫలానా భాష నేర్చుకోవాలని ఒత్తిడి చేసి, కాదంటే నిధులు నిలిపివేస్తామని హుకుం జారీ చేయడం సరైనది కాదన్నారు. బహుళ భాషా సంస్కృతులున్న దేశంలో భాష పేరుతో ఒక ఆధిపత్యాన్ని చలాయించాలని ప్రయత్నం చేస్తే సహజంగానే ఆ భాష , సంస్కృతుల మీద ప్రేమ ఉన్నవాళ్లు తిరుగుబాటు చేసే పరిస్థితులు ఉంటాయని అన్నారు. బంగ్లాదేశ్‌లో ఉర్దుకు వ్యతిరేకంగా, యుగోస్లోవియాతో పాటు ప్రపంచంలోని పలు దేశాలు భాషా ప్రాతిపదికనే ఆందోళనలు జరిగి విభజనకు గురయ్యాయని గుర్తు చేశారు. త్రి భాష సూత్రాన్ని చెబుతూ దక్షిణాది రాష్ట్రాల్లోని వారు ఉత్తరాదికి చెందిన ఒక హిందీని నేర్చుకోవాలని చెప్పినప్పుడు ఉత్తరాధి రాష్ట్రాలు కూడా ఒక దక్షిణాది భాషని కచ్చింతంగా నేర్చుకోవడాన్ని అమలు చేయడానికి సిద్ధపడాలన్నారు. భారతీయ భాషల గురించి చెపుతున్న ప్రభుత్వాలు, కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్స్‌లో మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వడ లేదని జాతీయ భాషలను అసలు పట్టించుకోవడం లేదన్న విషయాన్ని గుర్తించకపోవడం శోచనీయమన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫెడరల్ వ్యవస్థలో విద్యారంగంలో ఏ నిర్ణయం అయినా రాష్ట్రాలతో సంప్రదించి కేంద్రం తీసుకోవాలన్నారు. భాష విషయంలో కేంద్రం పెత్తనం చేసేలా వ్యవహరించడాన్ని యుటిఎఫ్ వ్యతిరేకిస్తుందని అన్నారు. భాష పేరుతో కేంద్రం రాష్ట్రాలకు రావాల్సిన నిధులను నియంత్రించాలని చూడటం అప్రజాస్వామికమన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. చిరంజీవి, ఎపియుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్‌కుమార్, ప్రచురణ కమిటీ ఛైర్మన్ ఎం. హనుమంతరావు, కెవిపిఎస్ రాష్ట్ర కారదర్శి ఆంద్ర మాల్యాద్రి తదితరులు రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు.



విజయవాడ ధర్నా చౌక్‌లో విజ్ఞాపన దీక్ష చేపట్టిన మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు, నాయకులు

అర్బన్‌లో 'మీ' సేవ కేంద్రాలు తిరిగి ప్రారంభించండి

- విజ్ఞాపన దీక్షల్లో సిహెచ్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

అర్బన్‌లో మీ సేవ కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని ఎ.పి(ఇ)మీ సేవ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. యువగళంలో లోకేష్, గతంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలో భాగంగా ఇ సేవ కేంద్రాలు తెరవాలని కోరుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో గురువారం విజ్ఞాపన దీక్ష నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి..నాగేశ్వరరావు ఈ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జి.వో ఎంఎస్ నంబర్ రెండు ద్వారా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)శాఖ పరిధిలో ఇఎస్‌డి నిర్వహణలోని ఇ సేవ వ్యవస్తను గ్రామ, వార్డు సచివాలయశాఖకు బదిలీ చేసిందని అన్నారు. 170 గవర్నమెంట్ అర్బన్ సెంటర్లలో సగం సెంటర్లను వార్డు సచివాలయాలకు తీసుకుని మిగిలిన వాటిని మూసివేసిందని చెప్పారు. అప్పట్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామని తెలిపారు. పవన్ కళ్యాణ్ సమస్య పరిష్కారానికి గత వైసిపి ప్రభుత్వానికి లేఖ రాశారని, లోకేష్ గత ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిచేస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అర్బన్ మీ సేవా కేంద్రాలను త్వరిత గతిన తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని, గతంలో ఆ కేంద్రాల్లో విధులు నిర్వహించిన 607 మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎపి ఎన్‌జివో రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, ఎ.విద్యాసాగర్‌లు దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. అసోసియేషన్ నాయకులు అశోక్, వెంకటేశ్వరరావు, రాజ్‌కుమార్, రవికుమార్, నాగమణి, దుర్గాప్రసాద్ తదితరులు విజ్ఞాపన దీక్షల్లో పాల్గొన్నారు.

కోకో గింజలకు అంతర్జాతీయ ధర

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు డిమాండ్

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం.. కోకో గింజలకు ధర చెల్లించాలని, కోకో గింజల కొనుగోలు సమస్యను పరిష్కరించకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామంటూ కోకో రైతుల రాష్ట్ర సదస్సు హెచ్చరించింది. కంపెనీల మోసాలతో రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఏలూరు జిల్లా పెదవేగి మండలం గాంధీనగర్‌లోని సీతారామ కళ్యాణ మండపంలో ఎపి కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు గురువారం జరిగింది. ఈ సదస్సులో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ ప్రస్తుతం కోకో సాగు సంక్షోభంలో ఉందని, రైతులు నష్టాల్లో ఉన్నారని తెలిపారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కోకో తోటల సాగు ఉందని, ఏలూరు జిల్లాతోపాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో అంతర్ పంటగా ఉందని తెలిపారు. గతేడాది కంపెనీలు పోటీపడి అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో కోకో గింజలను రూ.1,040ల వరకు కొనుగోలు చేశాయని తెలిపారు. ఈ ఏడాది కంపెనీలు సిండికేట్‌గా మారి అంతర్జాతీయ ధర ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే



సదస్సులో మాట్లాడుతున్న వై.కేశవరావు

పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో రైతులు సంఘటితంగా లేకపోవడం వల్ల కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను ఇబ్బంది పెడుతున్నాయన్నారు. పాత గింజల కొనుగోలుపై కంపెనీలు స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఇంతకు ముందు లేని గ్రేడింగ్ విధానాన్ని ముందుకు తీసుకొచ్చారని తెలిపారు. కొత్త గింజల ధర మొన్నటి వరకూ రూ.650 ఇప్పుడు రూ. 550లకు ధర తగ్గించారన్నారు.

సదస్సులో ఏడు తీర్మానాలు చేసూ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులు బొల్లు రామకృష్ణ, బోళ్ల సుబ్బారావు, ఈడ్పుగంటి శ్రీనివాసరావు అధ్యక్షన జరిగిన ఈ సదస్సులో ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్‌టిఆర్, కోనసీమ తదితర జిల్లాల నుండి కోకో రైతులు పాల్గొన్నారు.

నిడదవోలు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసు

ప్రజాశక్తి - నిడదవోలు (తూర్పు గోదావరి జిల్లా)

తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణపై అవిశ్వాస తీర్మాన నోటీసును కలెక్టర్ పి.ప్రశాంతికి వైసిపి కౌన్సిలర్లు గురువారం అందించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో నిడదవోలు పట్టణంలో 28 వార్డులకు 27 వార్డుల్లో వైసిపి అభ్యర్థులు విజయం సాధించారు. ఒక్క స్థానంలో మాత్రమే టిడిపి అభ్యర్థి గెలుపొందారు. ఆ సమయంలో భూపతి ఆదినారాయణ మున్సిపల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో చైర్మన్ ఆదినారాయణతో పాటూ మరో ఎనిమిది మంది కౌన్సిలర్లు జనసేన పార్టీలో చేరారు. దీంతో వైసిపి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాస తీర్మాన నోటీసును వైసిపి కౌన్సిలర్ కామిశెట్టి వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అందించారు.

కీచక ఉపాధ్యాయుడు సస్పెండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం ఏనుగుమర్రి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు యం.బొజ్జన్నను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. యూట్యూబ్‌లో వీడియోలు చూపిస్తూ తమను అసభ్యంగా ముట్టుకునేవారని విద్యార్థినులు తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రధానోపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోలేదని విద్యార్థులు వాపోయారు.

విసిగిపోయిన విద్యార్థినులు తల్లితండ్రులకు విషయం చెప్పగా వారు పాఠశాలకు చేరుకున్నారు. అయితే ఉపాధ్యాయుడు రెండు రోజుల నుండి పాఠశాలకు రావడం లేదు. దీంతో ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎంఇఒ, డిఇఒకు విద్యార్థి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. విధుల నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించడమే కాకుండా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా, దురుసుగా ప్రవర్తించినట్లు ఎంఇఒ, డిప్యూటీ విద్యాశాఖ అధికారి వారి నివేదికల్లో వెల్లడించారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనందున ఉపాధ్యాయుడిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు.



కదిరి ప్రధాన వీధిలో సాగుతున్న రథోత్సవం

ఘనంగా ఖాద్రీశుని రథోత్సవం..!

ప్రజాశక్తి-కదిరి టౌన్, కదిరి అర్బన్

కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 12వ రోజు రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. రథోత్సవాన్ని చూసేందుకు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి యాత్రికులు తరలివచ్చారు. వేలాదిగా తరలొచ్చిన యాత్రికులతో కదిరి మాఢవీధులు కిక్కిరిసిపోయాయి. రథాన్ని లాగేందుకు యువత పోటీ పడ్డారు. స్వామి వారిపై మల్లెలు, దవనం, మిరియాలు చల్లి యాత్రికులు మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్. పార్థ సారథి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఏవి పార్థసారథి చార్యులు , ఏవి నరసింహ చార్యులు తదితరులు పర్యవేక్షించారు.



స్టేడియం వద్ద మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్

స్టేడియానికి వైఎస్‌ఆర్ పేరు తొలగింపుపై ధర్నా

ప్రజాశక్తి-మధురవాడ (విశాఖపట్నం)

విశాఖలోని ఎసిఎ, విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పేరును తొలగించడాన్ని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యాన గురువారం స్టేడియం వద్ద ధర్నా చేశారు. ముందుగా స్టేడియం ప్రధాన ద్వారం వద్ద ఉన్న వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైసిపి నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం స్టేడియం వద్ద టిడిపి కూటమి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పేరును స్టేడియానికి యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ధర్నానుద్దేశించి వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు వైఎస్‌ఆర్ అని, ఆ చరిత్రను ఎవరూ చెరపలేరని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా అప్పటి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఈ స్టేడియానికి ఆయన పేరు పెట్టిందని గుర్తు చేశారు. వైఎస్‌ఆర్ పేరు, ఆయన విగ్రహం కనబడితే ప్రజల్లో జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందనే భయంతో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్‌ఆర్ విగ్రహాలను ధ్వంసం చేసోందని ఆరోపించారు. క్రికెట్ స్టేడియం పేరు మార్పుపై వైసిపి ధర్నాకు పిలుపునివ్వడంతో వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజును సీతమ్మధారలోని ఆయన నివాసంలో ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ధర్నాలో విశాఖ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మున్సిపాలిటీలో మోడల్ స్వర్ణాంధ్ర పార్కు

పట్టణాభివృద్ధిశాఖ ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మున్సిపాలిటీలో మోడల్ స్వర్ణాంధ్ర పార్కు ఏర్పాటు చేయాలని పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రతి మున్సిపాలిటీలో ప్లానింగు, సదుపాయాలు, ల్యాండ్ స్కేపింగ్‌లో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. పారిశుధ్యం, స్వచ్ఛతలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఎన్‌జిఒ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దాతలు, నివాసితుల సంక్షేమ సంఘాలు మార్కెట్ కమిటీలను భాగస్వాములను చేయాలని తెలిపారు. వర్షాకాలం కాకముందే డీసిల్టింగ్ చేయాలని, దీనికోసం జిల్లాస్థాయిలో మానిటరింగ్ కమిటీలు వేయాలని పేర్కొన్నారు. పూర్తిచేసిన పనులపై కలెక్టర్లు, కమిషనర్లు, పట్టణాభివృద్ధిశాఖ డైరెక్టర్ మేనెలాఖరు నాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. కాలువల వెంట చెత్త డంప్‌ను తొలగించాలని, మళ్లీ అక్కడ చెత్తవేయకుండా చూడాలని తెలిపారు. దీనికోసం సిసిటివిలు పెట్టాలని తెలిపారు. 2025 ఏప్రిల్ 19 నాటికి చెత్త డంపింగ్ కేంద్రాలు ఎక్కడా కనిపించకూడదని పేర్కొన్నారు. జిల్లా ర్యాంకింగ్‌లో ఇది కీలకంగా మారుతుందని వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల హానిగురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రెయిన్లు, కాలువలు, ఖాళీస్థలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

లిక్కర్ స్కాం పేరుతో కూటమి ప్రభుత్వం కుట్ర

- వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లిక్కర్‌స్కామ్ పేరుతో కూటమి ప్రభుత్వం భారీ కుట్రకు తెరలేపిందని వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సిఐడి పెట్టిన ఎఫ్‌ఐఆర్‌లో ముద్దాయిలుగా గుర్తు తెలియని వ్యక్తులను చేర్చారని, తమ రాజకీయ ప్రత్యర్థులను తరువాత ముద్దాయిలుగా చూపించేందుకు ఇలాంటి కుట్ర చేశారని అన్నారు. మరోవైపు ఎపిఎస్‌బిసిఎల్ ఉద్యోగులపై సిట్ వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. సిఐడి స్టేట్‌మెంట్‌పై ఉద్యోగులతో బలవంతంగా సంతకాలు తీసుకుంటున్నారని, భయపెట్టి అనుకూలంగా డిస్టిలరీల నుండి స్టేట్‌మెంట్లు ఇప్పిస్తున్నారని అన్నారు.

ఈ విషయంలో కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిందరిపైనా కేసులు నమోదు చేయిస్తోందని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నాలుగువేల కోట్ల స్కాం జరిగిందని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. 2024 తొమ్మిదో నెల తొమ్మిదో తేదీన వెంకటేశ్వరప్రసాద్ అనే వ్యక్తి లిక్కర్ స్కామ్ జరిగిందని చెప్పి రిజిస్టర్‌పోస్టులో లేఖ రాశారని, దాని ఆధారంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని పేర్కొన్నారు. నమోదు చేసిన వ్యక్తి విశ్వసనీయ ఏమిటో కూడా పరిశీలించలేదని తెలిపారు.

అంగన్వాడీల విధులను అడ్డుకున్న వారిపై చర్యలు

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలో గద్దలపాడులో అంగన్వాడీ సెంటర్‌లో పని చేస్తున్న వర్కర్ ఎన్.హరిదేవి, హెల్పర్ ఎం.గారమ్మలను విధులకు హాజరు కాకుండా అడ్డుకున్న గ్రామ పెద్దలపై చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనను యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బేబిరాణి, కె.సుబ్బరావమ్మ ప్రకటనలో ఖండించారు. గద్దలపాడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పదేళ్లుగా ఎన్.హరిదేవి వర్కరుగా, ఎం.గారమ్మ హెల్పరుగా పని చేస్తున్నారని గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం మారిన అనంతరం ఆటవిక పద్ధతిలో రూ.2 లక్షలకు వేలం పాట పెట్టడం వల్ల విధులకు హాజరు కావద్దని గ్రామ పెద్దలు బలవంతంగా తెల్లకాగితం మీద సంతకం పెట్టించడాన్ని తప్పుబట్టారు. ఈ సంఘటనకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ విషయాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శికి, డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీరు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి, అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. అంగన్వాడీ వర్కర్ హరిదేవి, హెల్పర్ గారమ్మలకు రక్షణ కల్పించి వారు విధులు సక్రమంగా నిర్వహించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

శ్రీవాణి మృతికి సంతాపం


తిరుపతి జిల్లా పిచ్చాటూరు ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్‌గా పని చేస్తూ మృతి చెందిన శ్రీవాణికి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ తెలిపింది. శ్రీవాణి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ... యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బేబిరాణి, కె.సుబ్బరావమ్మలు గురువారం ప్రకటన విడుదల చేశారు. పిచ్చాటూరు సెక్టారు లీడర్‌గా ఉంటూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేశారని పేర్కొన్నారు.

అంగన్వాడీల మహాధర్నాలో పాల్గొని బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై 10 రోజులుగా విజయవాడ, తిరుపతి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు.

ప్రపంచ వృద్ధికి అమెరికా పోటు

- ఈ ఏడాది 2.2 శాతమే పెరుగుదల
- వాణిజ్య యుద్ధంతో నష్టమే
- ఫిచ్ రేటింగ్ అంచనా

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తోన్న అనిశ్చితి ఆర్థిక విధానాలు, టారీఫ్‌ల పెంపు ప్రపంచ దేశాల వృద్ధి రేటును దెబ్బతీస్తున్నాయి. ఇదే విషయాన్ని ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ ఫిచ్ వెల్లడించింది. అమెరికా వాణిజ్య యుద్ధంతో 2025లో ప్రపంచ వృద్ధి రేటు 2.3 శాతానికి పడిపోనుందని విశ్లేషించింది. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే 0.3 శాతం తగ్గనుందని అంచనా వేసింది. అమెరికా వేగంగా పెంచుతోన్న సుంకాలు ప్రపంచ వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఫిచ్ తన 'గ్లోబల్ ఎకనామిక్ అవుట్‌లుక్'లో తెలిపింది. 2024లో గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ 2.9 శాతం పెరిగనుందని తొలుత అంచనా వేసిన ఈ సంస్థ.. డిసెంబర్‌లో 2.6 శాతానికి కుదించింది.



అమెరికా వాణిజ్య యుద్ధం ఎంత వరకు తీసుకెళ్లేది ఇప్పుడే చెప్పలేమని పేర్కొంది. యూరప్ సహా ఇతర దేశాలపై యుఎస్ వేస్తోన్న సుంకాలు దెబ్బకొస్తున్నాయని తెలిపింది. 2026లో గ్లోబల్ వృద్ధి మరింత తగ్గి 2.2 శాతానికి పరిమితం కావొచ్చని హెచ్చరించింది. ఈ ఏడాది అమెరికా జిడిపి రేటుకు 1.1 శాతం కోత పెట్టి.. 1.7 శాతానికి పరిమితం చేసింది. 2024లో 2.8 శాతం వృద్ధిని నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. చైనా, యూరోపియన్ యూనియన్ దేశాల వృద్ధి తగ్గనుందని ఫిచ్ పేర్కొంది. అయితే జపాన్ మాత్రం 2024లో 0.1 శాతం వృద్ధిని నమోదు చేయగా.. 2025లో 1.1 శాతం వృద్ధి సాధించనుందని తెలిపింది.

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత 2024-25లో 6.3 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. 2025-26లో 6.5 శాతానికి తగ్గొచ్చని విశ్లేషించింది. ఇది ఆర్‌బిఐ అంచనా 6.7 శాతం కంటే తక్కువ కావడం గమనార్హం. అమెరికా వాణిజ్య విధానాలు ప్రధాన సవాళ్లుగా నిలువనున్నాయని పేర్కొంది. వినియోగదారుల విశ్వాసం తగ్గిందని పేర్కొంది. దీంతో వాహన అమ్మకాల్లో తగ్గుదల చోటు చేసుకుంటున్న విషయాన్ని ఫిచ్ గుర్తు చేసింది. 2024-25లో భారత జిడిపి 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఇటీవల ఎన్ఎస్ఒ అంచనా వేసింది. ఇది నాలుగేళ్లలోనే అత్యంత కనిష్ఠ స్థాయి. ఇంతక్రితం 2023-24లో జిడిపి 8.2 శాతం పెరిగింది. 2024-25లో 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్‌బిఐ ఇటీవల అంచనా వేసింది. దీంతో పోల్చితే ఫిచ్ తాజా అంచనాలు మరింత ఆందోళన కలిగించే అంశం.

ఎంబార్కేషన్ పాయింట్ తీసేయడం బాధాకరం

మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప (వైఎస్‌ఆర్ జిల్లా)

ఎంతో కష్టపడి సాధించిన ఎంబార్కేషన్ పాయింట్‌ను తీసేయడం బాధాకరమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. ఇది కేవలం టిడిపి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం మాత్రమే అన్నారు. మైనార్టీ వర్గాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్‌ఆర్ జిల్లాలోని తన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం అంజాద్ బాషా మాట్లాడారు. పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి విజయవాడ నుండి ఎంబార్కేషన్ పాయింట్ తొలగించారని, గత వైసిపి ప్రభుత్వ హయంలో ఎంతో ప్రయాసలతో, కష్టపడి ఇక్కడ పాయింట్ సాధించామని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల విజయవాడలో పాయింట్ తొలగించారన్నారు. 2019 సంవత్సరం వరకూ హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హాజీలు యాత్రకు వెళ్లేవారని, అప్పట్లో మన రాష్ట్ర హాజీలకు తెలంగాణ ప్రభుత్వం సరైన సదుపాయాలు కల్పించలేదని అన్నారు. ఆ తర్వాత మాజీ సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో 2020లో మన రాష్ట్రంలోని విజయవాడ నుంచి ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కరోనా నేపథ్యంలో రెండేళ్ల హజ్ యాత్ర జరగలేదని, 2023లో విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1813 మంది హజ్ యాత్రకు వెళ్లారని తెలిపారు. అదనపు భారాన్ని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ఉత్తర్వులు జారీచేసిందని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, మాజీ చైర్మన్ కరిముల్లా, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాపుల్లా, నాయకులు పాల్గొన్నారు.

7,378 కేజీల గంజాయి నిర్వీర్యం

- విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - లావేరు (శ్రీకాకుళం జిల్లా)

విశాఖపట్నం రేంజ్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసులు 226 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 7,378 కిలోల గంజాయిని నిర్వీర్యం చేశారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాతకుంకాం పరిధిలోని రైన్‌బో ఇండస్ట్రీ వద్ద డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యాన గురువారం ఈ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది జనవరిలో రేంజ్ పరిధిలోని అనకాపల్లి జిల్లాలో 34,419 కేజీల గంజాయి, 39.4 లీటర్ల హాషిష్ ఆయిల్, రెండో దశ అల్లూరి జిల్లాలో ఫిబ్రవరిలో 3075 కేజీల గంజాయిని, 25.5 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను పోలీసులు నిర్వీర్యం చేశారు.

మూడో దశలో శ్రీకాకుళంలో చేశారు. ఎనిమిది నెలల కాలంలో గంజాయి నిర్మూలన చర్యల్లో భాగంగా 524 కేసుల్లో 31,768 కేజీల గంజాయి, 12.05 లీటర్ల హాషిష్ ఆయిల్, 372 వాహనాలు సీజ్ చేసి 2050 మంది నిందితుల్ని అరెస్టు చేశారు. అందులో 575 మంది అంతర్రాష్ట్ర నిందితులు ఉన్నారు. గంజాయి అక్రమ వ్యాపారాల్లో ఆస్తులు కూడబెట్టిన వ్యక్తులను గుర్తించి, వారి ఆస్తులను జప్తు చేస్తున్నామని డిఐజి తెలిపారు. ఇప్పటికే అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని రెండు కేసుల్లో ఆస్తులు జప్తు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల ఎస్‌పిలు కెవి మహేశ్వర్ రెడ్డి, వకుల్ జిందల్, ఎస్‌వి మాధవ్ రెడ్డి, ఎఎస్‌పిలు పి శ్రీనివాసరావు, పి సౌమ్యలత, అంకిత సూరన, డిఎస్‌పిలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వెటర్నరీ విద్యార్థుల నిరవధిక సమ్మె విరమణ

ప్రజాశక్తి - ఎస్‌వియు (తిరుపతి)

మెడికల్ కళాశాల విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని కోరుతూ గత 46 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెను పశువైద్య విద్యార్థులు గురువారం విరమించారు. ప్రస్తుతం అందుతున్న స్టైఫండ్‌పై 50 శాతం పెంచుతూ బుధవారం ప్రభుత్వం జిఒ విడుదల చేయడంతో అధికారికంగా విద్యార్థులు సమ్మెను విరమించుకున్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ రవి, విసి డాక్టర్ జెవి.రమణ, ప్రిన్సిపల్ డాక్టర్ జగపతి రామయ్య, వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్యకు విద్యార్థుల ప్రతినిధులు తమ నిర్ణయాన్ని వివరించారు. ఈ సమ్మె నేపథ్యంలో వెటర్నరీ విద్యార్థులు అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి తమ స్టైఫండ్‌ను ఇతర మెడికల్ కోర్సుల విద్యార్థుల స్థాయిలో పెంచాలని డిమాండ్ చేశారు. అయితే, విద్యార్థుల డిమాండ్‌కు పూర్తి స్థాయిలో స్పందించకపోయినా, ప్రస్తుతం అందుతున్న స్టైఫండ్‌పై 50 శాతం పెంచుతూ ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. విద్యార్థులు ఆశించిన స్థాయిలో స్టైఫండ్ పెరుగుదల లేకపోయినా.. మూడు నెలల్లో మళ్లీ సమీక్షించి మరింత పెంపు చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇవ్వడంతో విద్యార్థులు సమ్మెను విరమించారు. ఇది శాశ్వత పరిష్కారం కాదని, ప్రభుత్వం మళ్లీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వెటర్నరీ విద్యార్థులు మరింత తీవ్ర స్థాయిలో సమ్మెను పున్ణప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

కేబుల్స్ వ్యాపారంలోకి అదానీ గ్రూపు

న్యూఢిల్లీ : అదానీ గ్రూపు కొత్తగా కేబుల్స్, వైర్ల రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం అదానీ గ్రూప్ అనుబంధ సంస్థ కచ్ కాపర్ లిమిటెడ్, ప్రణీత వెంచర్స్‌తో కలిసి ప్రణీత ఎకోకేబుల్స్ పేరిట సంయుక్త భాగస్వామ్య కంపెనీని ఏర్పాటు చేశాయి. ఇందులో అదానీ గ్రూపు 50 శాతం వాటాను కలిగి ఉన్నట్లు గురువారం ఆ సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది.

దీంతో మార్కెట్‌లో ఇప్పటికే ఈ రంగంలో ఉన్న పాలీక్యాబ్ ఇండియా లిమిటెడ్, కెఇఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఆర్ఆర్ కేబుల్ లిమిటెడ్, ఫినోలాక్స్ కేబుల్స్, హావెల్స్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇటీవల ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ కేబుల్స్ రంగంలోకి ప్రవేశించింది.

నాలుగో రోజూ మార్కెట్లకు లాభాలు

ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో వరుసగా నాలుగో రోజూ మార్కెట్లు పరుగులు పెట్టాయి. గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 899 పాయింట్లు పెరిగి 76,348కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 283 పాయింట్ల లాభంతో 22,191 వద్ద ముగిసింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఐటి రంగాల షేర్లు మార్కెట్లకు ప్రధాన మద్దతును అందించాయి.

అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాదిలో రెండు సార్లు వడ్డీ రేట్లను తగ్గించనుందన్న రిపోర్టులు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.3 లక్షల కోట్ల మేర పెరిగి రూ.408 లక్షల కోట్లకు చేరింది.

సిగ్నేచర్ గ్లోబల్ షేర్లకు సిఫార్సు

రియాల్టీ సంస్థ సిగ్నేచర్ గ్లోబల్ (ఇండియా) లిమిటెడ్ షేర్లను కొనుగోలుకు బ్రోకరేజ్ సంస్థ నువామా సిఫార్సు చేసింది. ప్రస్తుత మార్కెట్ ధర కంటే 35 శాతం పెరిగి రూ.1,436 లక్ష్యానికి చేరొచ్చని అంచనా వేసింది. గురువారం ఈ సూచీ 0.49 శాతం పెరిగి రూ.1,110 వద్ద ముగిసింది. వారం రోజుల్లో 3 శాతం లాభపడింది.

రెనో, బిఎండబ్ల్యు కార్లు ప్రియం

న్యూఢిల్లీ : ఉత్పత్తి వ్యయాలు పెరగడంతో కార్ల కంపెనీలు వరుసగా ధరలను పెంచుతున్నాయి. ఇప్పటికే మారుతి సుజుకి, టాటా మోటార్స్, హ్యుందాయ్ తదితర కంపెనీలు ధరలను పెంచగా.. అదే బాటలో రెనో, బిఎండబ్ల్యు తమ వాహన ధరలను హెచ్చించాయి. ఏప్రిల్ నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని వెల్లడించాయి.

తయారీ వ్యయం, ముడి సరకు ధరలు, నిర్వహణ ఖర్చులు పెరిగిన కారణంగా కార్ల ధరలను రెండు శాతం మేర పెంచుతున్నట్లు రెనో ఇండియా సిఇఒ ఎండి వెంకట్రామ్ తెలిపారు. 2023 ఫిబ్రవరి తర్వాత తొలిసారి ధరలను పెంచింది. బిఎండబ్ల్యు మోటార్ ఇండియా తన వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు స్పష్టం చేసింది.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌లో 'ఎస్' ఫీచర్

ముంబయి : మ్యూచువల్ ఫండ్లలో స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌లతో ఇన్వెస్టర్లకు మద్దతును ఇవ్వడానికి తమ మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లో ఎస్ ఫీచర్‌ను జోడించినట్లు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఇది పెట్టుబడిదారులుకు తగిన సమాచారంతో, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి నిర్ణయం తీసుకోవడానికి వీలు కల్పించే సంబంధిత పరిజ్ఞానము, సాధనాలను అందిస్తుందని పేర్కొంది.

ఏప్రిల్‌లో బీమాపై జిఎస్‌టి కోత..!

న్యూఢిల్లీ : వచ్చే ఏప్రిల్‌లో జరగనున్న జిఎస్‌టి కౌన్సిల్ భేటీలో ఆరోగ్య, జీవిత బీమాపై వస్తు సేవల పన్నును తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. జిఎస్‌టి తగ్గింపునపై తాజాగా బీమా రెగ్యూలేటరీ ఐఆర్‌డిఎఐ తన అభిప్రాయాలను, ప్రతిపాదనలను వెల్లడించింది. దీనిపై జిఎస్‌టి మంత్రుల బృందం ఏప్రిల్ నెల సమావేశంలో చర్చించనుందని ఓ అధికారి తెలిపారు. బిహార్ డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌధరి నేతృత్వంలోని మంత్రుల బృందం వైద్య, జీవిత బీమాలపై కొత్త పన్ను రేట్లను ప్రతిపాదించింది. దీనిపై రాష్ట్రాల అభిప్రాయాలను సేకరిస్తోంది.

మధుమేహ చికిత్స కోసం యుఎస్‌వి 'జెనియా'

హైదరాబాద్ : భారత్‌లో మధుమేహ చికిత్స కోసం జెనియాను ఔషధాన్ని విడుదల చేసినట్లు యుఎస్‌వి తెలిపింది. నోటి ద్వారా తీసుకునే ఈ మాత్ర 10ఎంజి, 25 ఎంజిల్లో లభిస్తుందని యుఎస్‌వి ఎండి ప్రశాంత్ తివారీ పేర్కొన్నారు. భారత్‌లో 10.1 కోట్ల పైగా మంది టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారన్నారు.

సంపాదకీయం

ఇజ్రాయిల్ మారణకాండ

ఒకపక్క కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉండగానే బుధవారం నాడు గాజాపై ఇజ్రాయిల్ దాడులకు తెగబడడం, వందలమంది ప్రాణాలను బలిగొనటం అత్యంత దుర్మార్గమైన చర్య. కాల్పుల విరమణకు సంబంధించిన రెండో దశ చర్చలు ఈ కాల్పుల మధ్యనే జరుగుతాయంటూ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు హూంకరించటం తీవ్రమైన బరితెగింపు! అమెరికా వత్తాసును చూసుకొని, అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఇజ్రాయిల్ మళ్లీ ఈ మారణకాండకు తెగించింది.

2023 అక్టోబరు ఏడో తేదీన మొదలైన ఇజ్రాయిల్ దాడుల పర్వం అంతకంతకూ తీవ్రమై, జాతిహననమే లక్ష్యంగా సాగింది. 2025 జనవరిలో కాల్పుల విరమణ ఒప్పందం జరిగే సమయానికి దాదాపు 50 వేల ప్రాణాలను బలిగొంది. లక్షా 12 వేల మంది గాయపడ్డానికి కారణమైంది. దాడుల సమయంలో నెతన్యాహు ప్రభుత్వం అన్ని మానవీయ విలువలను, చట్ట నిర్దేశాలను కాలరాసింది. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకుంటూ ప్రజలను గాజా ప్రాంతం వైపు తరుముతూ, అక్కడ కిక్కిరిసిన జనాలపై వైమానిక దాడులకు దిగింది. నివాస ప్రాంతాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, శరణార్థి శిబిరాలు, వివాహ ఊరేగింపులు, సహాయక కేంద్రాలూ ... ఇలా అన్నింటిపైనా బాంబుల వర్షం కురిపించి, పెద్ద సంఖ్యలో సామాన్యుల ప్రాణాలను పొట్టన పెట్టుకొంది. మృత్యువాత పడ్డ వారిలో మహిళలు, బాలలూ అధిక సంఖ్యలో ఉండటానికి నెతన్యాహు నిరంకుశ నెత్తుటి దాహమే కారణం. ఐక్యరాజ్య సమితి, అనేక దేశాలూ ఈ దుర్మార్గం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసినా, దాడులను నిలిపివేయాలని కోరినా ఇజ్రాయిల్ లక్ష్యపెట్టలేదు.

తాను అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధానికి తెర పడుతుందని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ... కొద్ది రోజులకే తన అసలు రూపం బయట పెట్టుకున్నాడు. పాలస్తీనాను విధ్వంసం చేసిన ఇజ్రాయిల్‌కు వంత పాడడం మొదలు పెట్టాడు. గాజా ప్రాంతాన్ని తాము స్వాధీనం చేసుకుంటామని, అక్కడి ప్రజలు ఇతర దేశాల రక్షణలోకి వెళ్లిపోవాలంటూ చేసిన సూచనను అరబ్ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయి. హమాస్‌ను ఉద్దేశించి తాజాగా ట్రంప్ చేసిన హెచ్చరికలు శాంతిని నెలకొలిపే మధ్యవర్తిలా కాక దురాక్రమణదారు బెదిరింపుల్లా ఉన్నాయి. 'మీ దగ్గర ఉన్న బందీలందరినీ వెంటనే వదిలిపెట్టండి. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయం'టూ నెతన్యాహు, ట్రంప్ ఒకే స్వరంతో బెదిరించటం కాల్పుల విరమణ ఒప్పందానికి విరుద్ధంగా ఉంది. ఇజ్రాయిల్ చెరశాలల్లో ఉన్న వేలాదిమంది పాలస్తీయన్లను విడుదల చేయటం, దానికి ప్రతిగా హమాస్ తన వద్ద ఉన్న బందీలను విడిచిపెట్టటం అనేది ఒప్పందంలో ఒక భాగం. దానికి కొనసాగింపుగా రెండో విడత చర్చలు కూడా జరపాల్సి ఉంది. కానీ, ఇజ్రాయిల్ అందుకు సిద్ధంగా లేదు. పాలస్తీనా భూభాగంలో తన బలగాలను కొనసాగిస్తూ, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కవ్వింపు చర్యలకు దిగుతోంది. ఈ ఒప్పంద కాలంలోనే ఇజ్రాయిల్‌కు అమెరికా రూ.6.38 లక్షల కోట్ల విలువైన బాంబులు, క్షిపణులను విక్రయించే ఒప్పందం కుదిరింది. 20 లక్షల మంది పాలస్తీయన్లకు జోర్డాన్‌లో ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలని ఆదేశ రాజును ట్రంప్ ఆదేశించాడు. చెప్పినట్టు చేయకపోతే తమ దేశం నుంచి సహాయం నిలిపివేస్తామని బెదిరించాడు. ఈ విధంగా పశ్చిమాసియాలో నిత్యం అశాంతిని రాజేయటానికి, ఉద్రిక్త పరిస్థితులు కొనటానికి అమెరికా ఆజ్యం పోస్తోంది. తాము చెప్పినట్టు వినాలని, లేకుంటే దాడులనో, సహాయ నిరాకరణనో ఎదుర్కోవల్సి ఉంటుందని నేరుగా బెదిరించటం సమస్యలను మరింత జటిలం చేస్తోంది.

తాజాగా ఇజ్రాయిల్ కిరాతకమైన వైమానిక దాడులకు దిగటం ద్వారా తాము రెండు విడత చర్చలకు సుముఖంగా లేమని సంకేతాలిచ్చింది. మార్చి 2 నుంచి గాజా ప్రజలకు తాగునీరు, తిండి, మందులు, ఇతర నిత్యావసర వస్తువులు అందకుండా చేసింది. ప్రజలను ఆకలితో, రోగాలతో అల్లాడేలా చేసి, ఆపై దాడులు చేసి, పాలస్తీనాను పూర్తిగా దురాక్రమణ చేయాలనేది నెతన్యాహు అమానుష వ్యూహంగా కనిపిస్తోంది. అమెరికా కనుసన్నల్లో జరుగుతున్న ఈ దారుణ మారణకాండకు నిరసిస్తూ అంతర్జాతీయ సమాజం గొంతెత్తాలి. దాడులను విరమించి, శాశ్వత శాంతి నెలకొనేలా చర్చల ప్రక్రియ ప్రారంభించాలని ఒత్తిడి చేయాలి.

మహనీయుల మాట




ప్రకృతి రహస్యాలను వివరించలేనిది శాస్త్రం కాదు!
జీవితంలోని కష్టాలను తీర్చలేనిది ఆవిష్కరణ కాదు!
జీవితంలోని ప్రతి కోణాన్ని చూపలేనిది సాహిత్యమే కాదు!
- కొడవటిగంటి కుటుంబరావు, ప్రసిద్ధ రచయిత.

విశ్లేషణ

అణచివేతలో మోడీ-ట్రంప్ ఇద్దరూ ఇద్దరే

ఇక్కడ శివానందన్ - అక్కడ ఖలీల్ !

సత్య



గత ఏడాది ఏప్రిల్ నెలలో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) అభివృద్ధి, అధ్యయనాల విభాగంలో పిహెచ్‌డి చేస్తున్న రామదాస్ ప్రిని శివానందన్ అనే పరిశోధకుడిని సంస్థ సస్పెండ్ చేసింది. ఎందుకటా! న్యూఢిల్లీలో విద్యార్థులు 'భారత్‌ను రక్షించండి-బిజెపిని తిరస్కరించండి' అనే నినాదంతో పార్లమెంట్ వద్దకు ప్రదర్శన నిర్వహించారని, దానిలో భాగస్వామి కావటం జాతి వ్యతిరేకత కిందకు వస్తుందని కారణం చెప్పింది. కేరళలో దళిత సామాజిక తరగతికి చెందిన ఈ యువకుడు ముంబైలో చదువుతూ మహారాష్ట్ర ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా పని చేశాడు. టిస్ చెప్పిన సాకులు లేదా కారణాలను చూస్తే ఎవరూ కూడా ప్రభుత్వాల విధానాల మీద నిరసనలు, అసమ్మతి తెలపటానికి వీల్లేదు. ఎందుకంటే ఏదో ఒక ప్రభుత్వ పథకం కింద ఆర్థికంగానో, సేవా పరంగానో ప్రతివారూ లబ్ధిదారులే. అలాంటపుడు ఎవరూ ఏ ప్రభుత్వాన్నీ విమర్శించకూడదు, భజన మాత్రమే చేయాలి!

ఇప్పటి వరకైతే భారత్, అమెరికా రెండూ పెద్ద ప్రజాస్వామిక దేశాలే. ఎవరూ కాదనటం లేదు. కానీ ఆచరణ చూస్తే నిరంకుశత్వానికి దారితీస్తున్నట్లుగా వ్యవహరించటం ఆందోళన కలిగిస్తోంది. వ్యవస్థలను దిగజారుస్తున్నారు, కొత్త అర్థాలు చెబుతున్నారు, పాలకులను విమర్శించటాన్ని దేశ ద్రోహంగా చిత్రిస్తూ బ్రిటీష్ వలస పాలకులను గుర్తుకు తెస్తున్నారు. మన గతం గురించి మరచిపోయిన వారికి దాన్ని గుర్తు చేయటం కూడా ఒకందుకు మంచిదేనేమో? ఏదీ ఊరికే రాదు అన్నట్లుగా మన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఊరికే రాలేదని కొందరైనా తెలుసుకుంటారు. రెండు చోట్లా చట్టాలు, నిబంధనలకు వక్రభాష్యాలు చెప్పి భావ ప్రకటన, నిరసన తెలిపే హక్కును హరించే ఉదంతాల గురించి చెప్పుకోవటం దేశ వ్యతిరేకతగా పరిగణించినా ఆశ్చర్యం లేదు. రోజులిలా ఉన్నాయి. ఏం జరిగినా ఎదుర్కోక తప్పదు. గత ఏడాది ఏప్రిల్ నెలలో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) అభివృద్ధి, అధ్యయనాల విభాగంలో పిహెచ్‌డి చేస్తున్న రామదాస్ ప్రిని శివానందన్ అనే పరిశోధకుడిని సంస్థ సస్పెండ్ చేసింది. ఎందుకటా! న్యూఢిల్లీలో విద్యార్థులు 'భారత్‌ను రక్షించండి-బిజెపిని తిరస్కరించండి' అనే నినాదంతో పార్లమెంట్ వద్దకు ప్రదర్శన నిర్వహించారని, దానిలో భాగస్వామి కావటం జాతి వ్యతిరేకత కిందకు వస్తుందని కారణం చెప్పింది. కేరళలో దళిత సామాజిక తరగతికి చెందిన ఈ యువకుడు ముంబైలో చదువుతూ మహారాష్ట్ర ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా పని చేశాడు.

టిస్ చెప్పిన సాకులు లేదా కారణాలను చూస్తే ఎవరూ కూడా ప్రభుత్వాల విధానాల మీద నిరసనలు, అసమ్మతి తెలపటానికి వీల్లేదు. ఎందుకంటే ఏదో ఒక ప్రభుత్వ పథకం కింద ఆర్థికంగానో, సేవా పరంగానో ప్రతివారూ లబ్ధిదారులే. అలాంటపుడు ఎవరూ ఏ ప్రభుత్వాన్నీ విమర్శించకూడదు, భజన మాత్రమే చేయాలి! కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానాన్ని ఢిల్లీలో జరిగిన ప్రదర్శనలో విమర్శించారు. దాన్లో పాల్గొన్నందున శివానందన్ జాతి వ్యతిరేకి అనటమే కాదు అతని మీద చర్యలు తీసుకొనేందుకు దర్యాప్తు సంస్థలు ముందుకు రావాలని కూడా టిస్ కోరింది. న్యాయ వ్యవస్థ ఇంకా ఉనికిలో ఉంది గనుక తన సస్పెన్షన్ చెల్లదని ప్రకటించాలని కోరుతూ అతను బోంబే హైకోర్టుకు వెళ్లాడు. ఎం.ఎం సత్తాయి, ఎ.ఎస్ చందూర్కర్ డివిజన్ బెంచ్ అతని పిటీషన్‌ను కొట్టివేస్తూ టిస్‌కు అనుకూలంగా తీర్పు చెప్పింది. ఈ తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేయనున్నట్లు శివానందన్ చెప్పాడు. ఇది వ్యక్తిగత సమస్య కాదని మొత్తం విద్యార్థి సమాజం మీద ప్రభావితం చూపనుందని అన్నాడు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫెలోషిప్ పొందుతున్న కారణంగా రాజకీయ పరమైన కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని, సంస్థలో ఉన్నపుడు రాజకీయ అభిప్రాయాలకు దూరంగా ఉండాలని కోర్టు పేర్కొన్నది. ఒక టెలికాం ఉద్యోగి యువకుడిగా ఉన్నపుడు ఒక యువజన సంఘ సమావేశంలో పాల్గొన్నందున ఉద్యోగం నుంచి తొలగించితే ఆ కేసు సుప్రీం కోర్టు వరకు వెళ్లింది. అతను పాల్గొన్నది నిషేధిత సంస్థ కాదు, యువకులు యువజన సంఘాల సమావేశాల్లో గాక మరిదేనిలో పాలుపంచుకోవాలని ప్రశ్నిస్తూ ఉద్యోగం నుంచి తొలగించటాన్ని తప్పు పడుతూ జస్టిస్ ఓ చిన్నపరెడ్డి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. తరువాత ఉద్యోగిగా ఆ యువకుడు ఉద్యోగ విరమణ చేసేవరకు టెలికాం ఉద్యోగుల యూనియన్లో కూడా చురుకుగా పని చేశారు.

కోర్టు పేర్కొన్న అంశాలు సరైనవి కాదని, ఒక విద్యార్థి అర్హత పరీక్షలో పాసైనపుడు ఫెలోషిప్ ఒక హక్కు తప్ప దయాధర్మం కాదని, పరిశోధక విద్యార్థికి ఫెలోషిప్ ఇవ్వటం తనంతట తాను బతకటానికి అవసరమైన ఉద్యోగ సంపాదన కోసం కాదని, జాతి నిర్మాణ క్రమంలో తోడ్పడేందుకు ఇచ్చే మొత్తమని శివానందన్ చెప్పాడు. ఏ విద్యా సంస్థ అయినా జారీచేసే సర్క్యులర్ కంటే రాజ్యాంగం ఎంతో ముఖ్యమైనదని తాను భావిస్తున్నానని, రాజ్యాంగ హక్కును వినియోగించుకున్నందుకు తనను శిక్షించారని అన్నాడు. టిస్ లేదా ఏ విశ్వవిద్యాలయం జారీ చేసే నిబంధనలు, సర్క్యులర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజ్యాంగాన్ని ఉల్లంఘించకూడదని, విద్యా సంస్థలు నిష్పాక్షికంగా ఉండాలని, ఒక తరహా రాజకీయాలకు ఒక విశ్వవిద్యాలయం తనను తాను ఎలా అనుబంధించుకుంటుందని ప్రశ్నించాడు.

'భారత్‌ను రక్షించండి, బిజెపిని తిరస్కరించండి' అనే నినాదంతో పార్లమెంట్‌కు ప్రదర్శనలో పాల్గొంటే...తాను పట్టుకున్న ప్లకార్డు మీద టిస్ పేరు ఉన్నట్లు అధికారులు ఆరోపించారని చెప్పాడు. ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫోరమ్ (పిఎస్ఎఫ్) ప్రధాన కార్యదర్శిగా ప్రదర్శనలో పాల్గొన్నాను తప్ప టిస్ ప్రతినిధిగా కాదని అన్నాడు. తనను సస్పెండ్ చేసిన టిస్ కమిటీ, హైకోర్టు ముందు కూడా ఇదే చెప్పానన్నాడు. శివానందన్ 2015లో టిస్ పోస్టు గ్రాడ్యుయేట్‌గా చేరి తరువాత అక్కడే ఎంఫిల్ పూర్తి చేసి పరిశోధక విద్యార్థిగా నమోదయ్యాడు. టిస్ గతంలో ఒక ప్రజాస్వామిక సంస్థగా కనీసం నటించేదని ఇటీవలి సంవత్సరాలలో విద్యార్థులు చేపట్టే ఎలాంటి కార్యక్రమాలకు అనుమతించటం లేదని చెప్పాడు. అయోధ్యలో రామాలయ ప్రారంభాన్ని ఒక జాతీయ కార్యక్రమంగా చేపట్టినపుడు జాతీయ అవార్డు పొందిన ఆనంద పట్వర్ధన్ డాక్యుమెంటరీ 'రామ్ కె నామ్ (రాముడి పేరుతో)'ను అనేక విశ్వవిద్యాలయాల్లో ప్రదర్శించారని తాను ఆ సమయంలో ప్రమాదంలో గాయపడి ప్రదర్శనకు రాలేకపోయానని, అయితే బాబ్రీ మసీదు విధ్వంసం సందర్భంగా జరిగిన దుర్మార్గమైన వాస్తవాలను తెలుసుకొనేందుకు అందరూ చూడాలని కోరుతూ తన అభిప్రాయాలను సామాజిక మాధ్యమంలో వెల్లడించగా దాన్ని కూడా దేశ వ్యతిరేక చర్యగా టిస్ తన మీదకు మళ్లించిందని పేర్కొన్నాడు. కేంద్రం నుంచి 50 శాతం పైగా నిధులు పొందుతున్న సంస్థలన్నింటిని కేంద్రం తన ఆధీనంలోకి తెచ్చుకున్న తరువాత టిస్‌లో అనేక పెను మార్పులు చోటు చేసుకున్నాయి. ఎక్కడ పది మంది విద్యార్థులు కూర్చుంటే, చివరకు తమ గ్రూపు ప్రాజెక్టుల గురించి చర్చించేందుకు ఒక చోట చేరినా సంస్థను అస్థిరపరిచేందుకు చూస్తున్నారంటూ చెదరగొట్టటం జరుగుతోందన్నాడు. శివానందన్‌ను హెచ్చరిస్తూ అనేక సార్లు తప్పుడు నోటీసులు జారీ చేసింది. భగత్ సింగ్ స్మారక ఉపన్యాసం చేసేందుకు పిలిచిన అతిథులను 'వివాదాస్పద ప్రసంగీకులు' అనే సాకుతో వారి పేర్లు లేకుండా ఇచ్చిన నోటీసు అలాంటి వాటిలో ఒకటి. సదరు వివాదాస్పద అతిథులు ఎవరంటే మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, ప్రముఖ జర్నలిస్టు పి.శాయినాథ్, జెఎన్‌యు మాజీ ప్రొఫెసర్, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ మాజీ సంపాదకుడు గోపాల్ గురు. గతేడాది టిస్ విద్యార్థి సంఘ ఎన్నికలను రద్దు చేసింది. ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫోరమ్‌ను నిషేధించింది. విద్యార్థులు ఆందోళన చేయటంతో వెనక్కు తీసుకుంది. ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటే టిస్‌కు ఎలాంటి అభ్యంతరం ఉండదు, కేంద్ర ప్రభుత్వ ఫెలోషిప్ తీసుకొనే వారు బిజెపి రాజకీయాలను విమర్శించకూడదంటే నేను అంగీకరించను, దేశంలో ఉండాలంటే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బిజెపి సభ్యత్వం తీసుకోవటానికి లేదా సానుభూతిపరునిగా ఉండటానికి నన్ను ఒత్తిడి చేయలేరని శివానందన్ చెప్పాడు.

అమెరికాలో ఏం జరుగుతోంది!

మహమ్మద్ ఖలీల్ అమెరికా పౌరసత్వం కలిగిన సిరియా దేశస్థుడు. అతని మీద చట్ట ఉల్లంఘనకు పాల్పడిన కేసులేవీ లేవు. అతన్ని బలవంతంగా సిరియా పంపేందుకు ట్రంప్ యంత్రాంగం చూస్తోంది. ఖలీల్ చేసిన నేరం ఏమిటో తెలుసా? గాజాలో పాలస్తీనియన్లపై మారణకాండకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ దుశ్చర్యలను ఖండిస్తూ కొలంబియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల నిరసనకు నాయకత్వం వహించటమే. వాక్, సభా స్వాతంత్ర్యాలు విలసిల్లుతుంటాయని భావించే దేశంలో ఇది జరిగింది. అతని భార్య ఎనిమిది నెలల గర్భవతి, అరెస్టు చేసిన ఖలీల్ గ్రీన్‌కార్డును రద్దు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం అతనుండే న్యూయార్క్ రాష్ట్రం నుంచి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లూసియానాలోని ఒక నిర్బంధ శిబిరానికి తరలించి తన మానవత్వ ముఖాన్ని ప్రదర్శించు కుంది. ఈ ఉదంతం తరువాత గ్రీన్ కార్డు ఉన్నంత మాత్రాన ఎవరూ అమెరికాలో శాశ్వతంగా ఉండే హక్కు ఉన్నట్లు కాదని ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ ప్రకటించాడు. అంటే ప్రభుత్వం తలచుకుంటే ఎప్పుడైనా రద్దు చేయవచ్చనే బెదిరింపు దీని వెనుక ఉంది. పాలస్తీనియన్లకు మద్దతుగా విద్యార్థులు ఆందోళనకు దిగినపుడు స్థానికులా, వలస వచ్చినవారా అనే తేడా లేకుండా అందరూ నిరసనల్లో పాల్గొన్నారు. దీన్ని నాటి బైడెన్ సర్కార్, నేటి ట్రంప్ జమానా కూడా సహించటం లేదు. గాజాలో మారణకాండకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు అమెరికాలో ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ నిస్సిగ్గుగా మద్దతు ఇస్తూ మానవ హక్కుల పరిరక్షణ గురించి ప్రపంచానికి సూక్తులు వల్లిస్తారు.

పాలస్తీనియన్లకు మద్దతు పలికిన మహమ్మద్ ఖలీల్ మీద 1952 నాటి కమ్యూనిస్టు వ్యతిరేక చట్టంలోని సెక్షన్లను మోపటాన్ని బట్టి ట్రంప్ అసలు రూపం వెల్లడైంది. వలస వచ్చే వారు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైనా లేదా అనుబంధం ఉన్నప్పటికీ వీసాలను తిరస్కరించటానికి లేదా అనర్హులుగా ప్రకటించటానికి ఆ చట్టం వీలు కల్పిస్తుంది. ఒకవేళ అమెరికా వచ్చినప్పటికీ తిరిగి పంపే అధికారం ప్రభుత్వానికి ఉంది. కమ్యూనిజానికి సంబంధించిన సాహిత్యాన్ని రాసినా, ముద్రించినా, తెలిసి కూడా పంపిణీ చేసినప్పటికీ తిప్పి పంపే అధికారం ఉంది. ఏ రాష్ట్రంలోనైనా, ఏ దేశంలోనైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉన్నప్పటికీ అలాంటి చర్యలు తీసుకోవచ్చు. ఉదారవాదులనే పేరున్న ప్రతిపక్ష డెమోక్రాట్లలో కొందరు ఖలీల్ అరెస్టు, గ్రీన్‌కార్డు రద్దును మాట మాత్రంగా ఖండించినప్పటికీ తమ పాలిత న్యూయార్క్ రాష్ట్ర వాసి అరెస్టు గురించి నిరసన వ్యక్తం చేయలేదు. అమెరికాలో గాడిద పార్టీ, ఏనుగు పార్టీ ఏదైనా ఒక్కటే అనేందుకు ఇలాంటి ఉదాహరణలు ఎన్నో చెప్పుకోవచ్చు.కమ్యూనిస్టు వ్యతిరేకత, అమెరికా విదేశాంగ విధానాలపై విమర్శను రెండు పార్టీలూ సహించవు.

2023లో డోనాల్డ్ ట్రంప్ ఒక ప్రతిజ్ఞ చేశాడు. అదేమంటే అమెరికా విధానాలను విమర్శించే విదేశీయులు, క్రైస్తవులను ద్వేషించే కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, సోషలిస్టులు ఎవరినీ అమెరికాలోకి అడుగుపెట్టనివ్వం. దీనికి గాను 1952 నాటి చట్టాన్ని వినియోగిస్తాం, దేశీయంగా పెరిగన కమ్యూనిస్టులు, మార్క్సిస్టులను అదుపు చేసేందుకు కొత్త చట్టాన్ని తీసుకురావాలని చెప్పాడు. ట్రంప్ తొలిసారి అధికారానికి వచ్చినపుడు అమెరికాను సోషలిస్టు దేశంగా మారనిచ్చే సమస్యే లేదని ప్రకటించటాన్ని అత్యధిక డెమోక్రాట్లు హర్షించారు. అయితే చరిత్రను చూస్తే కమ్యూనిస్టుల రాకను నిషేధించే చట్టం ఉన్నప్పటికీ పూర్తిగా నిరోధించటం గానీ, అమెరికాలో సోషలిస్టు, కమ్యూనిస్టు భావజాల వ్యాప్తిని అడ్డుకోవటం గానీ చేయలేకపోయారన్నది వాస్తవం. మన దేశానికి చెందిన క్షమా సావంత్ వంటి వారు అనేక మంది అమెరికా వెళ్లి వామపక్ష వాదులుగా మారిన సంగతి తెలిసిందే. అరచేతిని అడ్డు పెట్టి సూర్యకాంతిని అపేందుకు చూసిన ప్రబుద్ధుల సంగతి తెలిసిందే, భావజాలమూ అంతే. ఎవరూ ఆపలేరు, ఎంతగా అడ్డుకుంటే అంతే వేగంతో విస్తరిస్తుందన్నది చరిత్ర చెప్పిన సత్యం! ★

సందర్భం

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన గళం



పి.అజయ కుమార్

తను చెప్పిన మాటలకు విరుద్ధంగా మోడీ ప్రభుత్వం నడుచుకుంటోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు స్వయంప్రతిపత్తి సంస్థలని, వాటి రోజువారీ పనిలో తాము జోక్యం చేసుకోబోమని ఇటీవల ప్రధాని చెప్పారు. మరోపక్క కేంద్ర ఆర్థిక శాఖ తాను ఆమోదించిన బ్యాంకు యాజమాన్య, ఉద్యోగ సంఘాల మధ్య జరిగిన ద్వైపాక్షిక ఒప్పందాలను తానే బేఖాతరు చేస్తోంది. వేతనాలు, అలవెన్సులు, ఇతర సౌకర్యాలకు అదనంగా బ్యాంకులకు వచ్చే లాభాలను బట్టి అందరికీ ప్రోత్సాహకాలు ఇవ్వాలనేది ఒప్పందం. దీనికి విరుద్ధంగా కేవలం 3 శాతంగా ఉండే పైస్థాయి అధికారులకు మాత్రమే ప్రోత్సాహకాలను ఇవ్వాలని ఆర్థికశాఖ నోటిఫికేషన్ ఇచ్చింది.

ప్రభుత్వ రంగం బ్యాంకుల్లో సిబ్బంది తగ్గిపోయి పని చేస్తున్న ఉద్యోగులపై ఆ భారం పడుతోంది. ఉద్యోగులు పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఖాతాదారుల సేవలపై దుష్ప్రభావం పడుతోంది. బ్యాంకుల విలీనాలు, శాఖల మూసివేత పర్యవసానంగా సిబ్బంది సంఖ్య తగ్గడమేగాక ఒత్తిడిని తట్టుకోలేక ఉద్యోగాలను వదిలిపెట్టిపోయే వారి సంఖ్య కూడా పెరిగింది.

2012-13లో మొత్తం ఉద్యోగుల సంఖ్య 8,01,659 కాగా 2023-24 నాటికి అది 7,46,679కి తగ్గిపోయింది. అంటే 54,980 మంది ఉద్యోగులు తగ్గారు. బ్యాంకులు నిర్వహించే వ్యాపార లావాదేవీల మొత్తం మాత్రం ఇదే కాలంలో రూ.102 లక్షల కోట్ల నుండి రూ.224 లక్షల కోట్లకు పెరిగింది. ఒక్కో ఉద్యోగి టర్నోవర్ రూ.12 కోట్ల నుండి రెండున్నర రెట్లు పెరిగి రూ.30 కోట్లకు చేరింది. మరోపక్క బ్యాంకుల్లో ఉద్యోగాలకోసం లక్షలాదిమంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

పెరుగుతున్న వ్యాపారానికి తగిన విధంగా సిబ్బంది నియామకాలు జరగడం లేదు. మరోపక్క ప్రైవేటు బ్యాంకుల్లో 2012-13లో 2,69,941 మంది ఉద్యోగులు ఉండగా వారి సంఖ్య 2023-24లో 8,46,530కి పెరిగింది. ప్రైవేటు రంగంలో ప్రతీ ఉద్యోగి టర్నోవరు రూ.11 కోట్ల నుండి రూ.16 కోట్లకు మాత్రమే పెరిగింది. ప్రైవేటు రంగ బ్యాంకులతో పోల్చుకుంటే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సిబ్బంది సంఖ్య గణనీయంగా పెరగాల్సి వుండగా దానికి బదులు తగ్గిపోయింది!

మామూలు వ్యాపారానికి తోడుగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ బీమా యోజన వంటి అనేక పథకాలను ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్వహిస్తున్నాయి. ప్రైవేటు రంగ బ్యాంకులకు ఈ పని ఉండదు. ప్రభుత్వ రంగ బ్యాంకులు 2023-24లో అత్యధికంగా నికర లాభం ఒక లక్షా 41 వేల కోట్లు ఆర్జించాయి. 2024-25 అర్ధ సంవత్సరంలోనే రూ.85,520 కోట్ల నికర లాభం ఆర్జించాయి. మోడీ ప్రభుత్వానికి...బ్యాంకుల లాభాలలో తన వంతు వాటాగా డివిడెండ్‌ను కాజేయడం మీద ఉన్న శ్రద్ధ...వ్యాపారానికి తగినంత సిబ్బందిని నియమించడంలో కాని, ఖాతాదారుల సేవలను మెరుగుపరచడంలో కాని లేదు.



మార్చి 24, 25 తేదీలలో బ్యాంక్ ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె

కేంద్ర ప్రభుత్వ విధానాల వలన ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పర్మనెంట్ పనులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో చేయిస్తున్నారు. కొన్ని కీలకమైన పనుల్లో కూడా వీరిని నియమించడం బ్యాంకుల రక్షణకు ప్రమాదమే కాక, వీరి ఉద్యోగాలకు రక్షణ లేనందున వారి పనిలో నాణ్యత కూడా తగ్గుతుంది. వీరందరినీ పర్మనెంట్ చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

ఇతర కార్మిక, ఉద్యోగ వర్గాల మాదిరిగానే బ్యాంక్ ఉద్యోగులు కూడా పెన్షన్ సంస్కరణల దుష్ఫలితాలను ఎదుర్కొంటున్నారు. 2010 ఏప్రిల్ ఒకటవ తేదీ, ఆ తర్వాత చేరిన ఉద్యోగులకు, అధికారులకు 1995, 1996 పెన్షన్ విధానాన్ని వర్తింపజేయడం లేదు. వీరికి నిర్ధారణగా ఇంత పెన్షన్ వస్తుందని లేదు. కొత్త పెన్షన్ స్కీమును అమలు చేస్తున్నారు. పెన్షన్ లేదా ఆదాయం కోసం చెల్లింపులు చేయడం మినహా ఇంత పెన్షన్ లేదా ఆదాయం వస్తుందన్న గ్యారంటీ లేదు. వీరికి 1995, 1996 పెన్షన్ రెగ్యులేషన్లను వర్తింపజేయాలి.

1995, 1996 పెన్షన్ రెగ్యులేషన్లు అమలవుతున్న బ్యాంకు ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ అప్‌డేషన్ లేదు. తాజాగా జరిగిన ఒప్పందం వరకూ పెన్షన్‌ను అప్‌డేట్ చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ రూల్స్ వర్తించే ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం గ్రాట్యుటీని రూ. 25 లక్షల వరకు పెంచి పూర్తిగా ఆదాయ పన్ను నుండి మినహాయించింది. బ్యాంకు ఉద్యోగులకు, ఇతరులకు కూడా గ్రాట్యుటీ చెల్లింపు (సవరణ) చట్టం-2018ని వర్తింపజేసి గ్రాట్యుటీని రూ.25 లక్షలకు పెంచి, పూర్తి మొత్తాన్ని ఆదాయ పన్ను నుంచి మినహాయించాలి.

కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగులపైన, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులపైన సామర్థ్యం పేరుతో పదే పదే దాడి చేస్తోంది. ముందస్తుగా పదవీ విరమణ చేయించే ప్రయత్నం చేస్తోంది. ఈ సారి వంతు ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులది. 55, 57, 58 సంవత్సరాల వయస్సుకు చేరుకున్న అందరు ఉద్యోగుల, అధికారుల సామర్థ్యాన్ని ప్రతీ నెలా పరీక్షించి తమకు నివేదికలు పంపాలని 2024 సెప్టెంబర్ 26న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అన్ని బ్యాంకులకు ఆదేశాలు పంపింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం అంకిత భావంతో పని చేస్తున్న ఉద్యోగుల, అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీస్తుంది. ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడుతుంది. ఒప్పందాల ద్వారా పని కోసం నిర్దేశించిన నిబంధనలు ఉండగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం ప్రభుత్వ రంగ బ్యాంకుల స్వయంప్రతిపత్తికి హానికరంగా మారుతుంది. ఆ ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలి.

అమలులో ఉన్న బ్యాంక్ చట్టాల ప్రకారం, ఉద్యోగుల నుండి ఒకరిని, అధికారుల నుండి ఒకరిని ప్రభుత్వ రంగ బ్యాంకుల బోర్డులలో డైరెక్టర్లుగా నియమించాలి. గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం యూనియన్లు పంపిన ప్యానెళ్ల నుండి డైరెక్టర్ల నియామకాలు చేయడం లేదు. చట్టాన్ని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వమే ఉల్లంఘిస్తోంది.

ఒక్క ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచే కాకుండా ప్రతీ ప్రభుత్వ రంగ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటాను మైనారిటీ స్థాయికి దిగజార్చేందుకు మోడీ ప్రభుత్వం ఒక్కొక్కటిగా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా బ్యాంకులను విలీనం చేసి ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్యను 12కు తగ్గించింది. బ్యాంకింగ్ వంటి వ్యూహాత్మక రంగాలలో కూడా ప్రభుత్వ రంగంలో ఒక్క బ్యాంక్‌ను మాత్రమే ఉంచి తక్కిన బ్యాంకులన్నింటినీ ప్రైవేటీకరించడం మోడీ ప్రభుత్వ విధానం. ఆ ఒక్క బ్యాంకులో కూడా ప్రభుత్వానికి మైనారిటీ వాటాయే ఉంటుంది. ఈ విధానంలో భాగంగానే ప్రభుత్వ రంగ బ్యాంకులను బలహీనపరిచే ప్రయత్నం చేస్తోంది. కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్దేశిత కాలానికి మాత్రమే (ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్) ఉద్యోగులను నియమిస్తున్నాయి.

బ్యాంక్ ఉద్యోగుల మాదిరిగానే ఇతర రంగాలలోని ఉద్యోగులు, కార్మికులు కూడా అవే సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఖాళీల భర్తీ, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకపోవడం, కొత్త పెన్షన్ స్కీమునే రద్దు చేయకుండా కొనసాగించడం, ప్రైవేటీకరణ ప్రయత్నాలు, ముందస్తుగా పదవీ విరమణ చేయించే ప్రయత్నాలు ముమ్మరం చేయడం, ఒప్పందాలను, చట్టాలను ప్రభుత్వమే ఉల్లంఘించడం తదితర సమస్యల పరిష్కారం కోసం ఇతర రంగాలలోని ఉద్యోగులు కూడా పోరాటాలలోకి వస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు ఆ ప్లాంట్ రక్షణ కోసం, ఉద్యోగుల తొలగింపును ఆపడం కోసం, సుదీర్ఘ కాలంగా పోరాటంలో ఉన్నారు. విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆ రంగ ఉద్యోగులు, ఇంజనీర్లు జాతీయ స్థాయిలో జూన్ 26న సమ్మె చేయాలని వారి సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది.

బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు, ఐక్యంగా సమ్మె చేయడం తక్కిన రంగాలకు ఆదర్శప్రాయం. వివిధ రంగాలలో జరుగుతున్న పోరాటాలు మొత్తం అందరి ఐక్య పోరాటాలకు దారి తీయాలి. లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ కార్మిక ఉద్యోగ సంఘాల సమ్మె మే 20న జాతీయ స్థాయిలో జరగనుంది. అలాంటి పోరాటాలలో కూడా బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు భాగస్వాములు కావాలి.

/ వ్యాసకర్త సిఐటియు ఉపాధ్యక్షులు /

కేంద్రంపై ఎక్స్ దావా

- ఏకపక్ష సెన్సార్‌షిప్‌పై ఆగ్రహం

న్యూఢిల్లీ : అమెరికా బిలియనీర్ ఎలాన్ మస్క్‌కి చెందిన సోషల్ మీడియా దిగ్గజం ఎక్స్ గురువారం కేంద్ర ప్రభుత్వంపై దావా వేసింది. అక్రమ నియంత్రణలు, ఏకపక్ష సెన్సార్‌షిప్‌ను విధిస్తున్నారని ఆరోపిస్తూ కర్ణాటక హైకోర్టులో కేసు ఫైల్ చేసింది. సమాచార సాంకేతిక (ఐటి) చట్టానికి కేంద్రం ఇచ్చే భాష్యంపై ఆందోళనలు లేవనెత్తింది. ముఖ్యంగా సెక్షన్ 79(3)(బి)ను ఉపయోగించడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇది సుప్రీంకోర్టు రూలింగ్స్‌ను ఉల్లంఘిస్తోందని, ఆన్‌లైన్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛను విఘాతం కలిగిస్తోందని ఎక్స్ పేర్కొంది. సెక్షన్ 69ఎలో పేర్కొన్న చట్టబద్ధమైన ప్రక్రియను పక్కనపెట్టి సమాంతర సమాచార నిరోధక యంత్రాంగాన్ని సెక్షన్ 79 సృష్టిస్తోందని ఆ దావాలో ఎక్స్ పేర్కొంది. కోర్టు ఉత్తర్వులు జారీచేసినపుడు లేదా ప్రభుత్వ నోటిఫికేషన్ ఇచ్చినపుడు చట్టవిరుద్ధమైన సమాచారాన్ని తొలగించాలని సెక్షన్ 79(3)(బి) సోషల్ మీడియా వేదికలకు నిర్దేశిస్తోంది. 36గంటల్లోగా సదరు వేదిక ఆ సమాచారాన్ని తొలగించని పక్షంలో సెక్షన్ 79(1) కింద లభించే రక్షణను కోల్పోయే ప్రమాదముంది. పైగా బిఎన్‌ఎస్ సహా వివిధ చట్టాల కింద జవాబుదారీగా వ్యవహరించాల్సి వుంటుంది. ఈ ఆదేశాలను ఎక్స్ సవాల్ చేస్తోంది. సమాచారాన్ని నిషేధించేందుకు ప్రభుత్వానికి స్వతంత్ర అధికారాన్ని ఆ నిబంధన ఇవ్వడం లేదని వాదిస్తోంది. చేపట్టాల్సిన ప్రక్రియను చేపట్టకుండా ఏకపక్షంగా సెన్సార్‌షిప్ విధించడానికి అధికారులు, చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించింది. ఐటి చట్టంలోని సెక్షన్ 69ఎ కింద వున్న సార్వభౌమాధికారానికి భంగం కలిగించే సమాచారాన్ని నిషేధించే అధికారం ప్రభుత్వానికి వుంది. నిర్ణయం తీసుకోవడానికి ముందుగా ఆ సమాచారాన్ని సమీక్షించాల్సి వుంటుంది కానీ అలాంటి చర్యలేవీ చేపట్టకుండానే ప్రభుత్వం షార్ట్‌కట్‌గా సెక్షన్ 79(3)(బి)ని ఉపయోగిస్తోందని ఎక్స్ వాదించింది.

ఇసి పిటిషన్ పరిష్కారం

ప్రజాశక్తి, అమరావతి

చట్టసభలకు జరిగిన ఎన్నికల తర్వాత బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో బోగస్ ఓట్ల తొలగింపు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తమకు తెలపకుండానే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయడాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తప్పుపడుతూ హైకోర్టులో వాదించింది. అర్హుల ఓట్ల తొలగింపు కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేయడంపై నిజానిజాలు తేల్చే పేరుతో సిట్ ఏర్పాటు ఏకపక్షమని పేర్కొంది. సిట్ ఏర్పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీవో జారీ చేశారని ఇసి తరపు సీనియర్ అడ్వొకేట్ అవినాష్ దేశాయ్ హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీనికి ప్రభుత్వ సహాయ న్యాయవాది అజయ్ వాదిస్తూ, సిట్ ఏర్పాటు జీవోను ప్రభుత్వం వాపస్ తీసుకుంటున్నారు. ఈ మేరకు ఈ నెల 19న జీవో వెలువరించిందన్నారు. జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకుంటున్నట్లు హైకోర్టుకు తెలిపింది. సిట్ ఏర్పాటు జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకున్న నేపథ్యంలో ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని హైకోర్టు ప్రకటించింది. సిట్ ఏర్పాటును సవాల్ చేస్తూ జీవోను సవాల చేస్తూ బాపట్లకు చెందిన గుదంశెట్టి కోటేశ్వరరావు సహా ముగ్గురు దాఖలైన వ్యాజ్యాల పరిష్కారమైనట్లుగా జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్ నోటీసు నిలిపివేత

ప్రజాశక్తి, అమరావతి

ఏజెన్సీ ప్రాంతంలోని డివిజనల్ ఆఫీసర్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేయాలంటే అనుమతి తీసుకోవాలంటూ లాయర్లకు రంపచోడవరం సబ్ డివిజనల్ ఆఫీసర్ కమ్ సబ్ కలెక్టర్ నోటీసు ఇవ్వడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. అడ్వొకేట్లకు నోటీసులు ఇవ్వడం అధికార పరిధి దాటడమేనని చెప్పింది. సబ్ కలెక్టర్ జారీ చేసిన నోటీసుల అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, రంపచోడవరం సబ్ కలెక్టర్ ఇతరులకు నోటీసులు జారీ చేస్తూ జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని డివిజనల్ ఆఫీసర్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేయాలంటే సంబంధిత ఆఫీసర్ నుంచి పర్మిషన్ తీసుకోవాలని, లేకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఈనెల 7న సబ్‌కలెక్టర్ నోటీసు జారీపై రంపచోడవరంకి చెందిన న్యాయవాది ఎం. వెంకటరత్న ప్రకాష్ పిటిషన్ వేశారు.

మిథున్‌రెడ్డి బెయిల్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో సిఐడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాజంపేట ఎంపి పీవీ మిథున్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ ఈనెల 24కి వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వాయిదా వేయాలని పీపీ కోరడంతో హైకోర్టు అనుమతి ఇచ్చింది. అప్పటి వరకు పిటిషనర్ అరెస్టు కాకుండా ఉత్తర్వులు ఇవ్వాలని న్యాయవాది కోరగా, తదుపరి విచారణలో పరిశీలిస్తామని చెప్పింది.

ముంతాజ్ హోటల్స్ రద్దు కోరుతూ తీర్మానం

- హైకోర్టుకు తెలిపిన టిటిడి

ప్రజాశక్తి, అమరావతి

తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ పరిధిలో ఫైవ్ స్టార్ హోటల్స్, విల్లా నిర్మాణం నిమిత్తం 20 ఎకరాల భూమిని ఒబెరాయ్ గ్రూపునకు చెందిన ముంతాజ్ హోటల్స్ లిమిటెడ్, ట్రైడెంట్ ఫైవ్ స్టార్ హోటల్‌కు కేటాయిస్తూ 2021లో జారీ చేసిన జీవో 24ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసినట్లు టిటిడి హైకోర్టుకు చెప్పింది. ఈ మేరకు టిటిడి ఇఒ శ్యామలరావు కౌంటర్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 నవంబర్ 24న జారీ చేసిన జీవో 24ని రద్దు చేయాలని కోరుతూ తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు ఓంకార్, ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామీజీ వేసిన పిల్స్ చీఫ్ జస్టిస్ బెంచ్ విచారించి టిటిడిని కౌంటర్ దాఖలు చేయాలని గతంలో ఆదేశించింది.

నాగ్‌పూర్‌లో పలు ప్రాంతాల్లో
కర్ఫ్యూ ఎత్తివేత, సడలింపు

నాగ్‌పూర్ : నాగ్‌పూర్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం కర్ఫ్యూ ఎత్తివేశారు. మరికొన్ని ప్రాంతాల్లో సడలించారు. నాగ్‌పూర్‌లో ఉన్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలంటూ విహెచ్‌పి, భజరంగ్‌దళ్ శ్రేణులు సోమవారం రాత్రి హింసాకాండకు దిగిన సంగతి తెలిసిందే. దీంతో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ విధించారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి నందనవన్, కపిల్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూను ఎత్తివేశారు. కొన్నిచోట్ల మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కర్ఫ్యూను సడలించారు. ఈ హింసాకాండకు సంబంధించి ఆరుగురిపై సెడిషన్ కేసు నమోదు చేశామని, మొత్తంగా 50 మందిపై కేసులు పెట్టామని నాగ్‌పూర్ సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసిన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌కు చెందిన 230 ప్రొఫైల్స్ గుర్తించి గురువారం కోరడంతోపాటు బ్లాక్ చేయాలని ఆయా సంస్థలను సైబర్ క్రైమ్ విభాగం కోరింది.

ఔరంగజేబు సమాధిపై టిన్ షీట్లు

ఔరంగజేబు సమాధిని తొలగిస్తామని పుకార్లు వ్యాపించడంతో సమాధికి రెండువైపులా టిన్ షీట్లను, వైర్ ఫెన్సింగ్‌ను భారత పురావస్తు సర్వే (ఎఎస్‌ఐ) ఏర్పాటు చేసింది.

సంతోషకరమైన దేశాల
జాబితాలో ఫిన్లాండ్ ఫస్ట్!

వాషింగ్టన్ : ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్లాండ్ వరుసగా ఎనిమిదోసారి అగ్ర స్థానంలో నిలిచింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలోని వెల్‌బీయింగ్ రీసెర్చ్ సెంటర్ ప్రచురించిన వార్షిక జాబితాలో ఫిన్లాండ్ తర్వాత స్థానాల్లో వరుసగా డెన్మార్క్, ఐస్‌లాండ్, స్వీడన్ వున్నాయి. జీవితాన్ని ఎలా అంచనావేస్తున్నారని అడిగిన ప్రశ్నకు ప్రజలిచ్చే సమాధానాలపైనే దేశాల ర్యాంకులు ఆధారపడి వుంటాయి. అనలిటిక్స్ సంస్థ గాలప్, ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి పరిష్కారాల నెట్‌వర్క్ భాగస్వామ్యంతో వెల్‌బీయింగ్ రీసెర్చ్ సెంటర్ ఈ అధ్యయనం నిర్వహించింది.

కట్లేరు వాగుపై బ్రిడ్జిని నిర్మించండి

- మంత్రులకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



మంత్రులు జనార్ధన్ రెడ్డి, రాం ప్రసాద్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న లక్ష్మణరావు

ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలం వినగడప గ్రామం వద్ద కట్లేరు వాగుపై బ్రిడ్జిని పునర్‌నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి ఎం.రాం ప్రసాదరెడ్డికి గురువారం ఆయన వినతిపత్రాన్ని అందచేశారు. ఆరేళ్ల క్రితం వరదల్లో బ్రిడ్జి కూలిపోయిందని, తాత్కాలికంగా చప్టాను ఏర్పాటు చేశారని లక్ష్మణరావు తెలిపారు. దాదాపు 20 వేల మంది ప్రతి రోజు ఈ బ్రిడ్జి ద్వారా ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. గత సిఎం తిరువూరు బహిరంగసభలో నిర్మిస్తామని ప్రకటించినా ఇంతవరకు అనుమతి ఇవ్వలేదన్నారు. తిరువూరు, గంపలగూడెం ప్రజల సౌకర్యం కోసం కట్లేరు వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు.

తోటపల్లి ఆధునీకరణ పనుల పున:పరిశీలన

- నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్రలోని తోటపల్లి ప్రాజెక్టు ఆధునీకీకరణ పనులకు సంబంధించి పున:పరిశీలన చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. పాలకొండ, రాజాం, కురుపాం నియోజకవర్గాలకు నీరందించే ఆశయంతో నాగావళి నదిపై తోటపల్లి వద్ద 1908లో ఈ ప్రాజెక్టును నిర్మించారన్నారు. దీనికి అనుబంధంగా కుడి,ఎడమ కాలువలు, ఇతర నిర్మాణాల ద్వారా తోటపల్లి ఆయకట్టు పరిధి రైతులకు నీరందేది అని మంత్రి పేర్కొన్నారు. సభ్యుల కోరిక మేరకు తోటపల్లి కుడి, ఎడమ కాలువల ఆవశ్యకతను, ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకుని కొత్త రేట్ల ప్రకారం అంచనాలు వేయించి పున:పరిశీలన చేస్తామని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. గొట్టా బ్యారేజ్ ఆదునీకరణకు కూడా రూ.16కోట్లు వ్యయం కాగల ప్రతిపాదన ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించి పరిపాలనామోదం కోసం చూస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న మూడు నెలలు అధిక ఉష్ణోగ్రత, వడగాల్పుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సిఎస్ కె.విజయానంద్ పేర్కొన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రానున్న రోజుల్లో సంభవించే వడగాల్పులు సన్నద్ధతపై గురువారం సచివాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 40 నుంచి 42 డిగ్రీల సెల్షియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. వడగాల్పుల నుంచి కాపాడుకునేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ప్రజల్లో అవగాహన కలిగించాలని విపత్తుల నిర్వహణ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉపాధికూలీలు పనిచేసే చోట్ల తాగునీరు, మజ్జిగ, టెంట్లు, ప్రథమ చికిత్స వంటి కనీససౌకర్యాలు కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. వడగాల్పుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని,జిల్లా స్థాయిలో వివిధ శాఖలను సమన్వయం చేసేందుకు వీలుగా ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలన్నారు. ఏయే ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయో ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు. ఈ సమీక్షలో విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ పాల్గొన్నారు.

అమరావతి చిత్ర కళా వీధి

- పోస్టర్‌ను ఆవిష్కరించిన పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

"అమరావతి చిత్ర కళా వీధి" పోస్టర్‌ను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ ఛైర్మన్ తేజస్వి పొడవాటితో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఈ ప్రత్యేకమైన కళా ఉత్సవం రాష్ట్రంలోని కళాకారులందరికీ ఒక ఆశా కిరణంలా నిలుస్తుందన్నారు. ప్రతిభావంతులైన కళాకారులు వారి కళను ప్రదర్శించడానికి గుర్తింపు పొందడానికి ఒక వేదికను అందించడంలో తన పూర్తి మద్దతు ఉ ంటుందన్నారు

ఎప్పుడూ ఉత్సాహంగా ఉండండి

- సిఎం చంద్రబాబు
- ముగిసిన ప్రజాప్రతినిధుల ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

గత రెండు రోజులుగా ప్రజాప్రతినిధులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు విజయవాడ ఏ కన్వెన్షన్‌లో గురువారం బహుమతుల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ధుర్యోధనుడిగా డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఏకపాత్రాభినయం, బాల చంద్రుడిగా కందుల దుర్గేష్ అలరించారు. అనంతరం జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ... వినోదం ఒక సందేశమని... డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు చెప్పిన డైలాగులు వినగానే ఎన్‌టిఆర్ గుర్తొచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బ్రహ్మాండంగా నటించారన్నారు. కార్యకర్త నాయకుడిని ఎలా అడుగుతాడో మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి కూడా అలాగే అడిగారని, ఆంజనేయులు కూడా ఎమ్మెల్యే ఎలా స్పందించాలే అలాగే స్పందించి నటించారని (నవ్వుతూ) అన్నారు. ఎమ్మెల్యేలంతా ఈ విధంగా ఉత్సాహంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లే అవసరం ఉండదన్నారు. ప్రతిపక్షం, అధికార పక్షం అనేది ప్రజాసమస్యలపై పోరాడటానికి తప్ప వ్యక్తిగత విభేదాలు పెట్టుకోవడానికి కాదన్నారు. మర్రి చెన్నారెడ్డి సిఎంగా ఉన్నప్పుడు ఓ అంశంపై తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమోషన్‌లో బల్ల గుద్ది చెప్పానని, చెన్నారెడ్డికి కోపం వచ్చి బల్ల ఎందుకు గుద్దావు ఏమనుకుంటున్నావు అని తనను ప్రశ్నించారని తెలిపారు. అసెంబ్లీ అనేది ప్రజలకు జావాబుదారీతనంగా ఉండాలి తప్ప ప్రతిపక్షాలకు కాదన్నారు. ప్రజలకు కావాల్సింది సమస్యల పరిష్కారం మాత్రమేనన్నారు. బూతులు తిడితే తిట్టిన వారికి ఆనందం కలిగిస్తాయి తప్ప ప్రజలకు కాదన్నారు. త్వరలో ప్రధాని సభలో కూచిపూడి నాట్య ప్రదర్శనకు అవకాశం కల్పిస్తామని, వచ్చే ఏడాది కూడా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ..ఇదో అద్భుతమైన రోజు అని అన్నారు. శాసనసభలో ఎస్‌సి వర్గీకరణ బిల్లు మీద తీర్మానం చేసిన రోజు, మందకృష్ణ గారి పోరాట స్ఫూర్తితో సుమారు మూడు దశబ్ధాల పోరాటానికి విజయం సాధించిన రోజు అని చెప్పారు. ఇలాంటి సంప్రదాయాలు ఎల్లప్పుడు కొనసాగాలని కోరారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ... 1983 నుంచి ఎమ్మెల్యేగా పనిచేశానన్నారు. అప్పట్లో ఎప్పుడూ ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్ జరుగుతుండేవని, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు కూడా సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొని దుర్యోధనుడి పాత్ర వేసి మొదటి బహుమతి గెలుచుకున్నారని గుర్తు చేశారు. అదే ఒరవడిని నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా కొనసాగిస్తున్నారన్నారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధితాధికారులు, తదితరలు పాల్గొన్నారు.

నేర చరిత నేతల్లో ప్రథమ స్థానంలో రాష్ట్రం

- పిసిసి నేత తులసిరెడ్డి ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేర చరిత గల ఎమ్మెల్యేల శాతంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండటం శోచనీయమని మాజీ ఎంపి, పిసిసి ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేల అఫిడవిట్‌ల ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్, నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు రూపొందించిన నివేదిక ప్రకారం... రాష్ట్రం నేర చరిత ఉన్న 79 శాతం ఎమ్మెల్యేలతో ప్రథమ స్థానంలో ఉందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 68.5 శాతంలో తెలంగాణ మూడవ స్థానంలో నిలిచిందన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ కంటే రాష్ట్రంలో నేర చరితులు ఎక్కువగా ఉండటం గమనించాల్సిన విషయమన్నారు. జాతీయ స్థాయిలో ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ.17.92 కోట్లుగా ఉంటే, రాష్ట్రం ఈ సగటులో రూ. 65.07 కోట్లతో మొదటి స్థానంలో ఉందన్నారు. పార్టీల వారీగా చూస్తే వైసిపి ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ. 99 కోట్లు, టిడిపి ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ. 67.90 కోట్లు ఉందని, జనసేనది ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ. 40 కోట్లుగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో అత్యధిక ఆస్తి ఉన్న తొలి 10 మంది ఎమ్మెల్యేలలో రాష్ట్రానికి చెందిన వారే నలుగు ఉన్నారని తెలిపారు. సిఎం చంద్రబాబు రూ. 931 కోట్లతో 5వ స్థానంలో, మంత్రి నారాయణ రూ.824 కోట్లతో 6వ స్థానంలో, జగన్ రూ. 757 కోట్లతో 7వ స్థానంలో, వై.ప్రశాంతిరెడ్డి రూ. 716 కోట్లతో 8వ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ లెక్కలను బట్టీ చూస్తే రాష్ట్రంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే అవకాశాలు ఏ మాత్రం లేవని స్పష్టమవుతుందని తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - గన్నవరం

కృష్ణా జిల్లా గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఎస్‌పి ఆర్.గంగాధరరావు తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఈ కేసులో మొత్తం ఎనిమిది మందిని నిందితులుగా గుర్తించామని చెప్పారు. వీరిలో వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన బాణావతు లక్ష్మణ జితేంద్ర కుమార్, పగడాల హర్షవర్ధన్‌ను అరెస్టు చేశామని వివ రించారు. మిగిలిన ఆరుగురు నిందితుల కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.

'మిట్టల్' సమస్య వస్తే రాష్ట్ర సమస్యగా చూశాం!

- మండలిలో పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న మిట్టల్ స్టీల్ కంపెనీకి సమస్య వస్తే దాన్ని రాష్ట్ర సమస్యగా భావించి తక్షణమే పరిష్కరించామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దావోస్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు-2025 సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల వివరాల గురించి వైసిపి సభ్యులు టి మాధవరావు, పండుల రవీంద్రబాబు, కె శ్రీనివాస్ శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో గురువారం అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబిస్తూ మిట్టల్ స్టీల కంపెనీకి వచ్చిన ఆ ఒక్క సమస్యనే కాకుండా, ఇతర అన్ని సమస్యలను కూడా పరిష్కరించినట్లు తెలిపారు. ఒడిషాలో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు మిట్టల్ కంపెనీ ప్రయత్నిందని, తాము ఆ కంపెనీతో చర్చలు జరిపి రాష్ట్రంలో ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న పారిశ్రామికవేత్తలను తరిమికొట్టారని తెలిపారు. లూలు మాల్, అమర్ రాజా ఫ్యాక్టరీలను పక్క రాష్ట్రాలకు తరిమికొట్టారని విమర్శించారు. ఒక్క ఫోన్ కాల్‌తో అమర్ రాజా రాష్ట్రం నుంచి తరలిపోయిందన్నారు. శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నంలో ప్రధాన మంత్రి ప్రారంభించిన కంపెనీ పనులన్ని తమ ప్రభుత్వంలో పూర్తిచేశామన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో జిందాల్ కంపెనీని తరిమేశారని విమర్శించారు. మహారాష్ట్రలో ఆ కంపెనీ రూ.3లక్షల కోట్లతో ఎంవోయు చేసుకున్నారని చెప్పారు. తమ ప్రభుత్వంపై నింద వేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అమర్ రాజాను తాము తరిమేసినట్లు ఆ కంపెనీ నుంచి చెప్పించగలరా అని ప్రశ్నించారు. మంత్రి పయ్యావుల మాట్లాడుతూ రైల్వే జోన్‌కు భూమి కూడా ఇవ్వలేదని విమర్శించారు. బొత్స స్పందిస్తూ రైల్వే జోన్ భూమికి తాము అనుమతి ఇచ్చామని, దీనిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య కొంతసేపు వాగ్యువాద్దం చోటుచేసుకుంది. ఈ అంశంపై మరోసారి చర్చ జరపాలని పయ్యావుల మండలి ఛైర్మన్ కె మోషేనురాజును కోరారు.

అప్పులపై మండలిలో గందరగోళం

- ఆర్థిక మంత్రికి, వైసిపి సభ్యులకు మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అప్పులపై శాసన మండలిలో గురువారం సుదీర్ఘ చర్చ జరిగింది. వైసిపి సభ్యులు తూమాటి మాధవరావు, లేళ్ల అప్పిరెడ్డి, పండుల రవీంద్ర బాబు తదితరులు అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానం ఇస్తూ 2024 జూన్ 12 నాటికి ఉన్న మొత్తం అప్పు రూ.9,74,556 కోట్లు ఉన్నట్టు తాము గతంలో విడుదల చేసిన శ్వేతపత్రంలో పేర్కొన్న వివరాలను సభ ముందుంచినట్టు తెలిపారు. ఇందుకు తూమాటి మాధవరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. వైసిపి హయంలో చేసిన మొత్తం అప్పు రూ.3.39 లక్షల కోట్లు అయితే రూ.14 లక్షల కోట్లు మంత్రులు అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అలాగే ఇటీవల గవర్నర్ ప్రసంగంలో రూ.10 లక్షల కోట్లు అప్పు చేసినట్టు కూడా అసత్యంగా మాట్లాడించారని తెలిపారు. ఇందుకు మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానం చెబుతూ 2014 జూన్ నాటికి రాష్ట్ర విభజన తరువాత రూ.97,176 కోట్లు అప్పులు రాష్ట్రానికి కేటాయించారని తరువాత 2018-19 ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి రూ.2,57,509 కోట్లు ఉన్నట్లు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. వైసిపి పాలన పూర్తయ్యేనాటికి 2024 జూన్‌నాటికి ఈ అప్పు రూ.5,19,192 కోట్లకు చేరిందని మంత్రి తెలిపారు. 2024 డిసెంబరు 31కి ఈ అప్పు రూ.5,63,376 కోట్లు ఉన్నట్టు మండలి సభ్యులకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో మంత్రి వివరించడంతో వైసిపి సభ్యులు పెద్ద ఎత్తున విరుచుకుపడ్డారు. ఇప్పటి వరకు వైసిపిపై టిడిపి వారు తప్పుడు ప్రచారం చేశారని ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. అయితే ప్రభుత్వ రంగ సంస్థలు చేసిన అప్పులను కూడా మంత్రి పయ్యావుల వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు 2014 జూన్ నాటికి రూ.10,6785 కోట్ల అప్పులు అప్పగించగా 2018-19 పూర్తయ్యే నాటికి రూ.49,442 కోట్ల అప్పు ఉండగా 2024 జూన్ నాటికి 1,58,657 కోట్లకు అప్పు చేరింద న్నారు. 2024 జూన్ నాటికి ఈ అప్పు రూ.1,53,424 కోట్లకు తగ్గిందన్నారు. జూన్ 12 నుంచి డిసెంబరు 31 వరకు నికర రుణం రూ.44,184 కోట్లు రుణం తీసుకున్నట్టు మంత్రి వివరించారు. మొత్తంగా వైసిపి హయంలో రూ.4.60,916 కోట్లు, గత టిడిపి ప్రభుత్వ హయంలో రూ.1,99,100 అప్పు చేసినట్టు ఆర్థికమంత్రి మండలికి సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో వివరించారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జూన్ నుంచి డిసెంబరు వరకు రూ.44,184 కోట్లు అప్పులు తెచ్చారు. వీటిల్లో వేల కోట్ల అప్పు చేయగా రూ.41,599 కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ సొమ్మును వినియోగించామని తెలిపారు. అలాగే వైసిపి చేసిన అప్పులు ఇంకా చాలా ఉన్నాయని, వీటిల్లో రూ.80,914 కోట్లు ఉద్యోగుల (జిపిఎఫ్, జిఎల్ఐ) సొమ్ము ఇతర అవసరాలకు వినియోగించారని దుయ్యబట్టారు. ఇవి కూడా అప్పుకింద ఉన్నవేనని అన్నారు. ఇలాంటివి మరెన్నో ఉన్నందున వైసిపి హయంలో అప్పుఉ రూ.9,74,556 కోట్లు వున్నట్టు మంత్రి వివరించారు.

ధనికులతో పేదలకు చేయూత

- జీరో పావర్టీ-పి4 పై సిఎం సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదలకు సాయం అందించేందుకు ఈనెల 30న ప్రారంభించనున్న జీరో పావర్టీ-పి4 కార్యక్రమంను ప్రారంభిస్తున్నట్టు సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర విజన్ -2047 పదిసూత్రాల కార్యాచరణ అమలులో భాగంగా దీనిని చేపట్టనున్నట్లు చెప్పారు. గురువారం నాడు ఆయన ఈ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్థికంగా సంపన్న కుటుంబాల వారు అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మంది పేదలను ఆదుకోవాలని కోరారు. ఇందుకోసం కొన్ని మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్టు తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారు, దిగువస్థాయిలో ఉన్న పేద కుటుంబాలకు సహాయం, మార్గదర్శకత్వం అందించేలా మార్గాలను అన్వేషిస్తుందన్నారు. ఉగాది రోజు ప్రారంభించనున్న జీరో పావర్టీ-పి4 ప్రారంభోత్సవానికి సమగ్ర సన్నాహాలు మరియు పౌర భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రానికి కేంద్రం ప్రశంసలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతుల వివరాల నమోదు కార్యక్రమంలో తక్కువ సమయంలో 38.50 లక్షల మంది రైతులకు విశిష్ట సంఖ్యను నమోదు చేయడం పట్ల రాష్ట్రానికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పార్లమెంట్‌లో ప్రత్యేక ప్రశంసలు తెలియజేసినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఫిబ్రవరి రెండవ వారం చివరిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు చివరి స్థానంలో ఉన్న రాష్ట్రం ప్రస్తుతం 64 శాతం నమోదుతో దేశంలో మూడవ స్థానంలో నిలిచిందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

టీ షర్టులే అడ్డంకా?

'డీ లిమిటేషన్'పై తమిళ ఎంపిల నిరసన సాకుతో ఉభయ సభలు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తమిళనాడు ఎంపిలు ధరించిన టీ షర్టులను సాకుగా చూపుతూ పార్లమెంట్ ఉభయ సభలు జరిపేందుకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ నిరాకరించారు. ఆ ఎంపిలు ధరించిన టీ షర్టులపై "న్యాయమైన డీలిమిటేషన్, తమిళనాడు పోరాడుతోంది, తమిళనాడు గెలుస్తుంది" అనే నినాదం ఉంది. ఆ నినాదం ఎందుకు కోపం తెప్పించిందో, ఆ నినాదం పార్లమెంట్ నిర్వహణలో ఎక్కడ సమస్యగా మారిందో అర్థం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఆ టీషర్టులను విడిచిపెట్టి వస్తేనే సభ నిర్వహిస్తామని పేర్కొంటూ పార్లమెంట్ ఉభయ సభలను వాయిదా వేశారు.

'తమిళనాడు న్యాయమైన డీలిమిటేషన్ కోసం పోరాడుతుంది' అనే నినాదంతో కూడిన టీ-షర్టులు ధరించి డిఎంకె ఎంపిలు పార్లమెంట్‌కు హాజరయ్యారు. లోక్‌సభలో డిఎంకె ఎంపిలు టీ-షర్టులు ధరించి ఉండటం చూసిన స్పీకర్ ఓం బిర్లా 'కొంతమంది సభ్యులు సభా మర్యాదలు, నియమాలను ఉల్లంఘిస్తున్నారు. సభా సభ్యుల ప్రవర్తనకు సంబంధించి 349వ నియమం స్పష్టమైన సూచనలను కలిగి ఉంది' అని అన్నారు. 'మీరు నినాదాలు రాసిన టీ-షర్టులు ధరించి సభకు వస్తే, సభా కార్యకలాపాలు ముందుకు సాగవు. టీ-షర్టులు మార్చిన తరువాతే కార్యకలాపాలు ప్రారంభిస్తాం' అని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. వెంటనే స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సభ ప్రారంభమైనప్పుడు డిఎంకె ఎంపిలు టీ-షర్టులతోనే సభకు వచ్చారు. వెంటనే సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో కూడా డిఎంకె ఎంపిలు టీషర్టులతోనే సభకు హాజరయ్యారు. దీంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. మూడు, నాలుగు నిమిషాల్లోనే సభ నేటికి వాయిదా పడింది.


డిలిమిటేషన్‌కు వ్యతిరేకంగా టీషర్టులు ధరించి నిరసన తెలుపుతున్న డిఎంకె ఎంపిలు


రాజ్యసభలోనూ ఇదే తంతు

మరోవైపు రాజ్యసభలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. డిఎంకె ఎంపిలు టీ-షర్టుల్లో కూర్చున్నట్లు గమనించిన రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ సభా కార్యకలాపాలను నిలిపివేసి, గంటసేపు వాయిదా వేశారు. సభలోని వివిధ పార్టీల నాయకులతో చర్చించాల్సిన కొన్ని విషయాలు తనకు ఉన్నాయని అన్నారు.

డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు, తమిళనాడును అవమానించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు రాసిన దుస్తులను కూడా కొంతమంది ఎంపిలు ధరించారు. ఛైర్మన్ నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో టీ-షర్టులను తొలగించే ప్రసక్తే లేదని డిఎంకె ఎంపిలు స్పష్టం చేశారు. మధ్యాహ్నం సభ తిరిగి సమావేశమైనప్పుడు, టీ-షర్టు అంశంపై వాదనలు జరిగాయి. దీని తరువాత, డిప్యూటీ స్పీకర్ సభను శుక్రవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కనిమొళి నేతృత్వంలోని డిఎంకె ఎంపిలు పార్లమెంటు వెలుపల డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తీవ్రంగా నిరసన తెలిపారు. "తమిళనాడు న్యాయమైన డీలిమిటేషన్ కోసం పట్టుబడుతోంది. దీనివల్ల దాదాపు ఏడు రాష్ట్రాలు ప్రభావితమవుతాయి. కానీ కేంద్ర ప్రభుత్వం నుండి ఇంకా స్పందన రాలేదు. అందుకే న్యాయమైన డీలిమిటేషన్ డిమాండ్ చేస్తూ మేము మా నిరసనను కొనసాగిస్తున్నాం" అని డిఎంకె ఎంపి తిరుచ్చి శివ అన్నారు.

ప్రజల ఐక్యతే కీలకం

- సమర్థవంతంగా టెక్నాలజీని వినియోగించాలి
- అర్జెంటీనా కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ జేవియర్ బ్లాంగో



హవానా నుండి ప్రత్యేకం

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పై చేయి సాధిస్తున్న తీవ్ర మితవాద (ఆల్ట్-రైట్) విధానాలకు ప్రత్యామ్నాయంగా ప్రజల మధ్య పటిష్టమైన ఐక్యతను నిర్మించాల్సిఉందని అర్జెంటీనాకు చెందిన యూనివర్శిటీ ఆఫ్ కార్డోబ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ అన్నారు. హవానాలో క్యూబన్ ప్రెస్ డే సందర్భంగా ఆ దేశానికి చెందిన యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆఫ్ క్యూబా నిర్వహిస్తున్న (యుపిఇసి)'పాట్రియా ఇంటర్నేషనల్ కొలోక్యూమ్ 4వ ఎడిషన్ 'అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. అనంతరం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ టెక్నాలజీలో వస్తున్న మార్పులు, వాటి ప్రాధాన్యత, లాటిన్ అమెరికాలోని ప్రస్తుత పరిస్థితులను వివరించారు. సహకార రంగంలో ఇంటర్‌నెట్‌ను అభివృద్ధి చేసే అంశంపై దృష్టి సారించాలని కోరారు. వివరాలు క్లుప్తంగా

ప్ర: ప్రస్తుత పరిస్థితుల్లో టెక్నాలజీకి ఉన్న ప్రాధాన్యత ఏమిటి?

జ : ఇప్పుడు జరుగుతున్న సమావేశంలోనూ మనం అదే చర్చిస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలు , రాజకీయాలు, టెక్నాలజీల మధ్య ఉన్న సంబంధాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. నిజానికి మారుతున్న టెక్నాలజీ మన సంభాషణ సాధనాలను, తద్వారా రాజకీయాలను పునరావిష్కరిస్తోంది. అందువల్ల దీనిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేం. ఈ సమావేశంలో 50కి పైగా దేశాల ప్రతినిధులు ఈ దిశలోనే తమ అనుభవాలను పంచుకుంటున్నారు. అదే విధంగా వివిధ దేశాల ప్రజలకు వారి సొంత అవసరాలు ఉంటాయి. వాటికనుగుణంగా స్వంత, స్వతంత్ర విధానాలు కూడా అత్యవసరం.

ప్ర: లాటిన్ అమెరికాలో ప్రస్తుత పరిస్థితి ఏమిటి?

జ : లాటిన్ అమెరికా తీవ్ర మితవాద శక్తుల కారణంగా రాజకీయ అశాంతిని ఎదుర్కుంటోంది. నేను అర్జెంటీనా నుండి వచ్చాను. మా ప్రస్తుత ప్రభుత్వం నూతన సరళీకరణ ఆర్థిక విధానాలు, తీవ్ర మిత వాద భావాజాలల కలయికతో నడుస్తోంది. మా దేశంలోనే కాదు. అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఈ ప్రాంతంలోని ప్రగతిశీల ప్రభుత్వాలు కూడా ఈ మితవాద శక్తుల దాడులకు తరచు గురవుతున్నాయి. ఈ శక్తుల నుండి మన ప్రజలను రక్షించుకోవడానికి, సమస్యలకు పరిష్కారాలు ఇవ్వడానికి మనం వ్యూహాత్మకంగా పనిచేయాల్సిఉంది.

ప్ర లాటిన్ అమెరికాలో సామ్యవాద భవిష్యత్తు ఏమిటి?

జ : పరిస్థితి చాలా అనిశ్చితంగా ఉందని చెప్పవచ్చు . 2000 సంవత్సరం నుండి ఏర్పడుతున్న ప్రగతి శీల ప్రభుత్వాలు పూర్తి స్వేచ్ఛగా పనిచేయలేకపోతున్నాయి. ఆర్థిక శక్తుల నియంత్రణకు గురవుతున్నాయి. వామపక్ష విధానాలను అమలు చేయలేకపోతున్నాయి, ఈ పరిస్థితిని మార్చాలి. లేకపోతే ప్రజలు మరిన్ని బాధలు పడతారు. క్యూబా పోరాటాల్లో కనిపించినట్లు ప్రజలను ఐక్యం చేయాలి. లాటిన్ అమెరికాలోనే కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఈ పని జరగాలి. దీనికోసం అవసరమైతే కొత్త అజెండాను అన్వేషించాలి.

ప్ర : క్యూబా ఎదుర్కుంటున్న సవాళ్లు ఏమిటి?

జ : క్యూబా ఇప్పుడు తీవ్రమైన ఇంధన కొరతలను ఎదుర్కుంటుంది. విద్యుత్ లేకుండా ప్రజలు కొన్ని రోజులు ఉండాల్సివచ్చింది. అమెరికా విధిస్తున్న ఆంక్షలు ప్రజల కష్టాలను మరింతగా పెంచుతున్నాయి. ఇంటర్నెట్ ఆగిపోవడంతో ఇమెయిల్ వంటి తక్షణ సౌకర్యాలు సైతం నిలిచిపోయాయి. దీనిని దృష్టిలో ఉంచుకోవాలి. దీర్ఘకాలిక ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధి కోసం సహకార ఇంటర్నెట్ ప్రాజెక్టుల వంటి వినూత్న ప్రయోగాల వైపు దృష్టి సారించాలి.

బి. తులసీదాస్

ఆశా వర్కర్ల ప్రోత్సాహకాలు పెంచే ఉద్దేశం లేదు

- రాజ్యసభలో కేంద్ర మంత్రి జెపి నడ్డా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆశా వర్కర్లకు ప్రోత్సాహకాల అంశంపై రాజ్యసభను పదే పదే తప్పుదారి పట్టించే ఆరోగ్య మంత్రి జెపి నడ్డా చర్యలు చర్చనీయాంశమవుతున్నాయి. గురువారం రాజ్యసభలో నడ్డా సమాధానమిస్తూ ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహకాలను పెంచే ఉద్దేశం ప్రస్తుతానికి లేదని అన్నారు. వారం క్రితం నడ్డా సభలో మాట్లాడుతూ త్వరలో ప్రోత్సాహకాన్ని పెంచే విషయాన్ని పరిశీలిస్తానని చెప్పారు. దీనికి విరుద్ధంగా మంత్రి గురువారం ఒక ప్రకటన చేశారు. ఇప్పుడు ఇస్తున్నది మంచి ప్రోత్సాహకమని అన్నారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖపై చర్చలో సిపిఎం ఎంపి వి. శివదాసన్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల అంశంపై బిజెపి, కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలను బయటపెట్టారు. "కేంద్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహకంగా రూ.1,200 మాత్రమే ఇస్తోంది. ప్రోత్సాహకాలను పెంచాలని చాలా కాలంగా డిమాండ్లు ఉన్నప్పటికీ, కేంద్రం అలా చేయడానికి సిద్ధంగా లేదు. కేరళలో జరుగుతున్న ఆశా వర్కర్ల సమ్మెలో ఒక కేంద్ర మంత్రి పాల్గొని వారిని మోసం చేశారు. కేరళ ఆశా కార్యకర్తలకు అధిక గౌరవ వేతనం చెల్లిస్తుంది. కేరళలోని కాంగ్రెస్ నాయకులకు ఈ నిజం చెప్పే ధైర్యం లేదు. కొంతమంది ప్రముఖ కాంగ్రెస్ నాయకులు తమ నాయకులలో కొందరు బిజెపి కోసం పనిచేస్తున్నారని బహిరంగంగా ప్రకటించారు. కేరళ విషయంలో ఇది చాలా నిజం. వారు బిజెపికి తోకలా వ్యవహరిస్తున్నారు" అని విమర్శించారు. ఎంపి శివదాసన్‌కు ఇచ్చిన సమాధానంలో మోడీ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహకాలను అందిస్తోందని, వారిని, కుటుంబ సభ్యులను సామాజిక భద్రతా పథకాలలో చేర్చామని కేంద్రమంత్రి చెప్పుకొచ్చారు.

24న రోడ్డు రవాణా కార్మికుల చలో ఢిల్లీ

- పోస్టర్ ఆవిష్కరించిన ఆర్.లక్ష్మయ్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రోడ్డు రవాణా రంగాన్ని రక్షించాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని ఈ నెల 24న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యు) ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పేర్కొన్నారు. గురువారం నాడిక్కడ ఎపి, తెలంగాణ భవన్‌లో ఆర్.లక్ష్మయ్య పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర విధానాల వల్ల రవాణా రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. అసంఘటిత రోడ్డు రవాణా కార్మికుల సామాజిక భద్రతా చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిఎన్‌ఎస్‌లోని సెక్షన్ 106 (1), (2)లను ఉపసంహరించుకోవాలన్నారు. ఓలా, ఉబర్ వంటి ప్రైవేట్ సంస్థలకు ప్రత్యామ్నాయంగా కేంద్రప్రభుత్వం యాప్స్ రూపొందించి ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆర్‌టిసిలను బలోపేతం చేసి విస్తరింపజేయాలని, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌టిసిలకు మూలధన పెట్టుబడిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డీజిల్ ధరలు, బీమా ప్రీమియమ్‌లు, టోల్ ఛార్జీలు తగ్గించాలని, వాటిని హేతుబద్ధీకరించాలని అన్నారు. మోటార్ వెహికల్ (ఎంవి) సవరణ చట్టం-2016లో తగిన సవరణలు చేయాలని, వెహికల్ స్కానింగ్ విధానం తప్పనిసరి కాకూడదని అన్నారు. 2019లో పెంచిన పెనాల్టీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల డిమాండ్లపై రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలసినా స్పందన లేకపోవడంతో ధర్నాకు సిద్ధమయ్యాయమని చెప్పారు. రవాణా రంగ కార్మికుల సమస్యలు, డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతోందని అన్నారు. ఈ నెల 24న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చలో ఢిల్లీ ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు.

క్యూబాను ఆదుకుందాం

సిఐటియు పిలుపు

'క్యూబా' అమెరికా ఖండంలోని ఏకైక సోషలిస్టు దేశం. దేశ జనాభా 1.2 కోట్ల మంది మాత్రమే. 'ప్రపంచ పంచదార గిన్నె' అనే నానుడు ఉంది. పంచదారలో అగ్రస్థానంలో ఉన్నా ఇతర పంటలు ఏవీ ఆ దేశంలో పండవు. క్యూబా ప్రఖ్యాత టూరిస్టు దేశం. 1958లో ఫైడల్ కాస్ట్రో, చేగువేరాల నాయకత్వంలో సోషలిజం సాధించుకున్నారు. క్యూబా ప్రభావంతో వెనిజులా, బ్రెజిల్, చిలీ, ఎన్‌సాల్వడార్, అర్జంటీనాతో సహా అనేక దేశాలు అమెరికా ఖండంలోనే అమెరికా సామ్రాజ్యవాదాన్ని సవాల్ చేస్తున్నాయి. అందుకే అమెరికాకు క్యూబాపై కడుపుమంట.

ప్రపంచ కార్మికవర్గానికి క్యూబా స్ఫూర్తిదాయకం. ప్రజలందరికీ విద్యను సమానంగా అందిస్తున్నది. జనాభా నిష్పత్తితో పోల్చితే అమెరికా కంటే కూడా ఎక్కువ మంది డాక్టర్లు ఉన్న దేశం క్యూబా. వైద్యం కోసం అత్యధికంగా బడ్జెట్ కేటాయిస్తున్నది. విద్య, వైద్యం పూర్తిగా ప్రజల హక్కు. నేటికీ ఒక్క శాతం కూడా ప్రైవేట్ రంగం క్యూబాలో అడుగు పెట్టలేకపోయింది. సోషలిస్టు విధానాలను సంపూర్ణంగా అమలు చేస్తున్నది. అమెరికా ఖండంలో ఉన్నా అమెరికా 'గన్ కల్చర్' క్యూబాలో దరిదాపులో లేదు. పైగా ప్రజలు ఉన్నత విలువలతో అత్యంత మర్యాదపూర్వకంగా జీవిస్తున్నారు. అందుకే అమెరికాకు క్యూబాపై ఈర్ష్య.

1960లో ఆనాటి అమెరికా అధ్యక్షుడు కెనడీ '90 మైళ్ల దూరంలో ఉన్నావ్' అని క్యూబాను హెచ్చరించాడు. 'అమెరికా కూడా మాకు 90 మైళ్ల దూరంలోనే ఉంది' అని ధీటుగా కాస్ట్రో సమాధానమిచ్చారు. ఆనాటి నుంచి క్యూబాపై నేరుగా దాడి చేసే ధైర్యం అమెరికాకు లేదు. అందుకే ప్రపంచంలో ఏ దేశం నుంచి సరుకులు వెళ్లకుండా క్యూబాను ఉగ్రవాద దేశంగా ముద్ర వేసి పూర్తిగా ఆంక్షలు విధిస్తున్నది. 1991 వరకూ రష్యా వస్తు మార్పిడి పద్ధతిలో పంచదారకు బదులు ఇతర సరుకులు అందించేది. 1991 తర్వాత అమెరికా ఆంక్షల వల్ల పసి బిడ్డలకు పాల పొడి, ఆహారం, ప్రాణావసర మందులు కూడా క్యూబాకు అందనివ్వడంలేదు. విద్యుత్ జనరేటర్లు కూడా లేకపోవడంతో అనేక ప్రాంతాలు అంధకారమయ్యాయి. పరిశ్రమలు నడవడం లేదు.

క్యూబా ప్రజలు పస్తులుంటున్నా 'మా ప్రాణాలైనా ఇస్తాం. సోషలిజాన్ని వదలం" అనే విధంగా క్యూబా ప్రజలు అమెరికన్ సామ్రాజ్యవాదంపై పోరాడుతున్నారు. సామ్రాజ్యవాదం ఎంత క్రూరంగా ఉంటుందో క్యూబాయే ఉదాహరణ. దీనికి పూర్తి భిన్నంగా 'మానవత్వం' అంటే ఏమిటో ప్రపంచమంతా అన్ని ఆపదల్లోను, ముఖ్యంగా కోవిడ్ కాలంలో చాటిన దేశం క్యూబా. 52 దేశాలకు కోవిడ్ కాలంలో ప్రత్యక్షంగా మందులు, వైద్యంగా క్యూబా సహాయ పడింది. బ్రిటన్ దేశపు షిప్‌ను కోవిడ్ ఉందనే కారణంతో బ్రిటన్‌లోని ఏ పోర్టులోనికి అనుమతించలేదు. క్యూబా తమ దేశానికి ఆ షిప్‌ను (హవానా) ఆహ్వానించి వారికి వైద్యం చేసి వారి దేశం తిరిగి పంపింది. అదీ మానవత్వం అంటే.

సోషలిస్టు క్యూబా ప్రజలను ఆదుకోవడం నేడు ప్రపంచ కార్మికవర్గ కర్తవ్యం. ఢిల్లీలో ఏర్పడిన క్యూబా సంఘీభావ కమిటీ సంఘీభావ నిధికి పిలుపునిచ్చింది. దీనికి స్పందనగా సిఐటియు ఆంధ్రప్రదేశ్ కమిటీ కూపన్ల ద్వారా రూ. 50, రూ. 100, రూ. 200 చెల్లించాలని కోరుతున్నాం.

- సి.హెచ్.నరసింగరావు,
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

జెసిబి యంత్రాలతో నేలమట్టం

(మొదటి పేజీ తరువాయి)

ధర్నాలకు పిలుపునిచ్చారు. పంజాబ్, ఇతర రాష్ట్రాల్లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల వెలుపల ధర్నాలు చేపట్టాలని రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. హర్యానా సిఎం నయాబ్‌సింగ్ సైని కర్నాల్ నివాసం వెలుపల, ఫిరోజ్‌పూర్‌లో డిసి కార్యాలయం వెలుపల రైతులు నిరసన తెలిపారు. రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వమే పరిష్కరించగలదని ఆప్ నేత సందీప్ పాథక్ వ్యాఖ్యానించారు.

పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ నిరసన

పోలీసుల అణచివేత చర్యలపై పార్లమెంట్ ఆవరణలో పంజాబ్ కాంగ్రెస్ ఎంపీలు నిరసన తెలిపారు. వారిని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కలిసి మాట్లాడారు. రైతు వ్యతిరేక పార్టీలు బిజెపి, ఆప్ చేతులు కలిపాయంటూ కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ వెన్నుపోటు చర్యలకు పంజాబ్ ప్రజలు ప్రతీకారం తీర్చుకుంటారని కాంగ్రెస్ నేత సుప్రియ శ్రినెట్ హెచ్చరించారు.

శాసనసభలో ఏకపక్షం.. మండలిలో ప్రతిఘటన

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో విజయం సాధించారు. వెలుపల పలు తరగతుల ఆందోళనలను సభలో ప్రస్తావించారు. ఎన్నికల హామీల అమలుపై నిలదీశారు. బడ్జెట్ పద్దులపై అర్థవంతంగా చర్చించారు. కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావుకు వీడ్కోలు పలుకుతూ వారి కృషిని సభలో పలువురు శ్లాఘించారు. మండలి రెండు వారాలపాటు సమావేశమైనా ముఖ్యమంత్రి చంద్రబాబు అటువైపు కన్నెత్తి చూడలేదు. చాలా సంవత్సరాల తర్వాత ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆట విడుపు.

దండకారణ్యం రక్తసిక్తం

(మొదటి పేజీ తరువాయి)

భద్రతాదళాలు సిద్ధం చేసుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. బిజెపి నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో మూడు నెలల వ్యవధిలో భద్రతా దళాలు 77 మంది మావోయిస్టులను అంతమొందించాయి.

వచ్చే ఏడాది మార్చికి మావోయిస్టులు అంతం : అమిత్‌షా ప్రకటన

వచ్చే ఏడాది మార్చి 31 లోపు నక్సల్ ఉగ్రవాదం అంతమవుతుందని, సైనికులు మరో పెద్ద విజయాన్ని సాధించారని అమిత్‌షా ఎక్స్‌లో రాసుకొచ్చారు. మోడీ ప్రభుత్వం మావోయిస్టులపై క్రూరమైన వైఖరితో ముందుకు సాగుతోంది. లొంగిపోయిన వారికి అండగా నిలుస్తామని, లొంగని వారిని వదిలే ప్రసక్తేలేదంటూ కేంద్రం సంకేతాలిస్తోంది.

అటవీ సంపద దోచుకునేందుకే?

మావోయిస్టులను కట్టడి చేసినట్టయితే... కీలకమైన అటవీ సంపదను దోచుకోవచ్చని కేంద్రం ప్లాన్ చేస్తున్నదని పర్యావరణ వేత్తలు, గిరిజన సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం పర్యావరణానికి విఘాతం కలిగేలా పలు చట్టాలకు తూట్లు పొడుస్తోంది. కార్పొరేట్లకు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్న మోడీ సర్కార్ మావోయిస్టుల ఏరివేతను ముమ్మరం చేసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గాజాపై భూతల దాడులు

(మొదటి పేజీ తరువాయి)

స్తంభించిపోయాయి. కాల్పుల విరమణ మూడు దశలను అమలు చేయడానికి మరింతగా కృషి జరగాల్సి వుందని ఖతార్, ఈజిప్ట్ పేర్కొన్నాయి.

హమాస్, హౌతి ప్రతిదాడులు

ఇజ్రాయిల్ హత్యాకాండను నిరసిస్తూ టెల్ అవీవ్‌పై రాకెట్లను ప్రయోగించినట్లు హమాస్ సాయుధ విభాగం, ఎజ్జెడైన్ అల్ కస్సం బ్రిగేడ్ గురువారం ప్రకటించాయి. గురువారం తెల్లవారు జామున యెమెన్ క్షిపణి దాడి జరపడంతో ఇజ్రాయిల్‌లో పలుచోట్ల సైరన్లు మోగాయి. ఆ వెంటనే జెరూసలేంలో అనేక చోట్ల పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయిల్ తూట్లుపొడిచిన నేపథ్యంలో క్షిపణి దాడులను పునరుద్ధరిస్తున్నామని ఈ వారంలో యెమెన్ హౌతి గ్రూపు ప్రకటించింది.

అదాని పోర్టు కాలుష్యం నుంచి రక్షణ కల్పించండి

- అనకాపల్లి వాసుల మొర
- కొనసాగుతున్న ప్రజా చైతన్య యాత్రలు

ప్రజాశక్తి-యంత్రాంగం

'అదాని గంగవరం పోర్టు కాలుష్యం నుంచి తమకు రక్షణ కల్పించాలి, ఆనందపురంలో భీమిలి, దొరతోట రోడ్డు విస్తరణను 200 అడుగుల నుంచి వంద అడుగులకు తగ్గించాలి, తాగునీరు, డ్రెయినేజీ, విద్యుత్ ఛార్జీలు, తదితర సమస్యలను పరిష్కరించాలి' అంటూ సిపిఎం నాయకుల వద్ద స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు గురువారం పలుచోట్ల సాగాయి. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం చిన్న కలవలపల్లి, కొత్తపేట, జెడ్ చింతవ గ్రామాల్లో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పాల్గొన్నారు.


అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

చిన్న కలవలపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుండి కొండపోరంబోకు భూముల్లో జీడి మామిడి, కొబ్బరి, యూకలిప్టస్ వంటి తోటలు సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు వంటి జీవాలను పెంచుకొని బతికే వాళ్ళమని, తాటి, ఈత చెట్లకు కల్లు గీస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, కొండల చుట్టూ నేవీ అధికారులు ప్రహరీ నిర్మించడంతో తమ జీవనాధారం పూర్తిగా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ.. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, సంబంధిత ఫారెస్ట్ అధికారులు స్పందించి చిన్న కలవలపల్లి గ్రామస్తులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే నేవీ ప్రభావిత రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అల్లూరి జిల్లాలోని కొయ్యూరు మండలం చింతలపూడి, గింజర్తి, లుబుర్తి మాకవరం గ్రామాల్లో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స జీడి మామిడి రైతులతో మాట్లాడారు. జీడీ మామిడి, కొండ పోడు పట్టాలు వంటి సమస్యలను రైతులు అప్పలనర్స వద్ద ప్రస్తావించారు. ముచంగిపుట్టు మండలంలోని జరెల పంచాయతీ బొడ్డగొంది, మంచంరాయి, మండిభ గ్రామాల్లో సిపిఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విశాఖ జిల్లా గాజువాక, మధురవాడ, ఆనందపురం ప్రాంతాల్లో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. గాజువాక భానోజీతోట, వాంబేకాలనీల్లో సిపిఎం జిల్లా కార్యదిర్శ ఎం.జగ్గునాయుడు బృందానికి స్థానికులు అదానీ గంగవరం పోర్టు కాలుష్యం నుంచి రక్షణ కల్పించాలని తమ సమస్యలను విన్నవించారు. ఆనందపురంలో భీమిలి, దొరతోట రోడ్డు విస్తరణను 200 అడుగుల నుంచి వంద అడుగులకు తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కొన్ని సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని, ఇందుకు అందరూ కలిసి రావాలని నాయకులు కోరారు. కర్నూలు నగరంలోని 9, 10, 11, 35వ వార్డులో సిపిఎం నాయకులు పర్యటించారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు, బండి ఆత్మకూరులోనూ నాయకులు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రానికి శాశ్వత నష్టం

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం నిధుల కేటాయింపు, వెనుకబడిన జిల్లాలకు నిధులు వంటి అంశాల్లో ఎక్కడా రాష్ట్రానికి న్యాయం చేయలేదని చెప్పారు. . 2017 నాటి అంచనాల ప్రకారం పోలవరం ప్రాజెక్టుకు రూ.57,297 కోట్లు పైబడి ఖర్చు అవుతుందని, కానీ కేంద్రం విద్యుత్ పార్టును మినహాయించి రూ.55,548 కోట్లకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. 11 సంవత్సరాల్లో ఎపి పెట్టిన ఖర్చు తీసేస్తే రూ.19,500 కోట్లు మాత్రమే కేంద్రం ఇచ్చిందని వివరించారు. 2025 ఎస్-ఎస్‌ఆర్ రేట్ల ప్రకారం మిగిలిన పనుల ఖర్చు రూ.50 వేల కోట్లు ఉంటుందని వివరించారు. దీనిలోనూ ఎక్కువ భాగం పునరావాసం కోసం అవుతుందని తెలిపారు. 2023లో రూ.12,500 కోట్లతోపాటు మరికొంత మాత్రమే ఇస్తామని చెప్పిందని, దానికి రాష్ట్రం ఒప్పుకోలేదని వార్తలూ వచ్చాయని చెప్పారు. 135 అడుగుల ఎత్తు కాంటూర్‌కే పునరావాస ప్యాకేజీ ఇస్తే కొండలపైనున్న వారికి రవాణా సదుపాయం లేకుండా పోతుందని, నాగరిక సమాజంలో ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదించిన రూ.8000 కోట్లుగాక ఇంకా రూ.35 వేల కోట్ల నుండి రూ.40 వేల కోట్ల వరకూ ఖర్చవుతుందని తెలిపారు. బడ్జెట్లో పేర్కొన్న విధంగా పరిమితం చేస్తే ప్రపంచంలో బహుళార్థక సాధక ప్రాజెక్టుల్లో డెడ్ స్టోరేజీ లేదా అంతకంటే తక్కువకు పరిమితం చేసిన ప్రాజెక్టు ఇదొక్కటే అవుతుందని పేర్కొన్నారు. రైల్వే బడ్జెట్ విషయంలోనూ మోసం జరిగిందని పేర్కొన్నారు. సిపిఎం మాజీ ఎంపి పి.మధు మాట్లాడుతూ పోలవరం పునరావాసం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజలను మోసం చేస్తున్నాయని తెలిపారు. అమరావతికి నిధుల కేటాయింపు విషయంలోనూ అదే నాటకం ఆడుతున్నాయని వివరించారు. విదేశీ బ్యాంకుల నుండి రుణాలు తెచ్చుకోవాలంటే కేంద్రం సంతకం చేస్తుందని, దానికే తాము నిధులు ఇచ్చినట్లు చెప్పి రాష్ట్రంలో బిజెపి నాయకులు, కేంద్ర మంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రజలను మోసం చేశారని అన్నారు. వారిచ్చిన షరతులు అమోదిస్తేనే నిధులు విడుదల చేస్తామని రాష్ట్రం ఒప్పుకుందని, ఇది రాష్ట్ర ప్రజలకు తలవంపులు తప్ప మరొకటి కాదని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ 150 అడుగుల ఎత్తు కట్టాల్సిన పోలవరం ప్రాజెక్టును 135 అడుగులకు తగ్గిస్తే తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాలకు, రాయలసీమ జిల్లాలకు ఇవ్వాల్సిన ప్యాకేజీని పక్కనబెట్టేశారని అన్నారు. విభజన చట్టం ప్రకారం రాయలసీమ ఉత్తరాంధ్రకు కెబికె, బుందేల్‌ఖండ్ తరహాలో దాదాపు పదిన్నర సంతవ్సరాల క్రితమే రూ.24,350 కోట్లు నిధులు రావాల్సి ఉందని తెలిపారు. గతంలో ప్రతి జిల్లాకు రూ.50 కోట్లు నిధులు విదిల్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. విశాఖపట్నం స్టీలు ప్లాంటును కూడా అమ్మేసే కుట్ర సాగుతోందని అన్నారు. ఈ అంశాలకు సంబంధించి రాష్ట్ర ఎంపిలకు, అలాగే రాజ్యసభ సభ్యుడిగా ఉన్న పరిమళ్ నత్వానికి కూడా లేఖ రాసినట్లు తెలిపారు. ఎంపిలకు పంపిన లేఖలో చలసాని శ్రీనివాస్, వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, వి.వి.లక్ష్మీ నారాయణతోపాటు, పలువురు ప్రతినిధులు సంతకాలు చేశారు. విలేకరుల సమావేశంలో సాధన సమితి కార్యదర్శి టి.నరసింహారావు కూడా పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో సిఐఐ కృషి

- భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి గంగాధర్
- సిఐఐ ఎపి నూతన్ చైర్మన్‌గా మురళీకృష్ణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

స్టేట్ కౌన్సిల్ ఆఫ్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సభ్యులు, ప్రతినిధులు, బ్రిక్స్, జి7, జి20 వంటి బహుళ మార్గాలతో భాగస్వామ్యం ద్వారా భారత దేశాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించేందుకు కృషి చేస్తున్నారని భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్థిక దౌత్య సంయుక్త కార్యదర్శి పిఎస్.గంగాధర్ తెలిపారు. సిఐఐ 2024-25 వార్షిక సమావేశం గురువారం విశాఖలోని నోవాటెల్ హోటల్ వేదికగా నిర్వహించారు. ఈ సమావేశాన్ని పురస్కరించుకొని 'స్వర్ణ ఆంధ్రప్రదేశ్ - విజన్ 2047'పై ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన గంగాధర్ మాట్లాడుతూ.. తూర్పు కారిడార్‌లో వాణిజ్యాన్ని పెంపొందించడంలో రాష్ట్రానికి ఉన్న వ్యూహాత్మక ప్రయోజనాన్ని వివరించారు. ఇంధన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల మధ్యవర్తిత్వం వంటి రంగాల్లో పారిశ్రామికవేత్తలు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర విజన్ అభివృద్ధికి సిఐఐ, పారిశ్రామిక భాగస్వాముల సహకార ప్రయత్నాలను అభినందించారు. సిఐఐ ఇండియా కౌన్సిల్ చైర్మన్ రాజన్ నవానీ మాట్లాడుతూ.. యువత శక్తి, నూతన ఆవిష్కరణలు, వివిధ రంగాల్లో పురోగతికి దారితీస్తున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు వంటి వాటిపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్, తూర్పు నౌకాదళ కమాండ్ రియర్ అడ్మిరల్ ఆర్‌ఎస్ ధలివాల్, సిఐఐ ఎపి మాజీ చైర్మన్ సురేష్‌రాయుడు చిట్టూరి, మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిఐఐ వార్షిక సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కమిటీ ఎన్నిక

అనంతరం 2025-26 సంవత్సరానికి కొత్త ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. ఫ్లూయెంట్‌గ్రిడ్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ సిఇఒ మురళీకృష్ణ గన్నమణిని చైర్మన్‌గా, అపెక్స్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.నరేంద్రకుమార్ వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.మురళీకృష్ణ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

చిట్టెలుక



ఎలుకమ్మ ఎలుకా
నల్లానల్లని ఎలుకా
మూలన నక్కిన ఎలుకా
నంగనాచి ఎలుకా

పుస్తకాలు కొరికింది
అమ్మ చీర కొరికింది
బామ్మ దుప్పటి కొరికింది
తాత వేలు కొరికింది

నాన్న ఉనికి పసిగట్టింది
బిరబిరా ఉరికింది
కలుగులో దూరింది
కనబడకుండా పోయింది


గండుబిల్లి వచ్చింది
కలుగు చుట్టూ తిరిగింది
ఎలుక పిల్లిని చూసింది
గజగజా వణికింది

చుప్పనాతి చిట్టెలుక
చిరాకు తెచ్చే చిట్టెలుక
బోనులో చిక్కిన చిట్టెలుక
బతుకు భయంతో చిట్టెలుక


- కాసర లక్ష్మీ సరోజా రెడ్డి, జంగారెడ్డిగూడెం.

దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న పిల్లి, తన ఆహారం దగ్గరకు చేరుకునేలా దారి చూపండి.




నేను గీసిన బొమ్మ





కె. రిత్విక్,
6వ తరగతి,
యుపిఎస్ వెంకటాపూర్,
నిజాంపేట మండలం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



JEEVANA జీవన the family

విశ్వం, భూమి, నక్షత్రాలు, సూర్యుడు, చంద్రుడు, గ్రహాల చుట్టూ ఉన్న అపోహలను అంతరిక్ష విజ్ఞాన శాస్త్రం పటాపంచలు చేయడం ప్రారంభించి చాలా కాలమైంది. సునీతా విలియమ్స్, విల్‌మోర్ అంతరిక్ష ప్రయాణం ముగించుకుని భూమికి చేరిన వేళ, ఈ చర్చ మరోసారి జరుగుతోంది. ఈ వ్యోమగాముల ప్రయాణం, ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించిన తీరు ప్రతిదీ అద్భుతం. సునీతా విలియమ్స్ తొలుత ఏదో కావాలని అనుకొంది. కానీ, తన ముందుకొచ్చిన అవకాశాన్ని శ్రద్ధ, సాధన, అంకితభావంతో అందిపుచ్చుకొని, అంతరిక్షంలో విజయపతాక ఎగురవేసింది. ఆమె విజ్ఞానయాత్ర నేటి తరానికి ఆదర్శప్రాయం.


అందివచ్చిన అవకాశంతో ఆకాశయానం!

సునీతా విలియమ్స్.. చరిత్రలో నిలిచిపోయే సాహసాలకు చిరునామా. బాల్యంలో అందరి పిల్లల్లాగే తనకి కల్పిత కథలంటే చాలా ఇష్టం. పెద్దయ్యాక ఆస్ట్రోనాట్ (వ్యోమగామి) అవుదామని ఎప్పుడూ అనుకోలేదు. కుక్కపిల్లలతో ఆడుకుంటూ పెరిగింది. పాండ్యాలతో కలసి అల్లరి చేసేది. ప్రకృతిపై ప్రేమ పెంచుకుంది. మెరైన్ బయోలజీలో ప్రయోగాలు చేసింది. చంద్రుడిపై మానవుడు కాలుపెట్టిన ఘటనని టీవీల్లో చూసి సంతోషంతో గంతులు వేసిన బాల్యం ఆమెది. పిల్లలందరూ ఇలానే ఉంటారు. వెటర్నరీ డాక్టరుగా స్థిరపడాలనుకున్న సునీత అంతరిక్ష ప్రయోగాల వైపు ప్రయాణించి, ఎన్నో విజయాలు సాధించారు.

సునీత తండ్రి దీపక్ పాండ్యా, గుజరాత్ నుంచి అమెరికాకి వలసవెళ్లారు. సునీత అక్కడే పుట్టింది. సునీత బాల్యం గురించి తండ్రి దీపక్ ఒకసారి ఏం చెప్పారంటే.. 'తనకి గాల్లో ఎగరడం కంటే నీళ్లల్లో ఈదడం చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే స్విమ్మింగ్ నేర్చుకోవాలని అకాడెమీలో కూడా చేరింది. యుఎస్ నావీ అకాడెమీలో 1983లో చేరిన సునీత బైక్ రేసింగ్‌లో కూడా రాణించింది. స్విమ్మింగ్, రేసింగ్, ఫ్లైయింగ్ ఒకదానిని మించి మరొకదానిలో విశేష ప్రతిభ ఆమె సొంతం. 1990లో గల్ఫ్ వార్ సమయంలో కార్గో షిప్‌లో రవాణా సరుకులు సరఫరా చేసింది.

ప్రతిదీ రెండో అవకాశమే!

సునీతా సాగించిన ఈ ప్రయాణంలో ప్రతిదీ ఆమె ఫస్ట్ చాయిస్ కాదు.. మొదటి అవకాశం అందక, రెండోదానికి షిఫ్ట్ అయి, అందులోనే విజయాలు సాధించింది. అథ్లెటిక్‌గా రాణించాలనుకుంది. నేవీలో చేరింది. డైవింగ్‌పై ఆసక్తి ఉంది. ఏవియేటర్ అయ్యింది. జెట్ విమానాలు నడపాలని కలలుగంది హెలికాప్టర్లు నడపాల్సి వచ్చింది. ఈ ప్రయాణంలో అంతరిక్ష ప్రయోగాలు ఆమె ఎప్పుడూ ఊహించలేదు. ఎప్పుడైతే జాన్సన్ స్పేస్ సెంటర్‌ని సందర్శించిందో అప్పటి నుండే ఆమె గమ్యం మారిపోయింది. 11 ఏళ్లు యుఎస్ నేవీలో విధులు నిర్వహించిన సునీత పలుమార్లు నాసా ఆస్ట్రోనాట్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకుంది. 1998లో 18వ బ్యాచ్‌కి ఆమెకి అవకాశం వచ్చింది. ఆ తరువాత సునీత ప్రయాణం గురించి అందరికీ తెలిసిందే. గతేడాది జూన్‌లో అంతరిక్షానికి బయలుదేరిన సునీత 9 నెలల సుదీర్ఘ విరామం తరువాత బుధవారం తెల్లవారుజామున భూమి మీదకి చేరుకున్నారు. అయితే 9 రోజుల్లో తిరిగి రావాల్సిన వారు 9 నెలలు అక్కడే ఉండాల్సి వచ్చింది.



వీళ్లు కూడా ఉన్నారు..

సునీత, విల్‌మోర్ కంటే ముందే అమెరికన్ వ్యోమగామి ఫ్రాంక్ రూబియో 2022 నుంచి 2023 వరకు దాదాపు 371 రోజులు అంతరిక్షంలో గడిపాడు. నాసాకి చెందిన విలియం ఎం. షెపర్డ్, రష్యాకి చెందిన యూరి పి. గిడ్జెంకో,సెర్గీ కె. క్రికాలెవ్ 2000 నవంబరు 2న నాలుగు నెలల మిషన్ కోసం 'ఐఎస్ఎస్' (అంతరిక్ష నౌక) ఎక్కిన మొదటి వ్యోమగాములు. అప్పటి నుంచి అంతరిక్షానికి తరచూ మానవుల ప్రయాణం కొనసాగుతూనే ఉంది.

ఐఎస్ఎస్ అంటే ఏంటి?

ఐఎస్ఎస్ అనేది ఒక అంతరిక్ష పరిశోధనా కేంద్రం. అంతరిక్షంలో వివిధ గ్రహాలను పరిశీలించటానికి, అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయటానికి ఇది ఒక ప్రయోగశాల. అంతరిక్షంలో జీవించటం, పండించటం వంటివి ఎలా సాధ్యం అన్న పరిశీలనలు, పరిశోధనలు అక్కడ జరుగుతాయి. జీవ, రసాయన, సాంకేతికత సంబంధిత అంశాలపై వ్యోమగాములు ప్రయోగాలు చేస్తారు. అంతరిక్షంలో ప్రకాశిస్తూ కనిపించే ఈ అంతరిక్ష నౌకని భూమిపై నుంచి కూడా మనం కంటితో చూడవచ్చు.

యునైటెడ్ స్టేట్స్, రష్యా, జపాన్ వంటి 15 దేశాలు నిర్మించి నిర్వహిస్తున్న ఈ అంతరిక్ష నౌక 1998 నుంచి తన కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ జాబితాలో మన దేశం లేదు. ఇది భూమి నుంచి 240 మైళ్ల ఎత్తులో ఉంది. ప్రతి 24 గంటలకు భూమి చుట్టూ 16 భ్రమణాలను పూర్తి చేస్తుంది. అందువల్ల ఇక్కడ ఒక్క రోజులో 16 సూర్యోదయాలు, 16 సూర్యాస్తమయాలు చూడొచ్చు.

ఏమేం ఉంటాయంటే ...

ఈ కేంద్రంలో ఆరు బెడ్ రూమ్స్, రెండు బాత్రూమ్‌లు, ఒక జిమ్, 360 డిగ్రీల వ్యూలో పెద్ద కిటికీ ఉంటుంది. భూమి మీద ఉండే గురుత్వాకర్షణ శక్తి ఇక్కడ ఉండదు. అందుకే ఈ నౌకలో వ్యోమగాములు గాల్లో తేలుతూనే తినడం, నిద్రపోవడం, స్నానం చేయడం, కాలకృత్యాలు తీర్చుకోవడం వంటి పనులన్నీ చేసుకోవాలి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు స్లీపింగ్ బ్యాగుల్లోకి వెళ్లి నిద్రపోతారు. చుట్టూ పరికరాలు చేసే శబ్దం వినిపించకుండా ఇయర్‌ప్లగ్‌లు ఉపయోగిస్తారు.

నీటి చుక్క చిందకుండా..

ఈ అంతరిక్ష కేంద్రంలో ఆహార పదార్థాలను నిల్వ చేసుకోవడం చాలా ముఖ్యం. ఉప్పు, మిరియాలు వంటివి కూడా ద్రవరూపంలోనే తీసుకెళతారు. ఏ చిన్న నీటిచుక్క బయటికి చిందినా అది కూడా తేలుతూనే ఉంటుంది. ఆ నీటిబిందువు తేలుతూ తేలుతూ ఏదేని పరికరంలోనికి చొచ్చుకునిపోతే సాంకేతిక సమస్య రావచ్చు. స్నానం, ముఖం కడుక్కోవడం వంటి నీళ్లతో అవసరమైన ప్రతి పనినీ తడి టవళ్లతో కానిచ్చేస్తారు. ఆఖరికి జుట్టు కడుక్కోవడానికి కూడా షాంపూ పూసి, ఆపై తడి టవల్‌తో శుభ్రం చేసుకుంటారు. ఈ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు తమకు కావాల్సిన ఆహార పదార్థాలను పండించుకోవొచ్చు. తాజా, పోషకమైన ఆహారం తక్కువ ఉత్పత్తిలో ఇక్కడ పండించుకోవచ్చని నాసా 2015లో చెప్పింది. సునీతా, విల్‌మోర్ కూడా తాము పండించుకున్న ఆహార ఉత్పత్తులను ఫొటోలు తీసి పంపారు.

జిమ్ ఎందుకంటే ...

మానవ శరీరం గురుత్వాకర్షణ శక్తికి లోబడి భూమి మీద జీవించడానికి వీలుగా ఉంటుంది. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి లేదు కాబట్టి, అక్కడ ఎముకలపై పెద్దగా భారం పడదు. దీంతో తిరిగి భూమి మీదకి వచ్చినప్పుడు ఎముకల పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. ఈ సమస్య తీవ్రమవ్వకుండా ఉండేందుకు వ్యోమగాములు ఎప్పటికప్పుడు తమ శరీరాన్ని భార రహితం నుంచి భారహితంగా చేసుకుంటారు. అందులో భాగంగానే ట్రెడ్‌మిల్‌పై నడవడం, జాగింగ్, రన్నింగ్ వంటివి ప్రాక్టీస్ చేస్తుంటారు. అందులో అక్కడ జిమ్ ఉంటుంది. అంతరిక్షంలోని ప్రవేశించిన కొన్ని రోజుల వరకు వ్యోమగాములు అక్కడి వాతావరణం సరిపడదు. అనారోగ్యానికి గురవుతారు. కొంతకాలం తరువాత అలవాటు పడినా, శరీర ద్రవాలు పైభాగంలో పేరుకుపోతాయి. దీనివల్ల వ్యోమగాములు ముఖాలు ఉబ్బినట్లు, ఎర్రగా మారతాయి. అక్కడికి వెళ్లిన ప్రతి వ్యోమగామికి ఒక నిర్దిష్ట పని కేటాయిస్తారు. ప్రత్యేక వైద్య వ్యోమగామి అందుబాటులో ఉంటారు. ఆహార పదార్థాలను ఆరు నెలలకు ఒకసారి కార్గో షిప్ ద్వారా అంతరిక్షంలోకి పంపుతారు.

ఈ అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగాములు భూమ్మీద ఉన్నప్పుడు చేసే చాలా పనులు చేస్తారు. కుటుంబ సభ్యులతో, సన్నిహితులతో రోజూ మాట్లాడతారు. దీనికి ప్రత్యేకమైన సమాచార వ్యవస్థ ఉంటుంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. విద్యార్థులతో మమేకమవుతారు. సునీత అమెరికా ఎన్నికల్లో తన ఓటు హక్కును అక్కడినుంచే వినియోగించుకున్నట్లు వార్తలు వచ్చాయి.



పర్వత శిఖరాలను కాపాడుకోవాలి : రాజమౌళి

'ఒడిశాలోని అత్యంత ఎత్తైన, అద్భుతమైన పర్వత శిఖరం డియోమాలికి ట్రెక్కింగ్ చేశాం. అదో మధురమైన జ్ఞాపకం. పై నుంచి చూస్తే అత్యంత ఉల్లాసభరితంగా అనిపించింది. ఆ పర్వతంపై పర్యాటకులు చెత్తా చెదారం వేయటం నాకు ఒకింత నిరుత్సాహానికి గురిచేసింది. ఇలాంటి అద్భుతమైన ప్రాంతాలను ఎంతో బాగా చూసుకోవాలి. ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకుంటే చాలా పెద్దమార్పు వస్తుంది. ప్రతి సందర్శకుడు ఇలాంటి ఆహ్లాదకరమైన స్థలాలను రక్షించటంలో సహాయపడటానికి మీ వ్యర్థాలను తిరిగే మీరే తీసుకెళ్లాలనేది నా సూచన' అని ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. మహేష్‌బాబు ఎస్ఎస్ఎంబి 29 సినిమా షూటింగ్ కోరాపుట్ పర్వత ప్రాంతాల్లో పూర్తయిన తర్వాత చిత్ర యూనిట్ సమీప పర్యాటక ప్రాంతాలను సందర్శించింది. ఈ మూవీ షూటింగ్ లొకేషన్‌కు సంబంధించిన ఓ వీడియోను సోషల్ మీడియాలో రాజమౌళి షేర్ చేశారు.



దిల్ రాజు 'తెల్ల కాగితం'!

'కోర్టు' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న హర్ష్ రోషన్ ప్రధాన పాత్రలో సీనియర్ నటుడు శివాజీ కీలక పాత్రలో దిల్ రాజు ఓ సినిమా చేయనున్నారని సమాచారం. ఈ చిత్రానికి కొత్త దర్శకుడు రమేష్ రూపకల్పన చేస్తున్నారు. ఈ సినిమాకి 'తెల్ల కాగితం' అనే పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో రోషన్ ఎలాంటి పాత్రలో కనిపిస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.



'చాలా సంతోషంగా ఉంది'

యుకె పార్లమెంట్‌లో తనకు జరిగిన సన్మానంపై చిరంజీవి ట్వీట్ చేశారు. 'చాలా మంది గౌరవనీయులైన పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, సెక్రటరీలు, దౌత్యవేత్తలు సమక్షంలో అందుకున్న గౌరవంతో నా మనసు నిండిపోయింద'ని పోస్ట్ చేశారు. 'నాకు దక్కిన ఈ గౌరవం గురించి చెప్పాలంటే మాటలు చాలవు. నాపై అద్భుతమైన ప్రేమగల అభిమానులకు, నా సోదర, సోదరి మణులకు, నా కుటుంబం, శ్రేయోభి లాషులు, స్నేహితులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. నాకు అన్ని విధాలుగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ గౌరవం నన్ను మరింత కష్టపడేందుకు ప్రేరేపిస్తుంది. నాకు మరింత శక్తిని అందిస్తోంది' అంటూ చిరంజీవి పోస్ట్ చేశారు.

'టుక్ టుక్' అలరిస్తుంది




ఫాంటసీ, మ్యాజికల్ అంశాలతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం 'టుక్ టుక్'. హర్ష్ రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి సి.సుప్రీత్ కృష్ణ దర్శకుడు. మార్చి 21న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రాహుల్ రెడ్డి చిత్ర సంగతులు ముచ్చటించారు. 'నాకు సినిమాలపైన ఆసక్తితో ఈ ఫాంటసీ థ్రిల్లర్ మొదలుపెట్టాను. కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారు అనేది నా నమ్మకం. సినిమాలో టుక్ టుక్ ఆటో కీలక పాత్ర పోషించింది. అందుకే ఆ టైటిల్ పెట్టాం. 'కోర్టు' సినిమా హిట్ అవ్వడం మా సినిమాకు మంచి శుభారంభం. ఈ సినిమాతో కూడా రోషన్‌కు కూడా మంచి పేరు వచ్చింది.' అని అన్నారు.

'రాపో 22' సెకండ్ షెడ్యూల్ పూర్తి



రామ్ పోతినేని కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న చిత్రం 'రాపో 22 (వర్కింగ్ టైటిల్)'. మహేష్‌బాబు పి.దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. రాజమండ్రిలో ఏకధాటిగా 34 రోజులపాటు షూటింగ్ కొనసాగింది. రెండు పాటలు, ఒక యాక్షన్ సీక్వెన్స్, ముఖ్యమైన టాకీ సీన్స్ రాజమండ్రి పరిసరాల్లో చిత్రీకరించారు. రామ్ పోతినేని,భాగ్యశ్రీ బోర్సే సహా, రావు రమేష్, మురళీశర్మ, సత్య, రాహుల్, రామకృష్ణ, వీటీవీ గణేష్ తదితర తారాగణంపై షూట్‌చేశారు. ఈనెల 28న హైదరాబాద్‌లో మూడో షెడ్యూల్ ప్రారంభం కానుందని నిర్మాతలు తెలిపారు.

నచ్చిన పనిలోనే సంతోషం



'మల్లారెడ్డి గారు ఎప్పుడూ చెబుతుంటారు, పాలు, పూలు అమ్మి ఈ స్థాయికి వచ్చానని. ఆయన దేశం గర్వించదగిన మూడు విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయటం మామూలు విషయం కాదు. మనకు నచ్చిన పనిని చేస్తేనే మనం నిజంగా సంతోషంగా ఉంటాం.అందుకే సినిమాల షూటింగ్ సమయంలో సంతోషంగా ఉంటా. బ్లాక్‌బస్టర్ అయితే ఇంకా ఆనందంగా ఉంటా. తల్లిదండ్రులు మన మంచికోసమే చెబుతారు. వారు చెప్పినట్లుగా నడుచుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి' అని కథానాయకుడు విజయ్ దేవరకొండ విద్యార్థులను కోరారు. సూరారంలోని మల్లారెడ్డి క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వార్షిక దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మల్లారెడ్డి యూనివర్శిటీ వ్యవస్థాపకులు మల్లారెడ్డి, విద్యాపీఠ్ చైర్మన్ డాక్టర్ సిహెచ్‌ప్రీతిరెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ గౌడ్, కథానాయకుడు నితిన్ తదితరులు సందేశాలు ఇచ్చారు.

ఐపిఎల్‌లో రెండు కొత్త రూల్స్

- బంతిపై లాలాజలం పూయవచ్చు
- రెండో ఇన్నింగ్స్‌లో రెండు కొత్త బంతులు
- రేపటినుంచి ఐపిఎల్ సీజన్-18



ఐపిఎల్ సీజన్-18 ట్రోఫీతో జట్ల కెప్టెన్లు

ముంబయి: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18 శనివారం నుంచి ప్రారంభం కానుంది. టోర్నమెంట్ ప్రారంభానికి ముందు గురువారం 10జట్ల కెప్టెన్లలో బిసిసిఐ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో బిసిసిఐ బౌలర్లకు శుభవార్త తెలిపింది. లాలాజలం వాడకంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. అలాగే పలు కీలక నిర్ణయాలను కెప్టెన్లకు వివరించింది. కరోనా మహమ్మారి నేపథ్యంలో బంతిని మెరిసేందుకు లాలాజలం వాడడాన్ని ఐసిసి నిషేధించింది. బిసిసిఐ సైతం ఐపిఎల్‌లోనూ ఈ నిషేధాన్ని అమలు చేసింది. ప్రస్తుతం కరోనా ముప్పు ఏమీ లేదని.. నిషేధం ఎత్తివేసినా ఇబ్బంది లేదని బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. అలాగే, కొత్తగా ఐపిఎల్ మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్ 11వ ఓవర్ తర్వాత రెండోబాల్‌ను ఇవ్వనుంది. రాత్రిపూట జరిగే ఈ మ్యాచ్‌పై పడే మంచు ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఈ రూల్‌ని తీసుకువచ్చింది. అయితే, బంతి మార్పుపై అంపైర్ల నిర్ణయానికే వదిలివేసింది. బంతిని మారుస్తారా? లేదా? అన్నది అంపైర్లు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మంచు ప్రభావం ఆధారంగా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ రూల్ రాత్రి మ్యాచులకు మాత్రమే వర్తించనుంది. ఐపిఎల్ సీజన్-18 ఈ నెల 22న డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరిగే తొలిమ్యాచ్‌తో ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది.

టోర్నీలో మొత్తం పది జట్లు పాల్గొంటాయి. 65 రోజులపాటు 13 వేదికల్లో 74 మ్యాచులు జరగనున్నాయి. ఇందులో 70 లీగ్ మ్యాచులు, నాలుగు ప్లేఆఫ్ మ్యాచ్‌లు ఉంటాయి. క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచులకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుండగా.. క్వాలిఫయర్-2, ఫైనల్‌కు కోల్‌కతాలో జరగనున్నాయి. మే 25న ఐపిఎల్ సీజన్-18 టైటిల్ సంగ్రామం ఈడెన్ గార్డెన్‌లోనే జరగనుంది.

ఐపిఎల్ సీజన్-18 షెడ్యూల్

తేదీ	ఎవరెవరికి..	వేదిక	సమయం
మార్చి22(శని)	కోల్‌కతా × బెంగళూరు	కోల్‌కతా	రా. 7.30గంll లకు
23(ఆది)	సన్‌రైజర్స్ × రాజస్తాన్	హైదరాబాద్	మ. 3.30గంll లకు
	చెన్నై × ముంబయి	చెన్నై	రా. 7.30గంll లకు
24(సోమ)	ఢిల్లీ × లక్నో	విశాఖపట్నం	రా. 7.30గంll లకు
25(మంగళ)	గుజరాత్ × పంజాబ్	అహ్మదాబాద్	రా. 7.30గంll లకు
26(బుధ)	రాజస్తాన్ × కోల్‌కతా	గౌహతి	రా. 7.30గంll లకు
27(గురు)	సన్‌రైజర్స్ × లక్నో	హైదరాబాద్	రా. 7.30గంll లకు
28(శుక్ర)	చెన్నై × బెంగళూరు	చెన్నై	రా. 7.30గంll లకు
29(శని)	గుజరాత్ × ముంబయి	అహ్మదాబాద్	రా. 7.30గంll లకు
30(ఆది)	ఢిల్లీ × సన్‌రైజర్స్	విశాఖపట్నం	మ. 3.30గంll లకు
	రాజస్తాన్ × చెన్నై	గౌహతి	రా. 7.30గంll లకు
31(సోమ)	ముంబయి × కోల్‌కతా	ముంబయి	రా. 7.30గంll లకు
ఏప్రిల్ 1(మంగళ)	లక్నో × పంజాబ్	లక్నో	రా. 7.30గంll లకు
2(బుధ)	బెంగళూరు × గుజరాత్	బెంగళూరు	రా. 7.30గంll లకు
3(గురు)	కోల్‌కతా × సన్‌రైజర్స్	కోల్‌కతా	రా. 7.30గంll లకు
4(శుక్ర)	లక్నో × ముంబయి	లక్నో	రా. 7.30గంll లకు
5(శని)	చెన్నై × ఢిల్లీ	చెన్నై	మ. 3.30గంll లకు
	పంజాబ్ × రాజస్తాన్	ఛండీగఢ్	రా. 7.30గంll లకు
6(ఆది)	కోల్‌కతా × లక్నో	కోల్‌కతా	మ. 3.30గంll లకు
	సన్‌రైజర్స్ × గుజరాత్	హైదరాబాద్	రా. 7.30గంll లకు
7(సోమ)	ముంబయి × బెంగళూరు	ముంబయి	రా. 7.30గంll లకు
8(మంగళ)	పంజాబ్ × చెన్నై	ఛండీగఢ్	రా. 7.30గంll లకు
9(బుధ)	గుజరాత్ × రాజస్తాన్	అహ్మదాబాద్	రా. 7.30గంll లకు
10(గురు)	బెంగళూరు × ఢిల్లీ	బెంగళూరు	రా. 7.30గంll లకు
11(శుక్ర)	చెన్నై × కోల్‌కతా	చెన్నై	రా. 7.30గంll లకు
12(శని)	లక్నో × గుజరాత్	లక్నో	మ. 3.30గంll లకు
	సన్‌రైజర్స్ × పంజాబ్	హైదరాబాద్	రా. 7.30గంll లకు
13(ఆది)	రాజస్తాన్ × బెంగళూరు	జైపూర్	మ. 3.30గంll లకు
	ఢిల్లీ × ముంబయి	ఢిల్లీ	రా. 7.30గంll లకు
14(సోమ)	లక్నో × గుజరాత్	లక్నో	రా. 7.30గంll లకు
15(మంగళ)	పంజాబ్ × కోల్‌కతా	ఛండీగఢ్	రా. 7.30గంll లకు
16(బుధ)	ఢిల్లీ × రాజస్తాన్	ఢిల్లీ	రా. 7.30గంll లకు
17(గురు)	ముంబయి × సన్‌రైజర్స్	ముంబయి	రా. 7.30గంll లకు
18(శుక్ర)	బెంగళూరు × పంజాబ్	బెంగళూరు	రా. 7.30గంll లకు
19(శని)	గుజరాత్ × ఢిల్లీ	అహ్మదాబాద్	మ. 3.30గంll లకు
	రాజస్తాన్ × లక్నో	జైపూర్	రా. 7.30గంll లకు
20(ఆది)	పంజాబ్ × బెంగళూరు	ఛండీగఢ్	మ. 3.30గంll లకు
	ముంబయి × చెన్నై	ముంబయి	రా. 7.30గంll లకు
21(సోమ)	కోల్‌కతా × గుజరాత్	కోల్‌కతా	రా. 7.30గంll లకు
22(మంగళ)	లక్నో × ఢిల్లీ	లక్నో	రా. 7.30గంll లకు
23(బుధ)	సన్‌రైజర్స్ × ముంబయి	హైదరాబాద్	రా. 7.30గంll లకు
24(గురు)	బెంగళూరు × రాజస్తాన్	బెంగళూరు	రా. 7.30గంll లకు
25(శుక్ర)	చెన్నై × సన్‌రైజర్స్	చెన్నై	రా. 7.30గంll లకు
26(శని)	కోల్‌కతా × పంజాబ్	కోల్‌కతా	రా. 7.30గంll లకు
27(ఆది)	ముంబయి × లక్నో	ముంబయి	మ. 3.30గంll లకు
	ఢిల్లీ × బెంగళూరు	ఢిల్లీ	రా. 7.30గంll లకు
28(సోమ)	రాజస్తాన్ × గుజరాత్	జైపూర్	రా. 7.30గంll లకు
29(మంగళ)	ఢిల్లీ × కోల్‌కతా	ఢిల్లీ	రా. 7.30గంll లకు
30(బుధ)	చెన్నై × పంజాబ్	చెన్నై	రా. 7.30గంll లకు
మే-1(గురు)	రాజస్తాన్ × ముంబయి	జైపూర్	రా. 7.30గంll లకు
2(శుక్ర)	గుజరాత్ × సన్‌రైజర్స్	అహ్మదాబాద్	రా. 7.30గంll లకు
3(శని)	బెంగళూరు × చెన్నై	బెంగళూరు	రా. 7.30గంll లకు
4(ఆది)	కోల్‌కతా × రాజస్తాన్	కోల్‌కతా	రా. 7.30గంll లకు
	పంజాబ్ × లక్నో	ధర్మశాల	రా. 7.30గంll లకు
5(సోమ)	సన్‌రైజర్స్ × ఢిల్లీ	హైదరాబాద్	రా. 7.30గంll లకు
6(మంగళ)	ముంబయి × గుజరాత్	ముంబయి	రా. 7.30గంll లకు
7(బుధ)	కోల్‌కతా × చెన్నై	కోల్‌కతా	రా. 7.30గంll లకు
8(గురు)	పంజాబ్ × ఢిల్లీ	ధర్మశాల	రా. 7.30గంll లకు
9(శుక్ర)	లక్నో × బెంగళూరు	లక్నో	రా. 7.30గంll లకు
10(శని)	సన్‌రైజర్స్ × కోల్‌కతా	హైదరాబాద్	రా. 7.30గంll లకు
11(ఆది)	పంజాబ్ × ముంబయి	ధర్మశాల	మ. 3.30గంll లకు
	ఢిల్లీ × గుజరాత్	ఢిల్లీ	రా. 7.30గంll లకు
12(సోమ)	చెన్నై × రాజస్తాన్	చెన్నై	రా. 7.30గంll లకు
13(మంగళ)	బెంగళూరు × సన్‌రైజర్స్	బెంగళూరు	రా. 7.30గంll లకు
14(బుధ)	గుజరాత్ × లక్నో	అహ్మదాబాద్	రా. 7.30గంll లకు
15(గురు)	ముంబయి × ఢిల్లీ	ముంబయి	రా. 7.30గంll లకు
16(శుక్ర)	రాజస్తాన్ × పంజాబ్	జైపూర్	రా. 7.30గంll లకు
17(శని)	బెంగళూరు × కోల్‌కతా	బెంగళూరు	రా. 7.30గంll లకు
18(ఆది)	గుజరాత్ × చెన్నై	అహ్మదాబాద్	మ. 3.30గంll లకు
	లక్నో × సన్‌రైజర్స్	లక్నో	రా. 7.30గంll లకు
20(మంగళ)	క్వాలిఫయర్-1	హైదరాబాద్	రా. 7.30గంll లకు
21(బుధ)	ఎలిమినేటర్	హైదరాబాద్	రా. 7.30గంll లకు
23(శుక్ర)	క్వాలిఫయర్-2	కోల్‌కతా	రా. 7.30గంll లకు
25(ఆది)	ఫైనల్	కోల్‌కతా	రా. 7.30గంll లకు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68